# దృశ్య కావ్యం

(కథా సంపుటి)

టి. ఎస్. ఎ. కృష్ణమూర్తి

కళా ప్రచురణలు

మదనపల్లె - 517 325, చిత్తూరు జిల్లా (ఎ.పి.)

దృశ్యకావ్యం (కథాసంపుటి)
ప్రథమ ముద్రణ : జనవరి 2012
ప్రతులు : 1000
హక్కులు : © రచయితవి

కళా ప్రచురణలు 2
మదనపల్లె - 517 325
వెల : ₹ 50

**కర్నూలు సాహితీ సుధ గౌరవ చైర్మన్ శ్రీ M.P.M. రెడ్డి**
**(శ్రీ మారం పెద్ద మద్దిలేటి రెడ్డి) గారి సౌజన్యంతో**

ప్రతులకు : అన్ని పుస్తక కేంద్రములు
లేదా
**టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**
3-169-16 రామారావు కాలనీ
బాపూజీ మునిసిపల్ స్కూల్ రోడ్
**మదనపల్లె - 517 325**
చిత్తూరు జిల్లా (ఆం.ప్ర.)
ఫోన్ : 08571 - 221963
సెల్ : 93472 98942

ముద్రణ : **విజయవాణి ప్రింటర్స్**
గోసులకురప్పల్లి రోడ్డు,
చౌడేపల్లి - 517 257

# అంకితం



**కీ॥శే॥ ఎ. వెంకటస్వామి**
2-2-1930 - 23-5-1998
రిటైర్డు కో ఆపరేటివ్ సబ్‌రిజిస్ట్రార్

**స్వర్గీయ బృందమాలాదేవి**
(మనోరమా సుందరీ కుమారి బృందమాలాదేవి)
10-10-1940 - 7-5-2010
గృహిణి

**మదనపల్లె - 517 325**
చిత్తూరు జిల్లా

**మా** మేనత్త బృందమాలాదేవిగారు. చిన్నప్పుడు మాకు స్నానాలు చేయించి, తలలుదువ్వి, టిఫన్లు తినిపించి రామారావు పాఠశాలకు పంపించడంలో మాతల్లి గారికీ, అవ్వగారికీ సహకరించేవారు. ఆమె పెళ్ళయ్యాక ఆమె భర్త శ్రీ ఆకుల వెంకటస్వామిగారి వూరు... చిత్తూరు జిల్లా (కదిరిరోడ్) తుమ్మణంగుంట రైల్వేగేటు ప్రక్కనే వున్న మల్లూరివారి పల్లెలోనే నా జీవితంలో తొట్టతొలిసారి బొగ్గురైలును చూడడం! ఆ రైల్లూ, ఆ ప్రకృతీ... ప్రతి శెలవులూ నన్ను అక్కడే గడిపేలా చేశాయి. నాలో భావుకతకు తొలిబీజాలు పడింది అక్కడే మరి!! ఆ పల్లెతో ఎంత అనుబంధమో? అక్కడి అప్పటి మనుషులూ, బంధాలూ అన్నీ కాలగర్భంలో కలసిపోయాయి. జ్ఞాపకాలుగా వాళ్ళ సమాధులున్నాయి ఇప్పుడక్కడ.

మా మేనమామ వెంకటస్వామిగారు కో ఆపరేటివ్ డిపార్టుమెంటులో పనిచేస్తూ మదనపల్లెలో స్థిరపడ్డారు. ఎక్కువగా తెల్లని దుస్తులు ధరించేవారు. మాట కఠినం... మనసు ప్రశాంతం! ముక్కుసూటి మనిషి. వేటంటే ప్రాణం. భూమా వెంకటస్వామి అనే ఆయన తుపాకీ మోసుకువస్తూంటే వేటకు వెళ్ళేవారు. నా జీవితంలో ఒకే ఒక పర్యాయం వేటలో ఆయనకు సహకరించే అవకాశం లభ్యమైంది ఓ పెద్ద చెరువు మధ్యన. ఉద్యోగ బాధ్యతలు క్రమశిక్షణతో, నిజాయితీగా ఎలా నిర్వర్తించాలో ఆయన్ను చూసి నేర్చుకొన్నాను. అది నా ఉద్యోగ జీవితంలో నాకెంతో ఉపకరించింది. వారిద్దరి జ్ఞాపకాలకూ ఈ చిరుపొత్తం అంకితం.

*- టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి*

# కృతజ్ఞతలు

**పు**స్తక రూపాలుగా ప్రచురణకు నోచుకోవాల్సిన నా రచనలయితే బాగా ఎక్కువగానే ఉన్నాయి... కానీ... ఇక పుస్తకాలను ముద్రించలేనేమో అని అనుకుంటూ ఆ విషయాన్ని సాహితీ ఆప్తులు శ్రీ వియోగి (శ్రీ కోపల్లె విజయప్రసాద్, సీనియర్ రచయిత, కర్నూలు) గారితో ఓనాడు ఫోను సంభాషణ మధ్యలో వ్యక్తపరచడం జరిగింది. తరువాత వారు రిటైర్డు ప్రొఫెసర్ ఎ. కృష్ణ (కర్నూలు) వారి చిరునామా, ఫోను నెంబరు తెలిపి వారికి కొన్ని కథలను నిర్ణీత సమయంలోగా పంపితే గ్రంథ ప్రచురణకు కొంత ఆర్థిక సహాయం లభ్యం కాగలదన్న వైనాన్ని తెలియపరిచారు.

పనుల ఒత్తిడివల్లా, మతిమరుపువల్లా నేను వారి సలహాను అమలు పరచడంలో ఆలస్యం చెయ్యడం జరిగింది. అయినా కూడా వారు పలుమార్లు నన్ను ఫోనుద్వారా హెచ్చరించడంతో నేను ఈ సంపుటిలోని కథల జిరాక్సు కాపీలను శ్రీ ఎ. కృష్ణగారి చిరునామాకు పంపడం జరిగింది.

నిర్ణీత గడువులో చిట్టచివరి రోజు నా రచనలు అందాయనీ, జడ్జీల పరిశీలనకు పంపడం జరిగిందనీ శ్రీ ఎ. కృష్ణగారు తెలియజేశారు. తదుపరి కొద్ది రోజులలోనే నా కథలు ఆర్థిక సహకారానికి ఎంపిక అయ్యాయనీ నిర్ణీత గడువులోగా గ్రంథముద్రణ గావించి పది కాపీలు పంపిన ఎడల రూ॥లు 5000/- (ఐదువేల రూపాయలు) ఆర్థిక సహకారం అందగలదనీ, గడువు ముగిసిన పిదప అందే గ్రంథాలకు సదరు సహకారం లభ్యంకాదనీ తెలియపరుస్తూ శ్రీ ఎ. కృష్ణగారి నుండీ నాకు లేఖ అందింది.

వారికి ఫోను ద్వారా నేను కృతజ్ఞతలు తెలియపరచినప్పుడు వారు...

"... ఏటా సకాలంలో అందిన రచనలను న్యాయనిర్ణేతలకు పంపడం, ఎన్నికయిన వారు సకాలంలో గ్రంథముద్రణ గావించితే వారికి కర్నూలు సాహితీ సుధ గౌరవ చైర్మన్ శ్రీ M.P.M. రెడ్డి (శ్రీ మారం పెద్ద మద్దిలేటి రెడ్డి) గారి నుండీ అందు ఆర్థిక సహకారాన్ని అందించడం చేయు పోస్ట్‌మెన్ లాంటి వ్యక్తిని మాత్రమే నేను. మీ కృతజ్ఞతలు శ్రీ రెడ్డిగారికే చెందుతాయి!" అని తెలిపారు.

పై ముగ్గురు మహానుభావులకూ, ఈ సంపుటిలోని కథలను ముందుగా ప్రచురించిన పత్రికల వారికీ, సకాలంలో ముద్రణ గావించి ఇచ్చిన విజయవాణి ప్రింటర్స్, చౌడేపల్లె వారికీ, వారి సిబ్బందికీ మరియు... అక్షర దోషాలను ఓపికగా సరిదిద్ది పెట్టే సాహితీమిత్రులు, పద్యకవి, కథారచయిత శ్రీ కలువకుంట్ల గురునాథపిళ్ళై మరియు శ్రీ కె. సిద్ధారెడ్డి, Be (K.V. సిద్దారెడ్డి) రిటైర్డ్ పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపాల్ గార్లకూ హృదయపూర్వక కృతజ్ఞతాభి వందనములు తెలియజేయుచున్నాను.

– *రచయిత*

# దృశ్యకావ్యంలో........


| | | |
|---|---|---|
| 1. | నేనెందుకు వ్రాశాను? ఎలా?? | 7 |
| 2. | దాహం | 13 |
| 3. | గుండెనిండుగా ఉంది! | 21 |
| 4. | కచ్చాకో.. బుచ్చాకో.. కలోగంజో... | 27 |
| 5. | దృశ్యకావ్యం | 30 |
| 6. | పాముల రాజ్యం | 44 |
| 7. | మీరే చెప్పండి | 56 |
| 8. | తడిఆరని గుండె ప్రశ్న | 61 |
| 9. | భీమరథి | 78 |
| 10. | ఆత్మానందం | 88 |
| 11. | అంతకుమించిన ఆలోచన... | 100 |
| 12. | అడుగు జాడలలో... | 105 |
| 13. | తప్పు | 111 |
| 14. | పాతసైకిల్ | 115 |
| 15. | దెయ్యం | 125 |

# నేనెందుకు వ్రాశాను? ఎలా??

**త**రచు నాకు నేనే వేసుకుని జవాబులు వెతుక్కోవడానికి ప్రయత్నించే ప్రశ్నలివి! ఎందుకంటే, ప్రపంచంలోని తెలివి తక్కువ వాళ్ళలో నేనూ ఒకడినని నా ప్రగాఢ విశ్వాసం! నా చేతకానితనంతో నా జీవితంలో నేనెదుర్కొన్న అనేక కష్టనష్టాలూ, మానసిక క్లేశాలే అందుకు నిదర్శనం. పైగా... నాకు శ్రద్ధగా చదవడం రాదు నిజానికి. శ్రద్ధగా వ్రాయగలడమూ తక్కువే. గొప్పగా, తీక్షణంగా ఆలోచించ గలగడం కూడా అంతంతమాత్రమే! చాలని కొదవకు మతిమరుపు ఒకటి... ఈరోజు చూచిన, పరిచయం అయిన వ్యక్తి మూడు రోజుల తరువాత కన్పిస్తే జ్ఞాపకానికి రాకపోవడం... అదే విధంగా ఈరోజు ఏదో పనిలో వుండగా స్ఫురించిన ఒక మంచి ఆలోచన సైతం తరువాత కాస్సేపటికి గుర్తుండకపోవడం పరిపాటి. నాలో ఇంగిత జ్ఞానం, సమయస్ఫూర్తి, ఓపికా కూడా తక్కువే నిజానికి. అలాంటిది నేను కొద్దో, గొప్పో మంచికథలే వందా ఏభయి వ్రాయడం ఏమిటి? వ్రాసిన కొద్దిపాటి నవలలూ, నవలికలూ సైతం నాకు అవార్డులనూ, పురస్కారాలనూ తెచ్చిపెట్టడం ఏమిటి?? అన్న ఈ రెండు ప్రశ్నలూ నన్ను అబ్బురపరచేవే తరచు.

'పైనున్న దేవుడో, మరో అతీంద్రియ శక్తో నాచేత వ్రాయిస్తున్నది!' అని నాకు నేను జవాబులు చెప్పుకుంటుంటాను. అయితే 'ఏ అదృశ్య శక్తో తోడ్పడినా నీ ప్రయత్నమూ కొంతయినా ఉండితీర్తుంది కదా?' అని నిలదీస్తుంది నా మనసు. అప్పుడు నాకుతోచే జవాబు ఒక్కటే... గడచిన అరవై పైచిలుకు సంవత్సరాలలో నడచిన నా జీవనశైలే నా ప్రయత్నం అయివుంటుందని...

అరవైయేళ్ళ క్రితం ఆకుచాటు పిందెలాంటి అందమైన చల్లటి పుణ్యభూమి మదనపల్లె (చిత్తూరు జిల్లా)లో ఘోషా ఆస్పత్రి అని పిలవబడ్తున్న ఎం.ఎల్.ఎల్. ఆస్పత్రిలో నా జననం జరిగింది. పచ్చని ప్రకృతి మధ్యన లోయప్రాంతంలో ఒదిగివుండిన మదనపల్లెలోని తూర్పు కొత్తపేట వీధిలో మాదో సంపన్నమైన కుటుంబం అప్పటికి. మా తాత తొడిమెల్ల సుబ్బయ్యనాయుడుగారు ఇప్పటి కడప జిల్లా బద్వేలుకు చెందిన వారు. వృత్తిరీత్యా బ్రిటిషిండియా కాలంలో ఫారెస్టు డిపార్టుమెంటులో హార్సు రన్నరుగా ఉండి, బదిలీపై తంబళ్లపల్లె ప్రాంతానికి వచ్చి, అక్కడ ఉద్యోగం వదిలివేసి

వేలం పాటలలో ఆ ప్రాంతపు కల్లు దుకాణాలను పాడుకుని బాగా డబ్బు చేసుకుని మదనపల్లెకు వచ్చి స్థిరపడ్డారు. మా అవ్వ పాపులమ్మగారి జన్మస్థలం కుక్కరాసుపల్లె ప్రాంతం. మా జేజి శేషమ్మగారు బాగా ధనవంతురాలైన ధర్మవడ్డీ వ్యాపారి. మా జేజి, పెద్ద మేనత్త అంజనాదేవి గార్లు ఇరువురికీ భర్త అయిన మైలాపూరు శ్రీరాములు గారు పెద్దమండెం మీదుగా రాయచోటికి బొగ్గు బస్సు నడిపించి ఆపై మెకానిక్ ఆంజనేయులుగా గొప్ప పేరు పొందిన వారు. ఆయన పేరిట బర్మావీధి యందలి ఒక వీధికి శ్రీరాములు వీధి అని నేటికీ పేరు ఉన్నది. ఆ వారవడిలో మా తండ్రిగారైన టి.ఎస్. ఆంజనేయులు గారు ఇంటర్ మధ్యలోనే చదువుకు స్వస్థి చెప్పి కొద్దికాలం కండెక్టరుగా, చెకింగ్‌గా, డ్రయివరుగా పనిచేసి ఆపై స్వంతంగా లారీలు నడిపిస్తూ పెట్రోలు లారీల యజమాని అయ్యాడు. నా చిన్నతనంలో వారు మద్రాసు నుండీ మిలటరీ లారీలను వేలంలో కొనితెచ్చి వాటి ఇనుప బాడీలను తీసివేయించి చెక్క బాడీలను కట్టించుకుని మదనపల్లెలో మొట్టమొదట డీజలు వాహనాలను ప్రవేశపెట్టి పేరు పొందారు. ఆ రోజులలో లారీ, బస్ యజమానులకు గొప్ప గౌరవం ఉండేది. మా తల్లిగారు కమలాక్షి (కమలమ్మ) కడప ఆకులవీధిలో జన్మించిన వారు.

తూర్పు కొత్తపేట వీధిలో పెద్దంత ఇల్లు, పనిమనుషుల కోసం వెనుక రెండు చిన్నసైజు రేకుల ఇండ్లు. చిన్నసైజు బ్రిటిష్ బంగళాలా ఉండేది మా ఇల్లు. సమీపంలోని రామారావు అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఇ.ఎస్.ఎల్.సి. వరకు, ఆపై గిరిరావు దివ్యజ్ఞాన ఉన్నత పాఠశాలలో హైస్కూలు చదువు... సమాజ ప్రేమికులు, సంస్కారవంతులూ అయిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల వద్ద సాగింది. ఇప్పుడు నాలో కన్పించే మంచితనం, సంస్కారాలు, మనుషుల్ని ప్రేమించే గుణం... అన్నీ ఆ టీచర్లు పెట్టిన భిక్షగా భావిస్తుంటాను నేను. వారి జ్ఞాపకాలు అలాంటివి.

మా ప్రాంతానికి దగ్గరగా రైలుమార్గం లేదు. నా జీవితంలో మొట్టమొదట నేను బొగ్గు రైలును చూసింది మా మేనత్త బృందమాలాదేవి గారి మెట్టినిల్లు అయిన మల్లూరివారి పల్లె ప్రక్కనే వున్న తుమ్మణంగుట్ట రైల్వేగేటు దగ్గర. అదో మరపురాని మధుర ఘట్టం. ప్రకృతి మధ్యన సాగే బొగ్గు బండ్లను చూడడంలో అనిర్వచనీయమైన ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, అద్భుతమైన ఆలోచనలనూ, క్రొత్త ఊహలనూ పొందగలిగే వాడిని. అందుకే నా పాఠశాల సెలవులన్నీ మల్లూరివారిపల్లెలో లేదా రైలుమార్గమున్న పీలేరులోని బంధువుల ఇండ్లలో గడచిపోయేవి. బొగ్గు రైళ్ళతో నా అనుబంధం నన్ను ప్రకృతి ప్రేమికుడిగా తయారుచేసింది.

నేను కథకుడు కావడానికి మొట్టమొదటి కారణం... చిన్నతనంలో రాత్రులందు అవ్వా, తాతల మధ్యలో పడుకుని వారు చెప్పిన అధ్భుతమైన కథలను వినడం. రెండవ కారణం బొగ్గు రైళ్ళతో అనుబంధం ద్వారా ఏర్పడిన ప్రకృతి ఆరాధన. మూడవ కారణం పుస్తక పఠనం. (మా ఇంట్లోనే చిన్నసైజు మంచి లైబ్రరీ ఉండేది. మా ఇంటికి కొన్ని గజాల దూరంలోనే శాఖా గ్రంథాలయం ఉండేది). ఈ మూడు కారణాలూ కాక మరో ముఖ్యమైన కారణాన్ని కూడా చెప్పుకోవచ్చు. అది... దురదృష్టవశాత్తూ మా కుటుంబానికి నెమ్మదిగా సంప్రాప్తమైన పేదరికం!

కొత్తపేటవీధుల లోని ఇండ్లూ, ఊరి వెలుపలి పొలాలు, లారీలు మొదలైనవన్నీ పోగట్టుకుని, ఓడలు బండ్లవును అన్నట్లుగా... బస్సు డ్రయివరుగా మా తండ్రిగారి సంపాదనతో, మా మేనమామ పి. రామాంజులు గారి సహాయ, సహకారాలతో కొంతకాలం మా కుటుంబం అనామకంగా కాలం గడపాల్సి వచ్చింది. ఆ స్థితిలో నేను ఎదుటి మనుష్యుల ముఖాలలో చకచకా మందహాసాలు మాయమయి రకరకాలుగా మార్పులు చోటు చేసుకొన్న, రంగులు మారిన విధానాలను గమనిస్తూ, మనుష్యుల మనస్తత్వాలను బేరీజు వెయ్యగల శక్తిని కొద్దికొద్దిగా సంపాదించుకో గలిగాను.

“పేదరికం గుమ్మంగుండా ప్రవేశిస్తే, ప్రేమ పక్షిలా కిటికీ గుండా ఎగిరిపోతుంది” అన్న ఆంగ్ల సామెతలోని వాస్తవాన్ని పూర్తిగా గ్రహించగలిగాను.

కొంతమంది సాహితీకారులు “మనుషుల్ని చదివి రచనలు సాగించడం ఏమిటి?” అని అంటూంటారు. మనుషుల్ని చదవడం ఒక గొప్పకళ! దాన్ని అలవర్చుకోగలిగి నప్పుడు ప్రపంచాన్నే చదివెయ్యవచ్చు అని అన్పించసాగింది నాకు.

ప్రకృతి ఆరాధన నా హృదయంలో అందమైన భావాలను రేకెత్తించి నాకు మనుష్యుల్ని ప్రేమించడం నేర్పిస్తే, పరిస్థితులలో వచ్చిన పెనుమార్పుల వల్ల నాలో కలిగిన సంఘర్షణలు మనుషుల మనస్తత్వాలను గూర్చి ఆలోచించేలా చేశాయి. ఆ అంతర్మథనం వల్లే నాలో ఓ రచయిత ఉత్పన్నమయి ఉండాలి బహుశా. అందువల్ల పదహారేళ్ళ వయసులోనే ఆవేశంగా కలం పట్టాను. 1968 నుండీ దాదాపు మూడేండ్ల పాటు ఏం వ్రాయాలో, ఏం వ్రాయకూడదో తెలియకుండానే రచనలు సాగించాను. నన్ను గైడ్ చెయ్యడానికి నాకు రచయితలు, సాహితీవేత్తలు ఎవరూ తెలియదు. పరిచయం వున్న ఒకే ఒక అధ్యాపకులు డా॥ మల్లేల గురవయ్యగారు నేను వ్రాసిన కాగితాలలోని అక్షర దోషాలను మాత్రమే సరిదిద్దేవారు...

ఎట్టకేలకు మద్రాసు తంబుచెట్టివీధి నుండీ వెలువడుతున్న ఆంధ్రపత్రిక వారు నాకథ ప్రచురణకు స్వీకరించినట్లుగా శివలెంక శంభుప్రసాద్‌గారి సంతకంతో కార్డు అందింది. 1971 సెప్టెంబరు నెలలో రెండు వారాలపాటు కళానికేతన్ స్టూడియో వారు గీసిన చిత్రాలతో ప్రచురితమైంది నా మొట్టమొదటి కథ 'ఐ కెనాట్ ఫర్‌గెట్ హర్'. ఆ రోజుల్లో ఆంధ్రపత్రిక వెల నలభయి పైసలు. ఆ కథకు నాకు అందిన పారితోషికం డెబ్బయి అయిదు రూపాయలు. ఆపై మూడు నాలుగేళ్ళు పిట్టకతలు, ప్రేమకతలే వ్రాశాను. తరువాత దానంతట అదే దృక్పథం మారుతూ వచ్చింది.

పేదరికం, ఆకలి, దురదృష్టకర సంఘటనలు నేపథ్యంగా నేను వ్రాసిన 'జీవితం సినీమా కాదు' కథ 1975లో ప్రచురితం అయి నాకు కొంత మంచి గుర్తింపునే తెచ్చిపెట్టింది. అక్రమ సంబంధాలు తెచ్చిపెట్టే అనర్థాలు నేపథ్యంగా హృద్యంగా వ్రాయబడ్డ నా పెద్దకథ 'తెగిపోయిన గాలిపటాలు' నన్నో వైవిధ్య భరితమైన రచయితగా నిలబెట్టింది ఆ రోజులలోనే! అలాగే నిరుద్యోగ సమస్యమీద నేను వ్రాసిన 'ది లాస్ట్ డేట్' కథ నాకో స్థాయిని కల్పిస్తే, వృద్ధాప్యం తాలూకు సమస్య మీద నేను వ్రాసిన 'వరండా' కథ ఆ స్థాయిని పటిష్ట పరచింది.

బాహ్య సౌందర్యం–మానసిక, అంతరంగిక సౌదర్యాల నేపథ్యంలో నేను వ్రాసిన పెద్ద కథ 'పెన్ ఫ్రెండ్', ప్రేమ–మానవ సంబంధాల మీద వ్రాసిన పెద్ద కథ 'అడ్డదారులు', వడ్డీ వ్యాపారిని దోషిగా చూపుతూ వ్రాసిన హాస్య నవలిక 'డి.డి.ల వల', వడ్డీ వ్యాపారిని సమాజ సేవకుడిగా ప్రస్తుతిస్తూ వ్రాసిన పెద్ద కథ 'వడ్డీ' మొదలైనవి నాకు కీర్తి ప్రతిష్టలను కలిగించినవిగా భావిస్తాను నేను. అప్పటికి ఆవేశం తగ్గలేదు నాలో.

ఇక ఆపై వెనుతిరిగి చూసుకోలేదు నేను! ఓ గిరగీసుకుని అందులో కూర్చోనూ లేదు!! వాదాలు, ఇజాలు వగైరాల జోలికి వెళ్ళనూ లేదు. విషాదంగా కన్పించిన ప్రతి ముఖాన్నీ పరిశీలిస్తూ, ఎదురయ్యే ప్రతి సమస్యకూ మూలాల్ని అన్వేషిస్తూ ముందుకు సాగాను. నాకు తారసపడ్డ ఆనందాలు, విషాదాలు, అద్భుతాలు, అసహ్యాలు... అన్నీ కూడా నా కలానికి మంచి బలాన్నిస్తూ వచ్చాయి.

జీవన పోరాటంలో బ్రతకడానికి నేను చేసిన చిన్నచిన్న ఉద్యోగాలు, పనులూ... వాటిలో తారసపడ్తూ వచ్చిన దిగువ మధ్యతరగతి, పేద ప్రజలూ, ప్రదేశాలూ నాకెన్నో కథా వస్తువుల నందించాయి. ఇహ పురపాలక శాఖలో చిన్న ఉద్యోగం సంపాదించుకుని నెమ్మదిగా పైకెదిగే క్రమంలో నా జీవనప్రయాణం పూర్తిగా ప్రజాసంబంధాల మధ్యనే నడవడం రచయితగా నా ఎదుగుదలకు పెద్దకారణం.

ఆలస్యంగా అయినా వల్లంపాటి వెంకటసుబ్బయ్య, ఆర్.ఎస్. సుదర్శనం, ఆర్. వసుందరాదేవిగార్లలాంటి సాహితీవేత్తలతో, ఎ. మల్లేశ్వరరావుగారి లాంటి సాహిత్యంపై మంచి పట్టున్న మానవతా వాదులతో సాన్నిహిత్యం జీవితానుభవాన్ని మరింత పెంచి పెద్ద చేసింది. అందువల్ల మరిన్ని సాహిత్య ప్రక్రియలను చేపట్టగలిగాను.

ఇహ నవలల విషయానికి వస్తే నేను వ్రాసిన మొట్టమొదటి నవల 'జవాబు లేని ప్రశ్న'. 1988 చివర్లో విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగు ఎదుటనున్న ఐ.ఏ.ఎస్. ప్రొడక్షన్స్ అనే టీ.వి. సీరియల్స్ వారికి పంపి పోగొట్టుకున్నాను. నావద్ద కాపీ లేకపోయింది. రెండవ నవల 'కలువ విరిసింది' స్వాతి మాసపత్రిక అనుబంధ నవలగా వెలువడి నాకు కుప్పం రెడ్డెమ్మ సాహిత్య సొసైటీ వారి ప్రోత్సాహక అవార్డును తెచ్చిపెట్టింది. తరువాత ఆ నవలను హైదరాబాదు జయంతి పబ్లికేషన్స్ వారు పునర్ముద్రించారు. యేడాది క్రితం అనంతపురం నుండి ఒక వ్యక్తి వచ్చి సినిమా తీస్తానని అనుమతి తీసుకువెళ్ళాడు. తరువాత రాలేదాయన. మూడవ నవల 'ఆయుధం' ఇంకా ముద్రింపబడలేదు! నాలుగవ నవల 'కొత్త బంగారు లోకం' ఆంధ్రభూమి సీరియల్. తరవాత నవలగా ముద్రింపబడింది. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ 'ఉత్తమ నవల 2008' అవార్డును పొందింది. పునర్ ముద్రణను కూడా పొందింది ఈ నవల. ఐదవ నవల 'కలల రాజ్యం'... ఒక పత్రిక పరిశీలనలో వుంది. దాదాపు మరో పది నవలికలు, హాస్య నవలికలు పత్రికా ముఖంగా వెలువడ్డాయి.

నేను అమితంగా ప్రేమించే చల్లని నా జన్మభూమి మదనపల్లెలో వచ్చిన విషపరిణామాలు నేపథ్యాలుగా 'ఘటోద్గజపురం గాథలు' అన్న వ్యంగ్య కథనాలు సిరీస్‌గా వ్రాస్తున్నాను. ప్రచురితమైన వాటిలోంచి కొన్ని కథలను ప్రఖ్యాత కార్టూనిస్టు రాగతిపండరి గారి చిత్రాలతో చిన్న సంపుటిగా విశాలాంధ్ర వారు విడుదల చేశారు. పుస్తక రూపంగా లభ్యమవుతున్న నా రచనలు...

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి కథలు | - | కథా సంపుటి | - | 2003 |
| 2. కొత్తబంగారు లోకం | - | నవల | - | 2006 |
| 3. కొత్తబంగారు లోకం రెండవ ముద్రణ | | | - | 2010 |
| 4. అడ్డదారులు | - | కథా సంపుటి | - | 2006 |
| 5. కలువ విరిసింది | - | నవల | - | 2009 |
| 6. ఈ గాలినాది... ఈ నేలనాది | - | కథా సంపుటి | - | 2010 |
| 7. ఘటోద్గజ పురంగాథలు | - | హాస్యకథా సంపుటి | - | 2011 |

ఇంకా అనేక కథా సంకలనాలలో నా కథలు, ఇతర రచనలు చోటుచేసుకున్నాయి. చాల పుస్తకాలకు ముందు మాటలు వ్రాయగల భాగ్యం దక్కింది. చిత్తూరు జిల్లా రచయితలను గూర్చి కూడా కొంతమేర వ్రాస్తున్నాను.

శ్రీమతి కుప్పం రెడ్డెమ్మ సాహిత్య సొసైటీ, భరతముని ఆర్ట్స్ అకాడమీ, మెక్సా, రచన, ఆంధ్రజ్యోతి, పీలేరు కల్చరల్ అకాడమీ, చిరసం, మరసం, మదనపల్లె చైతన్య భారతి, కొడవలూరు బలరామయ్య ట్రస్ట్, సోమేపల్లి సాహితీ ట్రస్ట్, హైదరాబాదు సి.పి. బ్రౌన్ అకాడమీ, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మొదలైన వారి ద్వారా విలువైన అవార్డులు, పురస్కారాలు లభ్యమయ్యాయి.

ఇటీవలే షష్ఠిపూర్తి చేసుకున్న నేను చదవాల్సిందీ, వ్రాయాల్సిందీ చాలచాల ఉంది. కానీ విరామ మివ్వని నిరంతర జీవన సంగ్రామానికి అంతం కన్పించడం లేదు... వయసు ప్రభావం కూడా తన పని మొదలు పెడ్తున్నట్లుంది. ఏది యేమయినా అధ్యయనం చేస్తూ, వ్రాస్తూ చివరి క్షణాల వరకూ గడపాలన్నదే నా ప్రగాఢ ఆకాంక్ష. అందుకు నా శ్రీమతి కళావతి, నా పిల్లలు శివభారత్ మూర్తి, ప్రసన్నలక్ష్మిల సహకారం సదా లభ్యమవుతుండడం ముదావహం.

*– ఆలోచించండి, మాసపత్రిక, సెప్టెంబర్ 2011*

# దాహం

“సార్, మీకోసం ఎవరో పాఠకుడు, ఈ సమయంలో ఎవర్నీ చూడరని చెప్పినా వినడం లేదు. చాలా దూరంనుండి వచ్చాడట!”

ఇంటర్‌కమ్‌లో నా సెక్రటరీ చెప్పింది వినగానే కాస్త ఇబ్బందిగా ఫీలయ్యాను. పేపర్ మీదికి ఎక్కాల్సిన కొన్ని భావాలు సరైన రూపుదిద్దుకోకుండా మనసులోనే అలుక్కుపోతుండడం వల్ల అరగంట నుండీ అవస్థపడుతూ కొంత చిరాకుగా కూడా ఉన్నాను నిజానికి. పైగా నేనా సమయంలో ఎవరినీ కలుసుకుని నా సమయం వృథా చేసుకోను.

సెక్రటరీ ‘పాఠకుడు’ అనడంలోనే వచ్చిందెవరో యావరేజ్ మనిషని తెలిసిపోతోంది. కాకపోతే ఆమె స్వరంలో ‘పాఠకులు’ అన్న మన్నన ఉండి ఉండేది తప్పకుండా. “ఇప్పుడు నేను ఎవర్నీ కలుసుకోలేను” అనేశాను.

కానీ సరిగ్గా రెండే రెండు నిముషాలలో ఇంటర్ కం బజర్ మ్రోగింది మళ్ళీ.

“సార్ అతడు వినడంలేదు. చాలా ఏళ్ళుగా మీ అభిమాన పాఠకుడట. పైగా చాలాదూరం నుండీ మిమ్మల్ని కలుసుకోవడం కోసమే వచ్చాడట”

“పంపించండి!” అన్నాను చాలా విసుగ్గా విధిలేక.

✶ ✶ ✶

నిముషం తరువాత నా గదిలోకి ప్రవేశించిన ఆ వ్యక్తిని పరీక్షగా చూస్తూ అతని నమస్కారాన్ని స్వీకరించి “కూర్చోండి” అన్నాను.

కొద్దిగా మాసిన గెడ్డం, కాస్త చెదిరిన క్రాఫ్‌తో ఉన్న ఆ వ్యక్తి చాలా నమ్రతగా నా ఎదుటనున్న కుర్చీలో కూర్చున్నాడు. చాలా సాధారణమైన దుస్తులు ధరించి ఉన్నాడు.

“మీ పేరు?” మామూలుగా ప్రశ్నించాను.

“మధుమూర్తి సార్!”

“ఎక్కడ్నుండీ వచ్చారు?”

“పెనుమూరు అనే ఓ చిన్న ఊరు సార్. చిత్తూరు జిల్లాలో ఉంది”

నాకు స్పష్టంగా జ్ఞాపకం వచ్చింది. నా కథల మీద, నవలల మీద ఈ మధుమూర్తి రాసిన ఉత్తరాలు అనేకం అనేక పత్రికలలో ప్రచురితం అయ్యాయి... అవుతున్నాయి. ఈ తంతు చాలా సంవత్సరాలుగా సాగుతోంది. పైగా ఇతడు నాకు కూడా ఎన్నో పర్యాయాలు ఎంతో అభిమానంతో నన్నభినందిస్తూ ఉత్తరాలు రాశాడు. మంచి ఉత్తరాలు రాయగలిగే ఆర్ట్ అతనిలో ఉంది. నిజం చెప్పాలంటే అతనిలో ఒక సద్విమర్శకుడు కూడా దాగి ఉన్నాడు. అయితే అభిమానులందరితో చనువుగా స్నేహం పెంచుకునే ఓపిక లేదు నాకు. పైగా నా స్థాయి వేరు, నా కేటగిరీ వేరు.

అందుకే "అలాగా!" అన్నాను పైకి మామూలుగా ఏం తెలియనట్లుగా.

"ఈమధ్యన ఏం రాస్తున్నారు సార్?" అభిమానంగా ప్రశ్నించాడు.

నాకెందుకో అకారణంగా చిరాకు పెరిగింది.

"ఏం రాయడంలేదు!" అన్నాను.నా స్వరంలో విసుగు ధ్వనించడం నాకే స్పష్టంగా తెలిసింది.

"మీ రచనలలో 'చీకటిరాజ్యం' నవలన్నా 'మన్నుతిన్న పాము' కథన్నా ప్రాణం సార్ నాకు!" అన్నాడతడు.

"అలాగా!" అన్నాను నేను.

పాఠక ప్రముఖులతో అంతకన్నా ప్రత్యేకంగా సంభాషణ పెంచుకోను. అది నా నైజం.

"అడవి మధ్యన అతడు" నవల సైతం నన్నెంతో ప్రభావితం చేసింది సార్. అందులో అయితే ప్రతి ఒక్క వాక్యం పటిష్టంగా, నిర్దిష్టంగా, నిర్మాణాత్మకంగా, లోపరహితంగా ఉన్నాయి. మీ రచనలన్నింటిలో అదే మంచి హార్ట్ టచ్చింగ్ రచన అని నా అభిప్రాయం" అన్నాడు.

"వెరీగుడ్" అన్నాను అతడంతగా మాట్లాడుతూంటే "అలాగా!" అని పొడిగా అనడం బావుండదని.

"మా ఊర్లో తరచుగా కొందరు సాహితీ మిత్రులం కలుస్తుంటాం సార్. నేనెక్కువగా మీ నవలల్ని గురించి, మీ కథల్ని గురించి మాట్లాడుతుంటాను. వివిధ కోణాల్లోంచి లోతుగా విశ్లేషించి వివరిస్తుంటాను కూడా!"

"ఓ... చాలా తతంగం నడుపుతున్నారన్న మాట" అన్నాను కొద్దిగా నవ్వి. కానీ లోలోన చాలా ఆనందంగా, గర్వంగా ఫీలయ్యాను.

ఆ తర్వాత ఓ పదిహేను నిముషాలపాటు అతనే వరుసగా సాహిత్యాన్ని గురించి, నా రచనలను గూర్చి చాలా ఆసక్తికరమైన విషయాలు మాట్లాడాడు. నేను క్లుప్తవాక్యాలతో సంభాషణ సాగడానికి నావంతు సహకారాన్ని అందించాను.

సందేహం లేదు. ఈ మధుమూర్తి నన్నూ, నా రచనల్ని పిచ్చిపిచ్చిగా అభిమానిస్తున్నాడు కానీ నా సమయం అతి విలువైనది కదా! ఇలా వచ్చి వెళ్లే అభిమాన, వీరాభిమానుల కోసమే నా సమయమంతా గడిచిపోతే ఎలా? నెమ్మదిగా వాచికేసి చూసుకున్నాను. అతడు అర్థం చేసుకున్నాడు.

"ముఖ్యంగా మూడు పనుల మీద వచ్చాను సార్!" అన్నాడు.

"ఏమిటవి?"

"ఒకటి మిమ్మల్ని ప్రత్యక్షంగా చూడడం. ఆ పనికాస్తా సక్సెస్‌ఫుల్‌గా పూర్తయింది. రెండవది..." అంటూ ఆగాడు.

"చెప్పండి..." విసుగే మాత్రం వ్యక్తం కానీయకుండా అన్నాను.

"మీ ఫోటో ఒకటి తీసుకువెళ్లాలి!"

"నో... నో మిష్టర్ మధుమూర్తీ. నా ఫోటోగ్రాఫ్ ఎవ్వరికీ ఇవ్వను. అసలు అంత అవసరం ఏముంది? చాలా పత్రికలలో నా ఫోటో ప్రచురింపబడింది కదా?"

"అవుననుకోండి. కానయితే నా పర్సనల్ ఆల్బంలో ఉంచి నాకోసం వచ్చే సాహితీ మిత్రులకు చూపుతుండాలని..."

"నో మధుమూర్తీ... మీ సాహితీ మిత్రులకు పత్రికలలో ప్రచురితమైన నా ఫోటోలనే చూపించాలి. అదే మంచిపద్ధతి!" అనేశాను నిక్కచ్చిగా.

అతడేం మాట్లాడలేకపోయాడు.

"ఇంతకూ మీ మూడవ పనేమిటో సెలవియ్యలేదు?" అన్నాను మళ్లీ నేనే. బహుశా నా స్వరంలో ఇంచుక వ్యంగ్యం విన్పించినా విన్పించి ఉండవచ్చు. అది నాకు తెలియకుండానే జరిగిన అసంకల్పిత సాధారణచర్య నిజానికి.

"మీ సంతకం తీసుకువెళ్లడం!" అంటూ తన జేబులోంచి ఆటోగ్రాఫ్ పుస్తకం వెలికి తీసి నాకేసి చూశాడు. అతనికన్నా అతి సామాన్యంగా కన్పిస్తోంది అతని ఆటోగ్రాఫ్ పుస్తకం. అప్పుడు వచ్చింది నాకు అకారణమైన కోపం. నేను ఎప్పటికీ జయించలేకపోతున్న కోపం.

"ఐయాం సారీ... నేనెవ్వరికీ ఆటోగ్రాఫ్ ఇవ్వను!" అన్నాను కఠినంగా.

నిర్ఘాంతపోతూ నాకేసి చూసిన అతని చూపుల్తో... అంతులేని ఆశ్చర్యం, సున్నితమైన ప్రదేశంలో దెబ్బతగిలినప్పుడు కలిగే బాధ,ఒయాసిస్సు అనుకుని ఆత్రంగా,ఆశగా కాళ్లీడ్చుకుంటూ వెళ్లి 'ఎండమావి' అన్న విషయం నిర్ధారణగా గ్రహించి ఎడారి మధ్యని బాటసారి పడే వేదనా... అన్నీ కలగలిసిపోతూ స్పష్టంగా కన్పించాయి.

"నేను గత పదిహేడేళ్ళుగా మీ అభిమానిని. ఈ పదిహేనేళ్లలోనూ దాదాపుగా మీరు రాసిన ప్రతి కథా, ప్రతి నవలా, ప్రతి వ్యాసం చదివాను. మిమ్మల్ని చూడాలనీ, మీతో కొంతసేపయినా మాట్లాడాలనీ వ్యయప్రయాసలకోర్చి ఇంత దూరం వచ్చాను. మీ ఆటోగ్రాఫ్ తీసుకోకుండా వెళ్తే నాకు చాలా నిరాశగా ఉంటుంది" అన్నాడు.

"సీ... మిష్టర్ మధుమూర్తీ. పెద్దపెద్దవాళ్లకే ఇవ్వలేదు నా ఆటోగ్రాఫ్. అవార్డులు పొందిన రచయితలు సైతం నా సంతకం కోసం ఎంతో ప్రయత్నిస్తారు. మరీ సన్నిహితులకు రాసే ఉత్తరాలలో తప్ప నా పూర్తి సంతకం మరెక్కడా ఉండదు. నా విలువైన సంతకాలని పదిలపరుచుకోవాలనే నేనవసరమైన ఉత్తరాలూ అవీ రాయను. కాబట్టి నా సంతకం గూర్చి మీరు ఆసక్తి చూపనవసరం లేదు"

ఓ రెండు నిముషాల పాటు అతడు తలవంచుకుని అలా కూర్చునేశాడు. ఆ తరువాత తల పైకెత్తాడు. అప్పుడు అతడు నాకేసి చూసిన చూపును నా జీవితంలో నేనెప్పటికీ మరిచిపోలేను.

"వెళ్తాను!" అంటూ చకచకా నడిచి నా గదిలోంచి వెలుపలికి వెళ్లిపోయాడు చాలా నిర్లక్ష్యంగా.

నాకు ఆశ్చర్యం కలిగింది. నా గదిలోకి ప్రవేశించేటప్పుడు ఎంత వినయం? ఎంత విధేయత? పైగా ఆ చూపుల్లో కన్పించిన వాత్సల్యం, అభిమానం అంత త్వరగా అంతరించి అంత చప్పున అంత అసహ్యం ఎలా చోటుచేసుకోగలిగింది? ఏది ఏమైనా అతని ఆఖరి చూపు నన్ను చాలా ఇరకాటంలో పడవేసింది. అతని పట్ల చాలా నిర్లక్ష్యంగా, నిర్మొహమాటంగా, గర్వంగా ప్రవర్తించి తప్పుచేశానేమో అనే అనుమానం క్రమక్రమంగా

నా మనసంతా ఆక్రమించుకుని బాధించడం మొదలుపెట్టింది. బాధ అనేది మొదలవ్వాలే గానీ తరువాత దాన్ని ఆపడం మాత్రం నా తరంగాని పని.

పదినిముషాల తర్వాత... "కారు తీయమని చెప్పండి" అన్నాను.

"సార్. డ్రైవర్ లంచ్‌కి వెళ్లాడు. ఇంకా రాలేదు!"

సెక్రటరీ అలా అనగానే ఆలోచిస్తూ టేబుల్ సొరుగు లాగాను. నేను మామూలుగా ఇంటికి ఆలస్యంగా వెళ్తుంటాను. అందువల్ల డ్రైవర్ తన వేళకు తను వెళ్లి భోజనం ముగించుకుని వస్తుంటాడు. టేబుల్ సొరుగులో ఉన్న రెండవ జత కారు తాళాలు అందుకుని కుర్చీలోంచీ లేచాను. లిఫ్ట్‌లో గ్రవుండ్ ఫ్లోర్ చేరుకుని గబగబా నడుస్తూ వెళ్లి పార్కింగ్ ప్లేస్‌లో నిలిపి ఉన్న నా శాంట్రో కారు తలుపు తెరిచి కూర్చుని స్టార్ట్ చేసి పోనిచ్చాను. బస్ స్టేషన్ దారి వైపునకు ఓ కిలోమీటర్ దూరం వరకూ వెళ్లాక అతడు కన్పించకపోవడంతో కారును వెనక్కి తిప్పి వేగంగా రైల్వేస్టేషన్ రోడ్డుకేసి పోనిచ్చాను. కొంతదూరం వెళ్లాక నా అంచనా నిజం అయింది.

రోడ్డు ప్రక్కగా నడుస్తూ వెళ్తున్న మధుమూర్తి కన్పించాడు. సర్రున కోసి కారు ఫుట్‌పాత్ ప్రక్కగా ఆపాను.

కారులో నన్ను చూసిన మధుమూర్తి పెద్దగా ఆశ్చర్యపోలేదు. నన్ను చూడగానే తన నడక మాత్రం ఆపాడు అంతే! నేనే కారుదిగి అతని దగ్గరగా వెళ్లాను.

"నాకెందుకో మీకు ఆటోగ్రాఫ్ ఇవ్వాలనిపించింది. అందుకే నేనే వచ్చాను" అన్నాను నిజాయితీగా.

"అలాగా!" అన్నాడు కానీ నేననుకున్నట్లుగా జేబులోంచి ఆటోగ్రాఫ్ పుస్తకాన్ని మాత్రం వెలికి తీయలేదు.

"ఇవ్వండి మీ పుస్తకం సంతకం చేస్తాను" అన్నాను.

"ఒద్దులెండి"

"అదేమిటి?" అన్నాను కాస్త ఖంగుతిని.

"నేను సామాన్యుడ్ని సార్! విలువైన మీ సంతకాన్ని ఖరీదైన రీతిలో పదిలపరుచుకునే శక్తియుక్తులు లేనివాడ్ని. ఆ విషయాన్నయినా ఈవాళే తెలుసుకో గలిగాను. అందువల్ల మీ సంతకం ఇహ నాకు అవసరం లేదు!" అన్నాడతను అతి నిక్కచ్చిగా. నిర్ఘాంతపోవడం నావంతయిందీ పర్యాయం.

"పోనీ కారెక్కండి. మా ఆఫీసుకు వెళ్దాం. నా సంతకంతో ఉన్న ఫోటో ఒకటి తీసుకుందురుగానీ. మళ్లీ మిమ్మల్ని మీరు దింపమన్న చోట దింపుతాను" అనేశాను గబగబా.

"ఒద్దు సార్. విలువైన మీ సంతకాన్నే భరించలేనివాడ్ని అత్యంత విలువైన మీ ఫోటోనెక్కడ భరించగలను?"

"అంతేనా?" నా స్వరం నాకే నీరసంగా విన్పించినట్లయింది ఎందుకో.

"అంతేనా? అన్నారు కాబట్టి చెప్తున్నాను సార్. ఇక జీవితంలో నేనెప్పటికీ పొరపాటున కూడా మీరచనలు ముట్టను!"

"అదెందుకు?"

"దాదాపు పదిహేనేళ్ళుగా మీ రచనలను ఎంతో అభిమానంతో చదువుతూ వచ్చాను. మీరు బాగా మంచి కథ లేదా మంచి నవల రాసినప్పుడు ఆ పత్రికకు లేదా పబ్లిషింగ్ హౌస్‌కు మా ఊరి నుండీ నేను ఉత్తరం రాయడమే కాక చుట్టు పట్ల ఊర్లకు పనిగట్టుకువెళ్లి అక్కడి నా మిత్రుల చేత చదివించి వారిచేతా వారి అభిప్రాయాల్ని ఉత్తరాలుగా రాయించి పోస్టు చేయించి వచ్చే వాడ్ని. తరచూ సాహితీ మిత్రులతో మీరచనల మీద డిస్కషన్లు, విశ్లేషణలు, అబ్బ ఓహ్... విలువైన నా సమయం ఎంతలా వృధా అయిందో ఇప్పుడు మీ అతివిలువైన సమయాన్ని గూర్చి తెలుసుకున్నాక తెలిసివచ్చింది. ఇహపై మీరెంత గొప్ప రచన చేసినా మీకు నోబుల్ ప్రైజ్ లభ్యం అయినా కూడా మీరచనలు మాత్రం ముట్టుకోను" అన్నాడతను సావధానంగా పెదవులమీద చిరుదరహాసంతో మోటార్ సైకిల్ మీద వెళ్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాకు పరిచయం ఉన్నవాడే. రోడ్డు మీద నిలబడి ఉన్న కారును చూసి కాస్త స్లో అయి ఆపై నన్నూ, మధుమూర్తినీ చూసి వేగం పెంచుకుంటూ వెళ్లిపోయాడు.

"అస్త్ర సన్యాసం చేస్తారన్నమాట!" అన్నాను కొద్దిగా నవ్వి.

"అస్త్రసన్యాసం ఎందుకవుతుంది? వేలాదిమంది తెలుగు రచయితలలో, రచయిత్రులలో వందలాదిమంది మంచి మంచి రచనలే చేస్తున్నారు. మీవి తప్ప ఇతరులవి చదువుతాను. ఒక్క రచయిత రచనలు చదవకపోయినంత మాత్రాన వచ్చే నష్టం ఏమీ ఉండదని ఓ ఖచ్చితమైన ఏర్పడిపోయింది నాలో ఇప్పటికిప్పుడే! ఆ మాత్రం స్వయం నిర్ణయాధికారం పాఠకుడికి ఎప్పుడూ ఉండి తీరుతుంది కదా?"

"అయినా ఎందుకలాంటి నిర్ణయం?" అని ప్రశ్నించాను. ఎప్పుడూ నన్నంటి పెట్టుకుని ఉండే గర్వం, ధాష్టీకం నాలో లేవప్పుడు.

"ఎందుకు? అంటే నిర్దిష్టమైన జవాబు ప్రస్తుతానికి నావద్ద లేకపోవచ్చు. కానీ నేనో నిర్ణయానికి వచ్చిన తర్వాత మాత్రం దానికి తిరుగుండదు సామాన్యంగా. పోతే నేను చదివిన చదువు, సంపాదించుకున్న లోకజ్ఞానం, పరిస్థితుల ప్రభావం వల్ల జీవితంలో నేనెదుర్కొన్న సంఘటనలు అన్నీ నాకు మనుష్యులను ప్రేమించడం నేర్పించాయి. అదే విధంగా మనుష్యులను ప్రేమించలేని వారిపట్ల ఉదాసీనంగా ఉండిపోగల స్థాయిని కూడా నాకివ్వగలిగాయి.

ఇహపోతే ఇవ్వడం తెలిసిన వారికి ఇన్‌రిటర్న్ తిరిగి తీసుకోవాలనే ఉబలాటం ఉండడంలో తప్పులేదు కదా!" అంటూ అతడు ఊపిరి తీసుకోడానికి ఆగాడు. నేనేం మాట్లాడలేకపోవడం వల్ల తిరిగీ తనే మాట్లాడాడు.

"నా ఉద్దేశ్యంలో రచయితల మీదున్నంత సామాజిక బాధ్యత సంఘంలో ఇతరుల మీద లేదు. అందుకే రచయితలు విజ్ఞానంతోపాటూ వివేకాన్ని, వ్యక్తిత్వాన్ని, వినయాన్ని కూడా పెంపొందించుకోవలసిన అవసరం చాలా ఉంది.తన రచనలతో పాఠకుల గుండెలను పలుమార్లు స్పర్శించిన ఓ ప్రఖ్యాత రచయిత అంటాడు మనుష్యుల్ని ప్రేమించే వాళ్ళే మంచి కథలు రాయగలరని! మరో ప్రఖ్యాత సాహితీవేత్త అంటాడు మనుష్యులను గురించి ఆలోచించే వాళ్ళే మంచి రచనలు చెయ్యగలుగుతారని! పైపైగా చూసినా, లోతుగా అధ్యయనం చేసినా ఈ అత్యుత్తమ భావాలు రెండింటికీ పెద్దగా తేడాలేదు. ఎందుకంటే మనుష్యుల్ని ప్రేమించగలిగినప్పుడే వారిని గురించి ఆలోచించడానికి అవకాశం ఎక్కువ ఉంటుంది. అదే విధంగా మనుష్యుల్ని గూర్చి ఆలోచించగలిగినప్పుడే వారిని ప్రేమించడం సులభసాధ్యం అవుతుంది. మీ రచనలలో మనుషులను గురించి ఎంతో ఆలోచించినట్లు కన్పించిన మీరు మనుష్యులను ఎంతో ప్రేమించే వారై ఉంటారనే భావాన్ని కలిగించారు. కానయితే వ్యక్తిగతమైన మీ నిజజీవితంలో మాత్రం ఆ విషయంలో చాలా వెనుకబడి ఉన్నారన్నది నేను ప్రస్తుతం గమనించిన విషయం. అందులో వాస్తవం ఉందనడానికి ఓ స్పష్టమైన నిదర్శనం చెప్పాలంటే గత పదిహేనేళ్లలో మీకు నేను ముప్పైకి పైగా ఉత్తరాలు వ్యక్తిగతంగా రాశాను. కనీసం మీరు ఒక్కదానికైనా బదులు రాయలేకపోయారు. మీ నుండీ జవాబే లేకపోయినా ఉత్తరాలు రాస్తూ ఉండడం అన్నది మాత్రం తప్పకుండా నా తప్పేనని ఒప్పుకుంటాను. ఏది ఏమయినా ఇహపై మీ రచనలు ముట్టను. ఎందుకంటే ఓ వ్యక్తిగా నాకూ కొన్ని ఇష్టాలూ, అయిష్టాలూ ఉండి తీర్తాయికదా?" అంటూ మళ్లీ ఊపిరి తీసుకోవడానికి ఆగాడు ఆ వింత వ్యక్తి.

"అలాగే చేద్దురుగానీ ముందు కారెక్కండి. మిమ్మల్ని మీరు కోరినచోట దింపి వెళ్తాను" అన్నాను.

"అవసరం లేదుసార్. నడిచి వెళ్లడం నాకు అలవాటే. ఎగుడుదిగుడులు చూసినవాడిని. నడిచే వెళ్లిపోతాను. వెళ్లేముందు ఓ చిన్నమాట. ఇంటికి ఎవరొచ్చినా అన్నం పెట్టలేకపోయినా కనీసం నీళ్లిచ్చి ఆదరించడం మన సంస్కృతి. మా ప్రాంతంలో శత్రువు ఇంటికి వచ్చినా ముందు త్రాగడానికి చల్లటి మంచినీళ్ళిచ్చిన తరువాతే మాటలు. ఆ అలవాటు గొప్పది.

మీకోసం నాలాంటి వాళ్ళెవరు వచ్చినా దాహం తీర్చిపంపే ఏర్పాటుచేయించండి మొదట! చివరగా ఒక్కమాట. ప్రపంచంలో మనుషులంతా సమానులే నిజానికి. డబ్బు లేదా హోదాల వంటివి మనుషుల కొలమానాలు కావడం శోచనీయం. ఇంతకన్నా చెప్పగలిగేంతటి వాడిని కాను. వెడతాను!" అంటూనే అతడు అటువైపు తిరిగి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెళ్లి చూస్తుండగానే మలుపు తిరిగి అదృశ్యం అయిపోయాడు. బ్లాంక్‌గా తయారైన మనసుతో అటువైపే కాస్సేపు చూసి వెనుదిరిగాను.

ఆఫీసుకి చేరుకున్నాక సెక్రటరీ టేబుల్ వద్దకు నడిచాను.

"ఇందాకా వచ్చినాయన రాగానే ఏం అడిగారు?" అని ప్రశ్నించాను.

సెక్రటరీ స్టెల్లా ముఖంలో ఆశ్చర్యం కనిపించింది.

కొద్దిగా కంగారు పడ్తూలేచి నిలబడింది.

"ఇక్కడికి రాగానే దాహంగా ఉంది కాస్త మంచినీళ్ళు ఇప్పించండి అన్నారు సార్! నేను అటెండర్ అన్నయ్యకు చెప్పాను. ఇక్కడ కూజాలో నీళ్లయిపోయాయి అయ్యగారి గదిలోని ఫ్రిజ్‌లోంచీ వాటర్ బాటిల్స్ తీసుకోవాలి అన్నాడు"

"తీసుకోవాల్సింది" అన్నాను మనసులో మరింత మధనపడుతూ.

స్టెల్లా మౌనం వహించింది. ఫ్రిజ్‌లోంచీ బాటిల్స్ తీసుకుంటే నేనేమైనా అంటానేమోనని మిన్నకుండాపోయుంటాడు అన్నయ్య బహుశా!

"పొరపాటు" అనుకున్నాను పైకే.

"సారీ సర్!" అంది స్టెల్లా.

"పొరపాటు మీది కాదు!" అనేసి ఆ గదిలోంచీ నా గదికేసి అడుగులేశాను ఆలోచిస్తూ!!

*(ఆంధ్రభూమి, మాసపత్రిక, మే 2007)*

# గుండె నిండుగా వుంది!

ఉదయం ఏడు గంటలకు నాన్‌స్టాప్ ఎక్కి తొమ్మిదిన్నర కల్లా ఘటోత్కచపురంలో దిగి పోతానన్నాడు దినకర్. టిఫిన్ కూడా సరిగ్గా తినకుండా తొమ్మిదింబావుకంతా బస్టాండ్ చేరుకున్నాను.

తొమ్మిదిన్నరకు రావాల్సిన బస్సయితే తొమ్మిదీ ముప్పావుకు వచ్చింది. కాని అందులోంచి దినకర్ దిగలేదు.

నేడు విషయసేకరణ క్షణాలమీద పని కద!

సెల్‌లో వాడి నెంబరు సెర్చ్‌చేసి కాంటాక్టు చేశాను.

"ఒరేయి నేను బస్టాండుకు వచ్చేసరికే ఏడుగంటల బస్ వెళ్ళిపోయిందిరా" అన్నాడు వాడు నింపాదిగా.

"పోతేపోయిందిలే... ఏడున్నర గంటల బస్ ఎక్కావా?"

"ఊహూ... ఎనిమిది గంటల నాన్‌స్టాప్ ఎక్కాను!"

"ఎందుకలా?"

"ఏడున్నర గంటల నాన్‌స్టాప్ బస్ డీలక్స్ బస్‌కాదు. అదికాస్తా ఆర్డినరీ నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్. కాస్త సుఖంగా వద్దామని ఎనిమిది గంటల డీలక్స్ నాన్‌స్టాప్ ఎక్కాను" అన్నాడు.

"ఓరి పాపీ... నీవెక్కడో టాటా, బిర్లాల కుటుంబాలలో పుట్టాల్సిన వాడివి. పొరపాటున ఆ బక్కరైతు కడుపున చెడబుట్టావు. ఇంతకూ ప్రస్తుతం ఎక్కడ అఘోరిస్తున్నావు?" అన్నాను కోపంగా.

"కలికిరి దగ్గర పడింది. గంటలోపే వచ్చేస్తాలే!" అన్నాడు వాడు సావధానంగా.

మే నెల ఎండకాస్తా పదికాకమునుపే మండిపోతోంది. నాలుగు కిలోమీటర్ల దూరంలో వున్న ఆఫీసుకు వెళ్ళి కాసేపు వుండి తిరిగి రావడానికి మనస్కరించలేదు. పైగా నాదసలే 1975 మోడలు పరమపాత రాజదూతం. పెట్రోలు కాస్త ఎక్కువే పీలుస్తుంది. మండుతున్న ఎండలకన్నా పెట్రోలు ధరే ఎక్కువ మండుతోంది మరి. అందుకే ఫోనుమీదే సెక్షనాఫీసర్ని కాంటాక్టు చేసి అరగంట పర్మిషన్ పొందగలిగాను.

దినకరుడి ప్రభావానికి చొక్కాలోపలి బనీను తడుస్తోంది అప్పుడే! నా మిత్రుడు దినకరుడ్ని తిట్టుకుంటూ అక్కడే ఓ బెంచీమీద కూర్చున్నాను.

"తిరుపతి... తిరుపతి... నాన్‌స్టాప్ డీలక్స్ తిరుపతి" అంటూ అరుస్తున్నాడు రవాణా సంస్థ ఉద్యోగి ఎవరో... ఖాళీగానున్న నాన్‌స్టాప్ డీలక్స్ బస్ దగ్గర.

బిలబిల మంటూ పది పండ్రెండు మంది స్త్రీలు, పురుషులు గబగబా వచ్చారు ఆ బస్ దగ్గరకు. కొందరి చేతుల్లో పలుచటి ప్లాస్టిక్ బ్యాగులు... వాటిలో పూలహారాలు.

ఎన్ని చట్టాలు వచ్చినా చుట్టాలయిపోతాయి కాబోలు... ప్లాస్టిక్ బ్యాగుల వాడకం మాత్రం ఆగడంలేదు మరి!

"ఈ బస్‌లో టిక్కెట్ డెబ్బయి నాలుగు రూపాయలు!" అన్నాడు ఆ రవాణా శాఖ ఉద్యోగి బస్ ఎక్కబోతున్న వారిని ఆపి మరీ.

వారుకూడా సంశయిస్తూ ఆగిపోయారు.

అప్పుడు చూశాను వారందరినీ పరీక్షగా.

నిజానికీ దేశమే రైతులది! అయితే... "అన్నదాత ఇంటిలో అన్నమే కరువాయెరా!" అన్నట్లుంది కాలం కాస్తా!!

ఆ గుంపులోని మనుషులు ఏదో పల్లెటూరు తాలూకు రైతు కుటుంబాలకు చెందిన బడుగు వాళ్ళయి వుండాలి. వారిలో ముగ్గురు నలుగురు మాత్రం దిగువ మధ్యతరగతి వాళ్ళూ కన్పిస్తున్నారు. తతిమ్మా వారు మాత్రం కచ్చితంగా పేద, బడుగు వర్గాల వారిలా కన్పిస్తున్నారు.

"తక్కువ టిక్కెట్టు బస్సు ఎక్కడుంది?" అని అడిగాడు వారిలో ఓ పెద్దాయన సంస్థ ఉద్యోగిని.

"ఎల్.ఎస్.ఎస్. బస్సు ఈ బస్సు వెనుక ప్లాట్‌ఫాంమీదకే వచ్చి నిలబడుతుంది!" అన్నాడు ఆ ఉద్యోగి.

అందరూ నాలుగడుగులు వెనక్కి వచ్చేశారు.

తిరుపతి ఎల్.ఎస్.ఎస్. బస్సు బస్టాండులో లేదు.

వారిలో ఇద్దరు నా ప్రక్కన, తతిమ్మావాళ్ళు ప్రక్క బెంచీలమీద సర్దుకుని కూర్చున్నారు.

"ఆ బస్ వచ్చేదెప్పుడు? మనం తిరుపతి చేరేదెప్పుడు? అక్కడ బస్ దొరికేదెప్పుడు? మనమావూరు జేరేదెప్పుడు? అంతసేపు సెవాన్ని బెడ్తారా?" అంటున్నాడు నా ప్రక్కన కూర్చున్న ముసలాయన.

ఆయన స్వరంలో నమ్మకం – అపనమ్మకం రెండూ కలగలసి ధ్వనిస్తున్నాయి.

"ఎండపొద్దులో దానం సెయ్యరు గదా? అక్కడ బస్ దొరికేది లేటయితే పెద్దాటోలోనో, వ్యానులోనో సేరుకోగలంలే!" అన్నాడు అతని ప్రక్కన కూర్చున్నతను.

"ఆ కరంటు గాజుపెట్టె దేంట్లోనో బెడ్తే ఎన్నాళ్ళయినా సెవాన్ని పెట్టుకోవచ్చుంట గదా?" అన్నాడు ముసలాయన.

"ఆ!... అయితే ఆళ్ళకు బతుకు జరిగేదే కట్టం... ఇంకా కరంటు పెట్టి దెచ్చి పీనుగును బెట్టుకుని బాడుగ యాడ్నించీ దెచ్చి కడ్తారు? అయినా దూరాబారం నుండీ ఎవరొత్తారని?" అంటూ నిట్టూర్చాడు అవతలతను.

ఆపై వాళ్లేదో కష్టసుఖాలు మాట్లాడుకోసాగారు. అవతల బెంచీలమీద కూర్చున్న వాళ్ళవాళ్ళు వక్కాకు, దుగ్గు పంచుకోసాగారు.

బడుగు ప్రజల విలాస వస్తువు దుగ్గుతో కూడిన వక్కా, ఆకు, సున్నం! అది ఆరోగ్యానికి కాస్త హాని చేసేదే అయినా వారికి కొద్దోగొప్పో ఆహ్లాదాన్నిస్తుంది. అవసరాన్ని బట్టి ఆకలిని తట్టుకోవడానికీ ఉపకరిస్తుంటుంది. అంతలోతుగా ఆలోచింపలేని కడుపునిండిన అత్యంతాధునీకులు వారి వక్కాకు అలవాట్లనూ, వారి గారపండ్లనీ తప్పుపడ్తూ అసహ్యించు కుంటుంటారు.

అంత్యక్రియలకు హాజరవ్వాల్సిన అత్యంత అత్యవసర స్థితిలో సైతం డీలక్స్ బస్‌లో నూటపదకొండు కిలోమీటర్లు ప్రయాణం చెయ్యలేకపోతున్న వారి ఆర్థిక అశక్తతను గూర్చి మనసులో మథనపడ్తూ, బాధపడ్తూ కూర్చున్నాను.

డీలక్స్ నాన్‌స్టాప్ నిండి వెళ్ళిపోయింది.

ఎల్.ఎస్.ఎస్. బస్సయితే రాలేదుకానీ, కాసేపట్లోనే... సౌకర్యంగా ఉండదని తిరుపతిలో దినకరుడు ఎక్కకుండా వదులుకున్న ఆర్డినరీ నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ బస్సు వచ్చి ప్లాట్‌ఫాం మీద ఆగింది. ఆ బస్‌లోంచి దిగేవారంతా దిగిపోయాక అంత్యక్రియలకు తిరుపతి వెళ్ళాల్సిన బ్యాచ్ వాళ్ళు వెళ్ళి గబగబా ఆ బస్‌లోకి ఎక్కి కూర్చున్నారు.

పది నిమిషాలు గడచినా వాళ్ళు తప్ప మరెవరూ ఆ బస్‌లోకి ఎక్కలేదు.

మరో ఐదు నిముషాల తరువాత రవాణా సంస్థ ఉద్యోగి వచ్చి "తిరుపతి – తిరుపతి – నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ తిరుపతి" అని అరవడం మొదలుపెట్టాడు.

ఇంకో రెండు నిముషాల తరువాత బుక్కింగ్ కండక్టర్ వచ్చి టిక్కెట్లు కొట్టడానికి నాన్‌స్టాప్ ఎక్కాడు.

"అరవయి ఇస్తే ఎలా? టిక్కెట్ అరవయి ఏడు రూపాయలు!" అంటూ అతడు గట్టిగా ఎవరితోటో అనడం బస్‌లోంచి విన్పించింది రెండు మూడు నిముషాల్లోనే.

"టిక్కెట్టు యేభయ్యి సిల్లరే గదా?" బస్‌లోంచి ఎవరో నీరసంగా అడగడం అస్పష్టంగా విన్పించింది.

"అది ఎల్.ఎస్.ఎస్.లో. ఆ బస్సులయితే ఈ బస్సు వెనుక ప్రక్కన నిలుస్తాయి. దిగండి... దిగండి..." అంటున్నాడు బుక్కింగ్ కండక్టర్.

అంత్యక్రియలకు వెళ్లాల్సిన తిరుపతి బ్యాచ్ క్రిందికి దిగి వచ్చేశారు.

వాళ్ళలా నిలబడి వుండగానే ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెట్టుకుని ఎల్.ఎస్.ఎస్. సర్వీసుల్లాగే ప్రయాణించే బస్సులు రెండు వచ్చి వెళ్ళిపోయాయి.

"ఎల్.ఎస్.ఎస్. బస్ ఎప్పుడొస్తుంది?" అని ప్రశ్నించాడు పెద్దాయన అనౌన్సర్ని.

"డిపోలోంచి ఈ పాటికే రావాల్సింది... ఎందుకో రాలేదు!"

"తిరుపతవతలూరికి మనిసి దానానికి బోవాలే మేము".

"ఆ వెనకాల పీలేరు బండుంది. దాంట్లో పీలేరుకుపోయి అక్కడ్నుండీ తిరుపతి ఆర్డినరీ బస్‌పట్టుకోండి. ఆ బస్సుల్లో చార్జీలు తక్కువ" అన్నాడు ఆ ఉద్యోగి.

"అట్లాచేద్దామా?" అని ప్రశ్నించాడు పెద్దాయన.

"అయ్యో... ఆ బస్సుల్లో బోతే శానా లేటయిపోతుంది!" అన్నాడు ఇందాకా నా ప్రక్కన కూర్చున్న ముసలాయన.

"మరెట్లా? ఆ ఎల్లెస్సెస్ బస్సేదో రాలేదే?"

"ఈ బస్‌లోనే బొయ్యేదానికయితే ఛార్జీపైలెక్క ఇద్దరికయితే నేను పెడ్తా!" అన్నాడు గుంపులోంచి ఒకతను నాన్‌స్టాప్‌ను చూపుతూ.

"ఎక్కువయ్యే దుడ్డు నేనూ ఒకరికిస్తా" అంది ఒక ముసలామె.

"అయినా మిగిలినోళ్ళే ఎక్కువున్నారు. ఎట్లా పోతాము? ఆత్రపడి ఎళ్ళిపోతే మళ్ళీ వచ్చేటప్పుడు ఎవరికైనా తక్కువ బడ్తే ఎవర్నడుగుతాము? ఆ మామూలు బస్సేదో రానీ!" అన్నాడు పెద్దాయన నిస్పృహగా.

నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్‌లో సగంకూడా నిండలేదు. అయినా సమయం అవుతుండడం వల్ల డ్రయివరు వెళ్ళి ఎక్కికూర్చుని బస్సు స్టార్టు చేశాడు.

బుక్కింగ్ కండక్టరు పుట్‌బోర్డు దగ్గరే నిలబడి ప్రయాణీకులెవరైనా వస్తారా? అని చూస్తున్నాడు.

"తిరుపతి–తిరుపతి...నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ తిరుపతి" అని అంటూ అనౌన్సు ఉద్యోగి అరుస్తూనే వున్నాడు. మైక్‌లో కూడా అనౌన్సుమెంటు వచ్చింది. తిరుపతి నాన్‌స్టాప్ బయల్దేరుతున్నట్లుగా.

'ఏ ప్రభుత్వమూ, ప్రభుత్వరంగ సంస్థలూ సామాన్యునికి అందుబాటులో ఉండేదీ, సహకరించేదీ, ఒరగబెట్టేదీ ఏమీలేదు' అని కోపంగా అనుకున్నాను మనసులో.

ఆరేడు నిముషాలు గడచిపోయాయి.

ఎల్.ఎస్.ఎస్. బస్ అయిపులేదు.

నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ కొద్దిగా ముందుకు కదిలి నెమ్మదిగా వెనక్కి వచ్చింది.

ఇక ముందుకు వెళ్ళిపోతుంది.

అంత్యక్రియలకు వెళ్ళాల్సిన వారంతా ఆ బస్‌కేసి నిరాశగా చూస్తున్నారు. వాళ్ళెవరూ నాకు బంధువులో, స్నేహితులో... కనీసం పరిచయస్తులో కాకపోవచ్చు. మా మధ్యన ఏ అనుబంధమూ లేకపోవచ్చు. కానీ నేను మనిషిని!

అందుకే అసంకల్పిత ప్రతీకార చర్యలా నాలో ఏదో జరిగింది. దాంతో నాకు తెలియకుండానే నేను హఠాత్తుగా లేచి నిలబడ్డాను.

"హెూల్డాన్!" అని గట్టిగా అరుస్తూ ఒకడుగు ముందుకేసి బస్‌వైపు ఆగమన్నట్లుగా చేయి వూపాను.

కదులుతున్న బస్ కొద్దిగా ముందరగా ఆగిపోయింది.

ఆ పెద్దాయన దగ్గరగా వెళ్ళాను జేబులోంచి పర్సుతీస్తూ.

పర్సులో ఒకే ఒక ఐదు వందల నోటుంది.

నెలాఖరు రోజులు... జీతం అందడానికింకా నాలుగైదు రోజులున్నాయి. అందుకే గత రెండు రోజులుగా దాన్ని వెలికి తీయకుండా పదిలంగా అట్టిపెట్టుకుని వున్నాను.

అందరూ నాకేసి ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"ఛార్జీలకు తక్కువున్న మీవాళ్ళందరికీ ఇందులోంచి ఇవ్వండి. వచ్చేటప్పుడూ తిరుపతి నుండి నాన్‌స్టాప్‌లోనే తిరిగి రండి. మిగిలిన డబ్బుతో అందరూ ఏదయినా తినండి" అంటూ ఐదువందల నోటు ఆయన చేతుల్లో పెట్టాను.

సంశయిస్తూనే తీసుకున్నాడు పెద్దాయన.

"రండి, రండి టైమైపోయింది బస్సెక్కండి" అంటూ ఉత్సాహంగా అరుస్తున్నాడు బుక్కింగ్ కండక్టరు సగం ఖాళీగా వున్న బస్‌లో ఫుట్‌బోర్డు దగ్గరగా నిలబడి.

ఆలోచించుకునేందుకు కూడా అవకాశం లేకుండా బిలబిల మంటూ అందరూ వెళ్ళి బస్సెక్కారు పెద్దాయనతో సహా.

ఖాళీగా వున్న పర్సును పేంటు జేబులో పెట్టుకున్నాను.

పర్సు ఖాళీగా వున్నా... గుండె నిండుగా వుంది!

కదిలిపోతున్న బస్‌లోంచి ఎవరో చేతులు జోడించి దండం పెడ్తుండడం లీలగా కన్పించింది.

వెళ్ళిపోతున్న ఆ బస్సుకేసి చేతులు జోడించాను.

నమస్కారం... మన సంస్కారం. ✪

*('నది' మాసపత్రిక బంధాలు అనుబంధాలు కథలపోటీలో బహుమతిపొందిన కథ.*
*నది మాసపత్రిక, ఫిబ్రవరి 2011)*

# కచ్చాకో.. బుచ్చాకో.. కలో గంజో...

మంత్రివర్గ సమావేశం రంజుగా సాగుతోంది.

నిజానికయితే అదికాస్త రహస్య సమావేశంలా పకడ్బందీగా సాగుతోంది.

సమావేశ మందిరంలో ఇంధనశాఖా మంత్రిగారు మంచి ఉత్సాహంగా ఉన్నారు. ఖచ్చితంగా ఇంధనాల ధరలు మరికాస్త పెంచి తీరాలనే గట్టి అభిప్రాయంతోటే ఉన్నట్లుగా వారి యొక్క హావభావాలు తెలియపరుస్తున్నాయి.

నిప్పురవ్వ మంత్రివారు మాత్రం తమ సహజసిద్ధ ఆవేశంలో చిటపటలాడి పోతున్నారు. ఆ ధరల వడ్డనను అడ్డుకోవడం వల్ల తమ రాష్ట్రంలోని ప్రజలలో తమ పట్టును మరింత పెంచుకోవచ్చునన్నది వారి అంతర్గత అభిప్రాయం. వారిలాగే ధరల పెంపును వ్యతిరేకించే వారు ఒకరిద్దరున్నా... ఎక్కువ మంది తటస్తులే! 'కాగల కార్యం గంధర్వులు తీరుస్తారు... మనకెందుకు తీట?' అన్నట్లు కూర్చున్నారు వారు కాస్తా.

ఇంధనశాఖ మంత్రిగారు ఉపన్యాసం ప్రారంభించారు.

ఇంధనాల ధరలు ఎన్నికలకు మునుపటి నుండి పెంచకపోవడం వల్ల ఆయా కంపెనీలు ఎంతెంత నష్టపోయి ఎలా చిక్కిపోతున్నాయో అద్భుతమైన గణాంకాలతో సహా అనర్ఘళంగా అరగంటపాటు విశదీకరించి... "మీ మాటేమిటి?" అన్నట్లుగా ఆగారు.

కీచిరి బాచిరి అంటూ ప్రారంభమైన గోల గంటపాటు సాగింది... ఎవరేం చెప్తున్నారో కూడా సరిగ్గా తెలియనంతగా.

అంత గందరగోళం మధ్యనా పరమ ప్రశాంతంగా, నిశ్చలంగా మౌనంగా ఒక యోగిలా కూర్చున్నది మాత్రం పెద్దనామాత్యులుగారు ఒక్కరే.

ఉరుమువురిమి మంగలంమీద పడ్డట్లుగా చివరికి అందరూ ఆయన మీద పడ్డారు.

"మేమంతా ఇంత పెద్ద సమస్య మీద తలలు బ్రద్దలు కొట్టుకుంటుంటే పెద్దవారు మీరు... మీరు కాస్తా నిమ్మకు నీరెత్తినట్లు, అలా ఏం పట్టనట్లు కూర్చుండిపోతే ఎలా?" అంటూ ప్రశ్నలు సంధించారు.

"నిజానికి ఇదేమంత పెద్ద సమస్యకాదు!" అన్నారు వారు ప్రశాంతంగా నవ్వి.

ముత్యాలేమయినా రాలి ఆయన ఎదుట 'యూ' టేబిలు తాలూకు క్లాత్ మీద పడ్డాయేమోనని పరిశీలించారు వారికి దగ్గరగా కూర్చుని వున్న కుర్రమంత్రిగారు. అయితే అలాంటి దాఖలాలేం కన్పించలేదు.

సూదిమొన క్రిందపడ్తే వినవచ్చేంత నిశ్శబ్దం ఆవరించింది సమావేశమందిరంలో.

"మరి?" అన్నారు అవాక్కయిన ఇంధన శాఖామాత్యుల వారు తేరుకుని.

"మరి, సరి... అన్నీ అటుండనీ, మీరెంత పెంచాలనుకుంటున్నారు?"

"లీటరు పెట్రోలుమీద రెండు రూపాయలు, డీసెలు మీద రూపాయిన్నర, కిరోసిను మీద ఒక్క రూపాయి, గ్యాసు సిలెండరు మీద పాతిక..." అంటూ కాస్త ఆగారు ఇంధన శాఖా మాత్యుల వారు.

"ఓ పని చెయ్యండి!"

"చెప్పండి!"

"పెట్రోలు మీద లీటరుకు ఆరు రూపాయలు, డీసెలు మీద నాలుగు, కిరోసిను మీద మూడు, గ్యాసు మీద ఏభయి పెంచవయ్యా!"

ఒక్క నిమిషం నిశ్శబ్దం తరువాత నిప్పురవ్వ మంత్రిగారు మండుతున్న చిట్లాకుప్పే అయిపోయారు. కుర్రమంత్రివర్యులయితే మూర్ఛపోయి తేరుకుంటున్న స్థితిలో కన్పించారు.

* * *

దిష్టిబొమ్మలు, బస్సులు తగలబడ్డాయి. రైళ్ళు దెబ్బతిన్నాయి. నాలుగు రోజులపాటు బంద్‌లు, హర్తాళ్లతో ప్రజాజీవనం స్తంభించిపోయింది. కోట్లాది రూపాయల ఆస్థినష్టంతో పాటు దేశ వ్యాప్తంగా శత కోట్లాది రూపాయల విలువ కలిగిన మనుషుల పనిగంటలు పూర్తిగా వ్యర్థమయ్యాయి.

* * *

మంత్రివర్గ సమావేశం జరిగింది మళ్ళీ...

నిజానికి పార్టీ అధ్యక్షులు, ప్రధాని కూడా ఏదో ఒకటి చెయ్యండనే సూచనలు గ్రుచ్చినందువల్ల ఇంధన శాఖామాత్యులు పెద్దనామాత్యులపైనే ఆధారపడిపోయారు. నిజానికి ఇంధనశాఖామాత్యులు అంతర్గతంగా తమకేం మూడుతుందోనన్న కంగారులో ఉన్నారు.

“పెంచిన ధరలన్నీ సగానికి సగం తగ్గించి పారెయ్యవయ్యా... నీకయితే లాభమే కద?” అన్నారు పెద్దనామాత్యుల వారు మందహాసం చేసి.

తగ్గించినా అనుకున్నదానికన్నా ఎక్కువే వడ్డించగలుగుతున్నందుకు ఇంధనశాఖామాత్యుల వారి ముఖం వెలిగింది.

చిట్లాకుప్పగారు శాంతించి నిష్పురవ్వగా మారారు.

ఎందుకో కుర్రమంత్రి వారికి మాత్రం సంతృప్తి కలుగలేదు. ఆయనలో మనిషితనం పూర్తిగా పోయినట్లు లేదు!

“మళ్ళీ గొడవలు చెలరేగుతాయేమో?” అన్నాడు సంశయంగా.

“ఇంకేం జరగవు లేవయ్యా... అందరూ అలసిపోయారీపాటికే!” అన్నారు ఇంధనశాఖామాత్యులవారు నవ్వి.

“అయినా... అయినా... దేశంలో చాలమంది ప్రజలు ఒక్కపూట భోజనంతో సరిపెట్టుకుంటున్నట్లున్నారు... వాళ్ళకదీ లేకపోతే ఎలా బ్రతుకుతారు?” అంటూ కుర్రమంత్రివర్యుల గుండెలోతుల్లో ఇంకా కొంతమేర మిగిలివున్న మానవత్వం ప్రశ్నించింది.

అంతటి పెద్దనామాత్యులవారి ప్రశాంత వదనంలోనూ ఒకింత అసహనం మెరిసి మాయమయ్యింది.

“జనానికేం లోటు? కచ్చాకో, బుచ్చాకో తిని కలో, గంజో త్రాగి బతుకుతారు లేవయ్యా!” అన్నారాయన పరమ ప్రశాంతంగా. ✪

***(ఆలోచించండి, మాసపత్రిక, ఆగస్ట్ 2010)***

# దృశ్యకావ్యం

*(సిలికానాంధ్ర – రచన కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ)*

**షూ**టింగ్ ముగిసింది.

పోస్ట్ షూటింగ్ వర్కులో నా ఇంపార్టెన్సు అంతగా ఉండదు. నా డైరక్టర్లు, అసిస్టెంట్లు చూసి రమ్మంటే కాల్చివచ్చే వాళ్ళయినందువల్ల నేను లేకపోయినా నా కొచ్చే ఇబ్బంది అంటూ ఉండదు. పైపెచ్చు రిలీజ్‌కు అనువయిన మంచి తేదీలు కూడా దగ్గర్లో మాత్రం లేవు.

రఘురాం పనికూడా దాదాపు అలాగే ఉంది. అందుకే... "మనం ఓసారి రాజారావును కలసి వద్దాము!" అన్నాను. వెంటనే అర్థం కాలేదేమో... ఆశ్చర్యంగా చూశాడు... ఆపైన అర్థం అయిందేమో... గబగబా నవ్వేశాడు.

"ఆ పిచ్చాడ్ని చూడడానికి అంతదూరం వెళ్ళాలా?" అన్నాడు నవ్వుతూనే.

రాజారావును పిచ్చివాడుగా భావించే వాళ్ళు చాలామందే వున్నారు కాబట్టి నాకేం బాధనిపించలేదు. మంచితనం... ముఖ్యంగా... మనిషితనం కాస్త మోతాదు మించిన వాళ్ళు సగటు మనుషులకు పిచ్చివాళ్ళుగా కనిపించడంలో ఆశ్చర్యం లేదు.

అందుకే నెమ్మదిగా అన్నాను...

"నీవు పిచ్చివాడని భ్రమలో ఉన్న మనమిత్రుని తాలూకు "మాస్టర్ పీస్" ఇన్ని రోజులయినా ఆంధ్రదేశంలో, సంపూర్ణ భారతదేశంలోనే కాక అన్యదేశాలలో కూడా అక్కడక్కడ ఇంకా ప్రాణం పోసుకుంటూనే ఉంది కదా? ఇదెలా సాధ్యమంటావ్?"

రఘురాం నవ్వు ఆగిపోయింది. తనే కాదు... నా ప్రశ్నకు జవాబు చెప్పగలవారు నాపరిధిలో మాత్రం లేరని నాకు తెలుసు.

"మనం అంతదూరం వెళ్ళి అతన్ని చూసినందువల్ల కలిగే ఇన్స్పిరేషన్ మాత్రం తప్పకుండా మన భావాలకు భవిష్యత్తులో ఉపయుక్తం అవుతుంది!" అన్నాను.

"నీ ఇష్టం!" అనేశాడు రఘురాం. రాజారావును చూడాలనే కోరిక అంతర్గతంగా తనలోనూ ఉంటుంది కద?!

✶ ✶ ✶

డిన్నర్ ముగించి గంటయినా కాక మునుపే రఘురాం నిద్రపోతున్నాడు. చీకటిని చీల్చుకుంటూ దూసుకుపోతున్న రైల్లో పడుకున్న నాకు నిద్ర రాకపోగా... నా ఆలోచనలు వెనక్కి వెళ్ళటం మొదలు పెట్టాయి...

ఆంధ్రదేశంలోని చెరో మూల నుండీ సినిమా పిచ్చితోటే ఆ మహానగరం చేరిన వాళ్ళమే ఇద్దరం. అందుకే ఒకరిమీద ఒకరికి అభిమానం. మొదట్లో ఒకే గదిలో ఉండేవాళ్ళం... రాజారావూ, నేనూ. అనక ఒకే ఇంట్లో... ఆపై ఒకే అపార్ట్‌మెంట్‌లో కలసి గడిపాము... నేను నా కుటుంబాన్ని తీసుకువచ్చే వరకూ!

అంత సన్నిహితంగా ఉన్నా ఒకరి భావాలూ, అభిప్రాయాలూ మరొకరితో కలిసేవి మాత్రం కావు. ఎవరి ఆలోచనా విధానం వారిదే... సమాంతర రైలు పట్టాల లాగా!

ఇద్దరికీ హీరో లక్షణాలున్నా, ఇద్దరం దేశంలో పేరుమోసిన రెండు ఫిల్మ్ ఇన్సిట్యూట్‌లలో శిక్షణ పొంది వచ్చిన వాళ్ళమే అయినా... ఒక్కరయినా... హీరోకాదు కదా కమేడియన్ అయినా కాలేకపోయాం.

రంగు రంగుల చీకటిని చాలామేర అనుభవించాక ఇద్దరం కూడబలుక్కుని ఊర్లకెళ్ళి దొరికినంత మేరా డబ్బు పట్టుకువచ్చాం.

నేనయితే పది కాలాలపాటు సంరక్షించగలనని నమ్మి మా పెద్దవాళ్ళు నాకిచ్చిన పూర్వీకుల మేడా, ఆకుతోటా తెగనమ్ముకుని వచ్చాను. రాజారావు తన వాటా పొలంలో సగానికి పైగా అయిన కడికి ధారపోసి వచ్చాడు.

మొదట ఇద్దరం కలిసే ప్రయత్నించాలనుకున్నాం... కానీ... ఎదురుదెబ్బ తగిలితే ఇద్దరం చేతులెత్తేయాల్సివస్తుందనే ఆలోచనతో ఎవరి ప్రయత్నాలు వారు ప్రారంభించాం.

నా అదృష్టాన్ని పరీక్షించుకుంటూ అప్పటికే అరవంలో అదరగొట్టిన ఓ సినిమా కథకు అగ్రిమెంటు చేసుకుని లోబడ్జెట్ ఫిల్ముగా రీమేక్ చేస్తూ నిర్మాత రూపం దాల్చాను. రాజారావు ఇంకా ఓ అడుగు ముందుకు వేసి ఓ కథ, దానికి మాటలు, స్క్రీన్‌ప్లే అంతా తనే వ్రాసుకుని దర్శక నిర్మాతగా కూడా అవతారం దాల్చడానికి సాహసించాడు.

ప్రజల నాడిని పట్టుకోవడానికి ప్రయత్నిస్తూ నేను చేసిన కొత్తరకం ప్రయత్నం సక్సెస్ అయిందనే చెప్పవచ్చు. డిస్ట్రిబ్యూటర్ల స్పందన అనుకున్నదానికన్నా ఎక్కువగా ఉండడమే కాక నా సినిమా పాతిక, ఏభయి, వంద రోజుల మైలురాళ్ళను సునాయాసంగా దాటేసి నాకో గుర్తింపునూ, నాలుగు రూపాయలనూ తెచ్చి పెట్టేసింది.

రాజారావు చేసింది కూడా నా దృష్టిలో చాలా గొప్ప ప్రయత్నం! ప్రపంచమంతా గొప్ప వేగంతో ఒకటి రెండు దశాబ్దాలు ముందుకు దూసుకుపోయే ప్రయత్నాలలో ఉండగా... తను మాత్రం తన సినీమాతో ప్రేక్షకులను నెమ్మదిగా రెండుమూడు దశాబ్దాలు వెనక్కి తీసుకు వెళ్ళడానికి సాహసించాడు. మానవ సంబంధాలను తోసిరాజని దూసుకుపోతున్న మనిషిని కాస్త ఆపి, కొద్దోగొప్పో ఆలోచించుకోడానికి అవకాశం ఇచ్చే ప్రయత్నం చాలా లోతుగా చేశాడు.

అయితే డిస్ట్రిబ్యూటర్లు ఆ సినిమాను రిస్క్‌గా భావించడంవల్ల రాజారావుకు మొదటి దెబ్బ అక్కడే పడింది. అంతేగాక అతని ప్రయత్నం బాక్సాఫీస్ దగ్గర ఘోరంగా విఫలమైంది. ఆ సినిమాకు ప్రజలలో మంచి టాక్ వచ్చింది. కానీ డబ్బు రాలేదు ఆ సినిమా అతనితోపాటు డిస్ట్రిబ్యూటర్లనీ దెబ్బతీసిందన్నది వాస్తవం.

మిత్రుల మధ్య ఆ విషయం చర్చకు వచ్చినపుడు రఘురాం నిక్కచ్చిగా అనేశాడు...

"ఏముంది అందులో? ఓ రొమాంటిక్ డాన్స్ లేదు. అదరగొట్టే ఫైట్స్ లేవు. కాస్ట్‌లీ కాస్ట్యూమ్స్ అస్సలు కనపడవు... కనీసం లేటెస్ట్ ట్యూన్స్‌తో పాటలు కానీ, స్పీడీ మ్యూజిక్ కానీలేవు... ఉన్నది సీరియస్ కథ, లోతైన కథనం... అది చాలా? అంత ఆలోచించే ప్రేక్షకుల శాతం ఎంతంటారు? ఆ సినీమా ఎలా నడుస్తుందంటారు?"

తతిమ్మా వాళ్ళూ కాస్త హెచ్చు తక్కువగా అలాంటి భావాలే వెలిబుచ్చారు.

రాజారావు నవ్వుతూ అన్నాడు...

"ఈ సినిమాతో నేను చెప్పదలుచుకున్నది చాలా అస్పష్టంగా చెప్పానని నాకు అర్థం అయింది. అందువల్ల ఇది నా ఫెయిల్యూర్ అని ఒప్పుకుంటాను. నా భావాలు కొద్దో గొప్పో తెలిసిన మిత్రులూ, ఆప్తులూ కూడా అర్థం చేసుకోలేనంత గజిబిజిగా ఉంది కాబట్టే ప్రేక్షకులెవరికీ కూడా సరిగ్గా అర్థం కాలేదు! ఏ ఒక్క ఓటమితోనూ జీవితం ఆగిపోదు కాబట్టి మళ్ళీ ప్రయత్నించాలి నేను!"

మళ్ళీ ఇద్దరం మా ప్రయత్నాలలో మేం పడిపోయాము. నా చిత్రం విజయవంతమైనందువల్ల నాకు ఆర్థికంగా ఏ ఇబ్బందీ లేకపోయింది. రాజారావు ఊరికి వెళ్ళి మరి కొంతపొలం అమ్ముకుని వచ్చాడు. నేనూ కొంత ఆర్థిక సాయం అందజేసి, మరికొంత ఋణ సౌకర్యం లభించడానికి కూడా పూర్తి సహకారం అందించాను.

వాడిగా, వేడిగా, వేగంగా వ్రాస్తున్న ఓ యువ రచయిత కథ పట్టుకుని నా గత సినీమా డైరెక్టరుతోటే నా పంథాలో నా రెండో సినీమా సాగించాను. రాజారావు మళ్ళీ

తనే వ్రాసుకున్న మరోకథ, మాటలు, స్క్రీన్‌ప్లేతో తనే డైరెక్ట్ చేసుకుంటూ మరో ప్రయత్నం చేశాడు– తన పంథాలోనే.

నిజం చెప్పాలంటే... రాజారావు సినీమాముందు నా సినీమా చాలా డల్‌గా ఉందనిపించింది నాకే! నా అభిప్రాయాలతో మిత్రులు, హితులు చాలామంది ఏకీభవించారు కూడా! కానీ చరిత్ర పునరావృతమైంది... నా సినీమా చాలా కేంద్రాలలో సునాయాసంగా శతదినోత్సవాలు చేసుకుని నన్నో మంచి చిత్రనిర్మాతను చేస్తే... రాజారావు సినీమా ఏ కేంద్రంలోనూ పాతిక రోజులు పాటయినా ఆడకపోవడంవల్ల ఒక రకంగా అతడు మట్టికొట్టుకు పోయినట్లయిపోయాడు. ఎటొచ్చీ అతని సినీమాకు చాలా మంచి టాక్ రావడం మాత్రం ఆశ్చర్యకరం అయి కూర్చుంది.

చాలాకాలం పాటు తమ ఊరికి వెళ్ళి పోయాడు రాజారావు. ఇహ తిరిగి రాడనే అనుకున్నాము అందరం.

నేను ఏకబిగిన మీద మీదనే మూడు సినీమాలు తీసేసి, ఉత్సాహంగా ముందుకొచ్చిన డిస్ట్రిబ్యూటర్ల పుణ్యమా అని విజయవంతంగా ఆడించి సక్సెస్‌ఫుల్ నిర్మాతల జాబితాలో చేరిపోతున్న తరుణంలో తిరిగి వచ్చాడు రాజారావు... అంతకాలం తను కష్టపడి వ్రాసుకు వచ్చిన కథ... దానికి సంబంధించి తనే తయారు చేసుకున్న స్క్రీన్‌ప్లేతో!

అతని కథ అద్భుతంగా ఉంది! కథనంలో గమ్మత్తయిన నిండుదనం ఉంది!! సమాజానికి అత్యవసరంగా కావాల్సిన విషయాలూ చాలా చాలా ఉన్నాయి అందులో!

తన కథతో నన్ను సినీమా తీయమని అభ్యర్థించాడు రాజారావు.

నేను చాలా ఆలోచించి తిరస్కరించాను. అంత రిస్క్ తీసుకునే ధైర్యం నాలో లేకపోయింది. కానయితే కొంతమేర ఆర్థిక సహాయం అందించడానికి, మరికొంతమేర ఋణ సౌకర్యానికి పూచీ పడటానికి అంగీకరించాను.

మొత్తానికి వరదమీదున్న నదిని చిన్న తెప్పమీద దాటటానికి ప్రయత్నిస్తున్న వాడిలా రంగంలోకి దూకాడు రాజారావు. గొప్ప సాహసం అతనిది నిజానికి.

రెండునెలల పాటు తను అవిశ్రాంతంగా శ్రమించాక, ఆర్థికలోటు పెద్దదవుతున్న సమయంలో అనుకోకుండా అతని షూటింగ్ చూసిన వర్ధమానతార అంజలి అతని సినిమా నిరాటంకంగా పూర్తవడానికి తగిన పెట్టుబడి అందించడానికి స్వచ్ఛందంగా తన అంగీకారం తెలిపింది.

ఆర్థిక వెసులుబాటు లభించాక అతని ప్రయత్నం మరింత వేగంగా ఊపందుకుంది. కానీ... ముగింపు దశకు చేరువలో ఉండగా మళ్ళీ అతనికి ఆటంకాలు ఎదురయ్యాయి.

సహజంగా ఆలస్యం అయ్యే ఇన్‌డోర్ షూటింగ్ అంతా అప్పటికే ముగిసిపోయింది కానీ తొందరగా జరిగిపోయే అవుట్‌డోర్ షూటింగ్‌కు రోజుల తరబడి నిరవధికంగా కురిసిన వర్షాలు, ఆపై వెంటనే తగ్గని సైక్లోనిక్ వెదర్, ఆ వెనుక పొగమంచు... ఇలా ఆటంకాలు కలుగుతూ వచ్చాయి.

సరిగ్గా అప్పుడే అంజలి తన పెట్టుబడి ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపి సంచలనం సృష్టించడమే కాకుండా రాజారావు మీద తన డబ్బుకోసం ఒత్తిడి కూడా మొదలుపెట్టింది. పైగా ఫీల్డులో రకరకాల వదంతులు...

"ఇంతకూ విషయమేమిటి?" అని నిలదీశాడు రఘుపతి ఓ రోజు.

"చెప్తే నమ్మగలరా?" అన్నాడు రాజారావు సంశయంగా

"ఖచ్చితంగా!" అన్నాం ముక్త కంఠంతో!

"ఓ రోజు తను నన్ను డిన్నర్‌కు ఆహ్వానించింది. నాకిష్టమై డ్రింక్, అద్భుతమైన వంటకాలు... చాలా చక్కటి మూన్‌లైట్ డిన్నర్... అంతవరకూ అంతా బావుంది! ఆ తరువాత ఆమె ప్రవర్తనే నచ్చలేదు నాకు!" అన్నాడు.

అర్థం అయింది మాకు.

ఫీల్డులో ఇలాంటివి మామూలే! వాస్తవానికి పురుషులకన్నా స్త్రీలకు ఇలాంటి ఇబ్బందులు చాలా ఎక్కువగా ఎదురవుతుంటాయి. తగిన రక్షణ వలయం ఏర్పరచుకోలేని వాళ్ళకు రెండే మార్గాలు... లొంగిపోవడమో!... ఫీల్డుకు దూరం అయిపోవడమో!!

అరుదుగా అయినా పురుషులకూ ఈ అనుభవాలూ ఎదురవుతూ ఉంటాయి... ఒక్కోసారి తల ఒగ్గకా తప్పదు!

రఘుపతికి ఒళ్ళు మండిపోయినట్లుంది.

"కాసేపు ఒళ్ళు మరిచిపోయుంటే నీ సొమ్మేం పోయింది?" అన్నాడు చాలా కోపంగా.

"అలాంటప్పుడు నేనింత కష్టపడి ఈ సినిమాను ఇంత అద్భుతంగా మలచాల్సిన అవసరం లేదు. మా ఊర్లోనే ఇంకాస్త మిగిలి ఉన్న బురదమడి చెక్క దున్నుకుంటూ అక్కడే బ్రతకవచ్చు ప్రశాంతంగా!" అన్నాడు సీరియస్‌గా రాజారావు.

"ఊహలలో బ్రతకడం మానెయ్యి రాజారావ్! ఒక్క ప్రశ్న అడుగుతాను... ఇప్పుడు... ఈ చివరి దశలో నీ సినిమా ఆగిపోతుందనుకో... ముగింపుచెయ్యలేక పోవడం ఎంత దారుణం?"

అప్పుడు మళ్ళీ నవ్వేశాడు రాజారావు.

"వాస్తవంలో తప్ప నేనెప్పుడూ ఊహలలో జీవించను రఘూ... అదే అసలయిన సమస్య సమాజంతో నాకు! నేనీ చిత్రం పూర్తిచేశాక ఫెయిల్ అయిందనుకుందాం... అప్పుడైనా దారుణమే కదా? ఈ వాస్తవాన్ని నేనెప్పుడూ గుర్తుంచుకునే ముందడుగు వేస్తాను. అందువల్ల సినిమా ముగింపజేయలేక పోయినా తట్టుకుని నిలబడగలను!" అన్నాడు.

"అంత బాధ ఎందుకు?... ఆమెతో స్నేహంగా ఉంటే పోయే కదా? ఎటూ నెలల తరబడి నీ కుటుంబానికి దూరంగానే ఉంటున్నావు కదా?" అన్నాను నేను... ఆనాలోచితంగా.

రాజారావు దెబ్బతిన్నట్లుగా చూశాడు. ఆ చూపును నేను ఎప్పటికీ మరచిపోలేను.

"ఒక్క ప్రశ్న రామ్మూర్తీ... నేను దూరంగా ఉంటున్నాని మా ఊర్లో నా శ్రీమతి మరెవరితోనైనా స్నేహం ఏర్పరచుకోగలదంటావా?"

"నెవర్!" అన్నాను నేను గాయపడి నొచ్చుకుంటూ.

"అలా ఎన్నటికీ జరగదు!" అన్నాడు రఘుపతి నమ్మకంగా.

"ఎందువల్లంటారు?"

ఆ ప్రశ్నకు నేను కానీ, రఘుపతి కానీ జవాబు చెప్పలేకపోయాం.

అందువల్ల... "సగటు స్త్రీ తన భర్తను నమ్ముతుంది. తనలాగే తన భర్తకూడా ఉండి పోగలడని విశ్వసిస్తుంది. నిజానికది పరస్పర విశ్వాసం. ఆ విశ్వాసం మృగ్యమైననాడు ఆ దాంపత్యం మనుగడకు అర్థమేలేదు! ఈ నిర్వచనం మానవ సంబంధాలకూ వర్తిస్తుంది!!" అన్నాడు రాజారావు తనే నిర్వికారంగా.

లాభ నష్టాలను గూర్చి ఆలోచించకుండా ఓ మనిషిగా వీలయినంత డబ్బు సర్దుకుని మరునాడు రాజారావు దగ్గరకు నేను వెళ్ళేసరికి అతని టేబుల్ మీద అప్పటికే రఘుపతి ఇచ్చివెళ్ళిన చెక్కు పేపరువెయిట్ క్రింద ఫ్యానుగాలికి రెపరెపలాడ్తోంది.

✶ ✶ ✶

అతని చిత్రం పూర్తయింది.

ఆలోపు రాజారావు ఖాళీ అయిపోయాడు పూర్తిగా.

ఊర్లో మిగిలిఉండిన కాస్తపొలం, ఇల్లు అన్నీపోయి, తను ఇక్కడుంటున్న అపార్ట్‌మెంటుకు కూడా నాలుగైదు నెలల అద్దె బకాయిలలో ఉన్నాడు. ఆ అపార్టుమెంటుకు కూడా ఫోను, కరెంటు సౌకర్యాలు కట్ అయ్యాయి అప్పటికే.

ప్రివ్యూ చూశాను అందరితోపాటు.

ఆ సినిమాలో ఏమీ లేదు వాస్తవానికి! కానీ నాకు తెలీనిదేదో చాలావుంది అందులో!! దాన్నిగూర్చి నా ఎలిమెంటరీ స్కూలు రోజులలో ఎవరో ఏదో తెలిపినట్లు ఉంది. కానీ జ్ఞాపకాలు లేవు సరిగ్గా.

తరువాత హైస్కూల్లో ఉపాధ్యాయులు కానీ, కాలేజీలో లెక్చరర్లు కానీ, యూనివర్శిటీలో ప్రొఫెసర్లు కానీ... చివరికి... పూనా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో నాకు శిక్షణ ఇచ్చిన ఆర్ట్స్ స్కాలర్లు సైతం ఎక్కడా ఏదీ చెప్పినట్లు లేదు.

ఇంకో చిత్రం ఏమిటంటే... అంత నిడివి సినిమా లోనూ ఎక్కడా అవాస్తవమనిపించే సంఘటన ఏదీ కనిపించలేదు. అభూత కల్పనలు లేవు. అర్ధనగ్న దృశ్యాలస్సలులేవు. యుద్ధ రంగాన్ని తలపింపచేసే ఫైట్స్‌గానీ, వయోలెన్స్‌లు కానీ లేవు... పైగా అన్నీ విభిన్నమైన పాత్రలు...

అయితే చాలా మామూలు పాటలు వినసొంపుగా ఉండి అలా, అలా ఎక్కడికో తీసుకువెళ్ళాయి. ఒంటినిండా చీరలే ధరించిన స్త్రీ పాత్రలు సైతం ఎంతో ఆకర్షణీయంగా కనిపించి కన్నార్పకుండా చూసేలా చేశాయి. చిత్రం చివరిదాకా విసుగేమాత్రం లేకుండా చూడనిచ్చింది.

ఓ మారుమూల పల్లెలో ఇంకా పాలు త్రాగే వయసులోనే ఉన్న పసివాడ్ని చంకనేసుకుని ఎండు కట్టెపుల్లలకోసం ఓ తల్లి బయల్దేరడంతో కథ చాలా సాదా సీదాగా ఆరంభమవుతుంది.

కొండలో ఆమె ముగ్గురు కిరాతకులచేత బలాత్కరించబడి ఆ రాత్రే చెరువులో పడి మరణిస్తుంది.

పగలంతా ఎండలో శ్రమపడే కష్టజీవి అయిన తండ్రి శరీరం నుండి కారే చెమటను, రాత్రులందు చీకటి గుయ్యారంలాటి ఇంట్లో దీపం వెలుగులో తండ్రి కన్నీటినీ చూస్తూ పెరిగే కుర్రవాడు ఆ ముగ్గురినీ గుర్తించుకుంటాడు.

ఎంతో కష్టంతో సాగే చదువతనికి వివేకాన్నీ, ఆలోచనలనూ ఇస్తే... కొందరు ఉపాధ్యాయులూ, పొరుగువూరికి చెందిన ఓ త్రాగుబోతు మోతుబరీ అతనికి జీవితం తాలూకు విలువల్ని గూర్చి తెలియజేస్తూ వస్తారు.

అతనిలో పాతుకుపోయిన పగకూ... పెరిగే మనిషితనానికీ మధ్యన సంఘర్షణ ప్రారంభమవుతుంది.

తమపల్లెలో ఎదురులేని ఆ ముగ్గురు కిరాతకులనూ ఎదిరించి కొంతమేర విజయం సాధించినా ఆపై దెబ్బతిని అవిటివాడయిపోయి పట్నం ఆస్పత్రిలో పడిపోతాడు అతడు.

తిరిగి వచ్చిన తరువాత పోరాట పటిమను కోల్పోయి పిరికివాడుగా మారిపోయినట్లు కనిపిస్తాడు... కానీ... త్రాగుబోతు మోతుబరితో మాత్రం తను తన జీవితంలో ముగ్గురిని హత్య చేస్తానని ప్రతిజ్ఞగా చెప్తాడు.

అప్పుడు త్రాగుబోతు మోతుబరి కాలాన్ని గూర్చి కొన్ని లెక్కలు వేసి, “నీ జీవితంలో నీవు ఎవరినీ చంపలేవు!... నీ చేతులకు రక్తం అంటే ప్రసక్తే ఉండదు!” అని ఘంటాపదంగా చెప్తాడు.

పిరికివాడుగా నటిస్తున్న యువకుడు తన తండ్రిని, బంధువులను ఒప్పించగలిగేలా ఓ సంఘటన సృష్టించి అజ్ఞాతంలోకి పారిపోతాడు. అయితే అతిరహస్యంగావచ్చి వెళుతూ కొద్ది సంవత్సరాల తరువాత ముగ్గురు మోతుబరులనూ ఒకేచోట సజీవ సమాధి చెయ్యడానికి ప్రయత్నిస్తాడు.

ఎన్నో సంవత్సరాల పాటు సాగిన అతని ఆ సుదీర్ఘ ప్రయత్నం విజయవంత మవడానికి కొద్ది నిమిషాలు ముందు ప్రకృతి చేతిలో ముగ్గురు మోతుబరులూ సహజ సిద్ధంగా ప్రాణాలు వదలడంతో అతడు గెలుపూ, ఓటమీ కాని ఓ సందిగ్ధ రేఖమీద నిలబడి పోవడంతో కథ ముగుస్తుంది.

స్థూలంగా అదీ కథ. అలాంటి కథలెన్నో వచ్చాయి... వస్తున్నాయి... కానీ ఆ చిత్రనిర్మాణంలోనే పాతదనంతో కూడిన కొత్తదనం ఏదోఉంది. అదే అర్థం కాకపోయింది నాకు... నాకేకాదు... ఎందరికో???

హీరో, హీరో కన్నా హీరోయిన్లు, వారి కన్నా క్యారెక్టర్ యాక్టర్లు... అందరికన్నా విలన్లు అద్భుతంగా పోటీలుపడి నటనలో జీవించిన చిత్రం.

ఆ చిత్రాన్ని నేనే కాదు... నా మిత్రులందరూ కూడా ఓ దృశ్యకావ్యంగా అంగీకరించారు. కానీ బాక్సాఫీసు విషయాల్ని ముందుగా చెప్పలేకపోయారు ఒక్కరైనా.

డిస్ట్రిబ్యూటర్ల స్పందన అంతంత మాత్రమే! నేనూ, రఘుపతీ కన్విన్స్ చేసి కష్టంమీద డిస్ట్రిబ్యూటర్లను ఒక తాటిమీదకు తేవాల్సి వచ్చింది.

రాజారావు జీవితంలో ఇదే ఆఖరి చిత్రం అనుకున్నాను నేను. అదే వాస్తవమయింది కూడా!

డిస్ట్రిబ్యూషన్, ఇహ ఆపై విషయాలు మొత్తం మా చేతుల్లో ఉంచేసి తను తెరమరుగుకు వెళ్ళిపోయాడు రాజారావు.

సినీమా రిలీజయ్యే వరకూ చీకటి అపార్టుమెంటులోనే గడిపాడు... విడుదలయ్యాక కూడా సినిమానుగూర్చి విచారించినట్లు లేదు. మొత్తానికి ఆ సినిమాకు ప్రేక్షకుల స్పందన కూడా అంతంత మాత్రంగానే కనిపించింది ప్రారంభంలో.

నేనూ, రఘుపతీ వెళ్ళాము నగరం చివరి ఆ అపార్టుమెంట్సుకి రాజారావు కోసం.

"నీ సినిమా రిలీజయి నడుస్తోంది!" అన్నాడు కోపంగా రఘుపతి.

"తెలుసుకదా?" అన్నాడు రాజారావు క్లుప్తంగా.

రఘుపతి మరింత ఉడుక్కుని మౌనం వహించాడు.

"ప్రజలెవరైనా చూస్తున్నారా?" అని అడిగాడు రాజారావు నవ్వేసి, రఘుపతి భుజంమీద చెయ్యి వేస్తూ.

'ప్రేక్షకులు' అనే పదం అతని నోటినుండీ రాలేదని గ్రహించాను.

"ఆ! జనాలు చూస్తున్నారు... చివరిదాకా... కానీ ఒక్కరైనా ఒక్క మాటనడం లేదు. కనీసం ఒకరితో ఒకరైనా మాట్లాడడం లేదు. సీరియస్‌గా వెళ్ళిపోతున్నారు!" అన్నాడు రఘుపతి కోపంగానే.

అప్పుడు... ఆ క్షణాలలో రాజారావు కళ్ళలో మెరిసిన ఓ మెరుపు, అతని పెదవులమీద విరిసిన విజయదరహాసం నా మనసులో చిరస్థాయిగా చోటుచేసుకున్నాయి.

"రఘూ, నా పిక్చర్ గ్రాండ్ సక్సెస్ అవుతుంది... మన డబ్బుకు దిగులుండదు!" అన్నాడు నవ్వుతూ.

"డబ్బు గూర్చి నేను బాధపడను... నీ నిరాసక్తతే..." అన్నాడు రఘుపతి.

రాజారావు రఘుపతిని కౌగలించుకుని ఏదో అన్నాడు కానీ నాకు సరిగ్గా వినిపించలేదు.

'ఈ సినిమా ఎలా గ్రాండ్ సక్సెస్ అవుతుందా?' అన్న ఆలోచనలో పడిపోయాను అప్పుడు.

మొత్తానికి రాజారావు అన్నదే యదార్థమయింది. అయితే ఆ సినీమాకు క్రమంగా రషెస్ పెరుగుతోండగా తన బట్టలవీ సర్దుకోవడం మొదలు పెట్టాడు రాజారావు.

"ఎక్కడికి ప్రయాణం?" ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

"మా ఊరికి!"

"నీ సినిమా అన్ని కేంద్రాలలో ఎవ్వరూ ఊహించనంత ఊపందుకుంది... ఇంకా ప్రింట్లు వేయించాలని డిస్ట్రిబ్యూటర్లిపుడు గోల పెడ్తుంటే నీవు వెళ్లిపోతావా? అయినా అక్కడింకా ఏముంది?" అన్నాను కోపంగా.

ప్రపంచీకరణ ప్రభావం సమాజంలో తెచ్చిన మార్పులకు అతీతంగా వచ్చింది అతని జవాబు...

"నా తల్లిదండ్రులు, భార్యా పిల్లలూ... ఐమీన్... నా కుటుంబం... ఇంకా ... బంధువులు, మిత్రులతో కూడిన చిన్న ప్రపంచం ఉంది కదా?"

అతని జవాబుతో కొద్దిగా సిగ్గుపడ్డాను నేను.

నా చేతుల్లో కొన్ని కాగితాలు పెడ్తూ అన్నాడు రాజారావు... "సమాజం కోసం నేను చెప్పదలుచుకున్నది నా చిత్రం ద్వారా చెప్పగలిగాననే అనుకుంటున్నాను. ఇక సమాజానికి స్వయంగా చెయ్యగలిగింది కొంత ఉంది. దాని కోసం నేను మా ఊరు వెళ్ళిపోక తప్పదు!"

చిత్రం మీది ఆదాయాలన్నీ సర్వహక్కులతో సహా నా పేరిటా, రఘుపతి పేరిటా దాఖలు చెయ్యబడ్డ నోటరీ అఫిడివిట్ ఆ కాగితాలు.

"ఇదేమిటి?" అన్నాను ఖంగుతిని.

"ఈ చిత్రం మీద మీ ఇద్దరి డబ్బూ చాలా ఉంది! మీరు షూరిటీలిచ్చిన లోన్లున్నాయి. అవన్నీ జమయ్యాక మిగులుతూ వచ్చే డబ్బులు ఏమైనా ఉంటే నా పేరిట పంపుతూ ఉండండి... అది నా కార్యాచరణకు ఉపకరించవచ్చు!" అన్నాడు ఆ వింత వ్యక్తి.

ఆ చిత్రం విజయ పరంపరల్ని చూడకుండా ఏదో మారుమూలనున్న తన ఊరికి అతడు వెళ్ళిపోయినా క్రమంగా చాలా పెద్దమొత్తాలనే అతని పేరిట చెక్కుల రూపంలో పంపగలిగాము నేనూ, రఘుపతీ.

ఓ హిందీ చిత్ర నిర్మాత ఆ చిత్రాన్ని పెద్ద మొత్తంతో యధాతధంగా కొనుక్కొని "లంగడా ఆద్మీ" పేరిట హిందీలోకి డబ్ చేసుకున్నాడు.

ఆర్నెల్ల తర్వాత అదే నిర్మాత మళ్ళీ దాన్నే యధాతధంగా "ఊండెడ్ సోల్జర్" పేరిట ఆంగ్లంలోకి డబ్ చేసుకోవడానికి మళ్ళీ హక్కులు కొనుక్కున్నాడు మావద్ద.

డబ్బు అయితే అతనికి పలుమార్లు పంపగలిగాము కానీ అతని విషయాలు ఏవీ మాకు తెలిసే అవకాశం లేకపోయింది. ఫోను సౌకర్యానికి కూడా ఆమడ దూరంలో ఉన్న అతని గ్రామానికి వెళ్ళి అతన్ని చూసి రావడానికి నిరంతర జీవన సంగ్రామం కొంత కాలం విరామమివ్వకపోయింది మరి.

* * *

రాజారావును గూర్చిన ఆలోచనలతో రాత్రంతా మేలుకొని తెల్లవారు ఝామున ఎప్పుడో నిద్రపోయిన నన్ను తట్టిలేపాడు రఘుపతి.

బాగా పొద్దెక్కింది.

స్టేషను వెలుపలికి వచ్చి ఓ జీపు మాట్లాడుకుని బయల్దేరాము. జీపు పదిహేను కిలోమీటర్లే వెళ్ళింది. ఆపై కొండదారి. జీపువాడే అక్కడ ఓ ఎడ్లబండి కుదిర్చాడు. అందులో దాదాపు ఐదారు కిలోమీటర్ల దూరం కొండల మధ్య, డొంకల మధ్య ప్రయాణించి గమ్యం చేరాం.

ఆ పల్లెటూర్లో అతనిల్లు బాగా పెద్దదే! ఆ మధ్యే కట్టించుకున్నట్లున్నాడు... చాలా సౌకర్యంగా ఉంది! కానయితే చాలా సాదాసీదాగా ఉంది!!

అతని కుటుంబీకులు కూడా పెద్దగా నగా, నట్రా లేకుండా సాధారణంగా ఉన్నారు. అయితే ఎవరి ముఖంలోనూ ఎక్కడా ఏ అసంతృప్తీలేదు. చాలా ప్రశాంతంగా, ఆనందంగా, నిండుగా ఉన్నారు.

"అంత డబ్బు పంపాము... పంపుతున్నాము... ఆఫ్‌కోర్స్ అతని డబ్బే అనుకో... ఏం చేశాడంటావు? ఇంత సింపుల్‌గా బ్రతికేస్తున్నాడు?" అన్నాడు రఘుపతి.

అతని ప్రశ్నకు మరునాటి ఉదయాన్నే జవాబు లభించింది.

పెందలాడే మమ్మల్నో కిలోమీటరు దూరం నడిపించి ఓ అద్భుతమైన లొకేషన్ మధ్యకు తీసుకెళ్ళాడు రాజారావు.

పచ్చదనంతో పరవశిస్తున్న ప్రకృతి మధ్య ఓ చిన్న మైదానం. అందులో పదిహేను అడుగుల పొడవు వెడల్పులతో ముప్పయి అడుగుల సమాంతర దూరంలో లెక్కలేనన్ని పెంకుల ఇండ్లు వలయాకారంలో కాటేజీలలాగా కనిపిస్తున్నాయి. ప్రతి ఇంటిలో ఓ మంచం, దానిమీద ఓ పరుపు, దిండు, దుప్పటి, దోమతెరలు. ప్రతి ఇంటికీ చిన్న మరుగు దొడ్డితో కూడిన నీళ్ళగది.

ఇంటికొకరు చొప్పున వయస్సులు పైబడ్డ మనుష్యులు!.. స్త్రీ పురుషులందరూ తెల్లని వస్త్రాలు ధరించి... మనసులలో, ముఖాలలో ప్రశాంతతలను నింపుకుంటూ...!!

గతంలో మా నగరంలో చెట్లక్రిందా, ప్లాట్‌ఫారాల మీదా కనిపించిన వాళ్ళూ కొందరున్నారు వారిలో!! ఎవరూ, ఎవరితోటీ పెద్దగా మాట్లాడడం లేదు. ఎటుచూసినా ప్రశాంతమైన నిశ్శబ్దం ఎదురవుతోంది.

అక్కడున్నవారిలో ఒకామెను చూడగానే దిగ్భ్రాంతి కలిగింది నాకు. ఆ శతాధిక వృద్ధురాలు మా దూరపు బంధువు.

నేను చిత్రరంగాన్ని ఎన్నుకుని మా ఊరు వదలక మునుపు... ఆర్నెలలకో, ఏడాదికో ఒక పర్యాయం ఆమె మా ఇంటికి వచ్చి కొద్దిరోజులపాటు ఉండి వెళ్తూండేది.

చివరిసారి ఆమె మా ఇంటికి వచ్చినప్పుడు ఉన్న కొద్దిరోజులూ ఎందుకో బాధపడ్తున్నట్లు కనిపించింది. వెళ్ళిపోయేముందు...

"ఉమ్మడి కుటుంబాలు పోయి ఎవరిదారి వారిదయిపోతోంది. చేతిలో అర్థం పంపకాలయిపోయింది. ఇప్పుడు ప్రేమగా చూసేవాళ్ళూ లేరు. వయస్సు పైబడి పోతోంది, శరీరంలో శక్తి సన్నగిల్లుతోంది! మీ ఇంటికి వచ్చినప్పుడు కొద్దిరోజులయినా ప్రశాంతంగా ఉంటూండేది... ఇప్పుడు నేనెక్కడికీ వెళ్ళకూడదని చట్టం కూడా చేస్తున్నారు మా వాళ్ళు. ఇంక మీదట ఇక్కడికీ రాలేను..." అంటూ నా తల్లితో చెప్పుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ ఆమె శెలవు తీసుకోవటం నేను మరచిపోలేక పోయాను. నాకు చాలా రోజులపాటు చాలా చాలా బాధను కలిగించింది ఆమె నిష్క్రమణం.

ఆ తరువాత ఇన్నేళ్ళకు ఆమె అక్కడ కనిపించడం ఆనందాశ్చర్యాలను కలిగించింది నాకు. పండుటాకులా మిగిలివున్నా పరమ ప్రశాంతంగా కనిపిస్తుండడం నా ఆనందానికి కారణమయితే... ఎక్కడి మా ప్రాంతం? మరెక్కడి ఈ ప్రాంతం??? తాలూకాలు దాటి జిల్లాలు దాటి ఇన్నివందలమైళ్ల దూరానికి ఆమె ఎలా చేరుకోగలిగిందా అన్నది ఆశ్చర్యకారణం.

నేను వెళ్లి పలకరించగానే ఆనందంతో కళ్ళనీళ్ళు పెట్టుకుంది! మా వాళ్ళనందరినీ పేరుపేరునా అడిగి కుశలం తెలుసుకుంది.

"ఇక్కడ మీకెలా ఉంది?" అని ప్రశ్నిస్తే...

"బ్రతికుండగానే భగవంతుడు నాకు స్వర్గప్రాప్తి కలిగించాడు నాయనా!" అంది తృప్తిగా ఆకాశానికేసి చేతులు జోడించి.

అక్కడున్న అందరిలోనూ ఆ తృప్తి, వెలుగులు సుస్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి.

ఓపికున్న కొందరు దగ్గరలోని కాలువకు వెళ్ళి స్నానాలు చేసి వస్తున్నారు. మేము ముగ్గురమూ కూడా వెళ్ళి కాలువ నీళ్ళలో కాస్సేపు ఈత కొట్టి వచ్చాము.

పదిగంటల ప్రాంతంలో మైదానం మధ్యలో ఎక్కడో ఏ చెట్టుకో కట్టబడిన గంటను మ్రోగించారు ఎవరో... అప్పుడు... మైదానంలో చెట్లక్రింద కూర్చున్నవారు, పెంకుటిళ్ళలో ఉన్నవారు... అందరూ మైదానానికి ఓ కొసన వున్న పెద్ద షెడ్డు దగ్గరకు నడుస్తున్నారు నిశ్శబ్దంగా.

ఓ వ్యక్తి అందిస్తున్న ఎర్రని బాదం ఆకుల విస్తర్లు పట్టుకువెళ్ళి మరో ముగ్గురు వ్యక్తులు వడ్డిస్తున్న ఆహారం తెచ్చుకుంటున్నారు అందరూ.

నేనూ, రాజారావు, రఘుకూడా వరుసలో వెళ్ళి ఆహారం తెచ్చుకుని ఓ రావిచెట్టు క్రిందున్న అరుగుమీద కూర్చుని తిని ప్రక్కనే పారుతున్న పిల్లకాలువలో చేతులు కడుక్కుని నీళ్ళు త్రాగాము.

గతరోజు పగలూ, రాత్రీ రాజారావు వాళ్ళింట్లో తిన్న రుచికరమైన పదార్థాలకన్నా కూడా రుచికరంగా ఉంది ఈ ఆహారం.

మధ్యాహ్నం మూడుగంటలనుండీ అక్కడున్న శతాధిక వృద్ధులు సైతం ఏదో ఒక పనిచేస్తూ కనిపించారు. అదంతా చూస్తుంటే ఆ ప్రదేశం వదలి వెళ్ళబుద్ధి పుట్టడం లేదు. సాయంకాలం ఆరు గంటలకు మళ్ళీ గంట శబ్దం వినిపించాక అందరితోపాటు రేకుల షెడ్డు వద్దకు వెళ్ళి మర్రి విస్తర్లలో ఆహారాన్ని తెచ్చుకుని తిన్నాం.

ఏడు గంటలయ్యేసరికి ఎక్కడి వాళ్ళక్కడ తమ తమ పెంకుటిళ్ళలోకి వెళ్ళిపోవడంతో మైదానం అంతా ఖాళీగా కనిపించసాగింది.

ఇహ అప్పుడు రాజారావు ఇంటికేసి నడుస్తుండగా అన్నాడు రఘుపతి...

"ఇంత గొప్ప యజ్ఞాన్ని నిర్వహిస్తూ మాకెవ్వరికీ తెలియనివ్వలేదెందుకు?"

"ప్రపంచంలోని అనాధలందరినీ ఆదుకోలేను. కనీసం కళ్ళకు కనిపించి నా దృష్టికి వచ్చే వాళ్ళలో కొందరికయినా కాస్త నింపాదిని కల్పించడం, ఆఖరి దశలోని వాళ్ళు ప్రశాంతంగా తమ చివరి మజిలీకి చేరుకోవడానికి సహకరించడం చేస్తున్నానో మనిషిగా!... దానికిక ప్రచార ఆర్భాటమొకటెందుకు?" అన్నాడు రాజారావు.

* * *

తిరుగు ప్రయాణంలో రైల్లో అన్నాడు రఘుపతి...

"రామ్మూర్తీ, నాజీవితంలో నేనో దృశ్యకావ్యాన్నితీయడానికి ప్రయత్నిస్తాను!" ✪

*(రచన మాసపత్రిక, సెప్టెంబర్, 2007)*

# పాముల రాజ్యం

ఎప్పటిమాట?

పాతిక ముప్ఫైయేళ్ళ నాటి మాట కద?!

జన్మభూమిని ప్రేమించేవాళ్ళూ అసంఖ్యాకంగానే వుంటారు. అయితే నరహరిలా పుట్టినవూర్ని ఇష్టపడేవారు మాత్రం అరుదనే అన్పిస్తుంటుంది నాకు ఎప్పుడూనూ.

ప్రేమో, ఇష్టమో, వీరాభిమానమో... ఏదో తెలియదు కానీ... చివరికి ఆ విషయం ఎంతవరకూ వెళ్ళిందంటే... పిల్లలకు చక్కటి విద్యాసౌకర్యాలున్న వూర్లో... హోదాతో కూడిన ఉద్యోగం, తక్కువ అద్దెతో ఎ.క్లాస్ క్వార్టర్సులో అనువైన బస, మంచి స్నేహితుల వలయం... వీటన్నింటినీ వదులుకుని ఎక్కడో ఓ మారుమూలనున్న తన స్వంత పల్లెటూరికి వెళ్ళిపోవాలనేవరకూ వచ్చేసింది.

"త్వరలో సెక్షనాఫీసర్ కాబోతున్నావు, తీరా వెన్న పడేప్పుడు బాన పగలగొట్టుకున్నట్లుగా ఉద్యోగం కాస్తా వదిలేస్తానంటావేం?" అంటూ మందలించాను.

నిండుగా నవ్వేశాడు నరహరి... అతని నవ్వు చాలా బావుటుంది.

"నాలాగే ఉద్యోగాలు సంపాదించుకునో, పిల్లల్ని చదివించుకోవడానికో లేదా వ్యాపారాలు చేసుకోవడానికనో చాలామందే పల్లె వదిలి టవున్లు చేరిపోయారు. అలా మా పల్లె వదిలిన తమ తమ బిడ్డల దగ్గరకు మా వూర్లోని పెద్దవాళ్ళు కూడా కొందరు వెళ్లిపోయారు. ఆ కారణంగా సగంవూరు బోసిపోయింది!

గిట్టుబాటు కూలీలు దొరుకుతాయనీ, దళారీపనులు చేసుకున్నా సుఖంగా బ్రతికెయ్యగలమనీ భావించిన సామాన్యులు కూడా చాలామందే నమ్ముకున్న మట్టిని వదిలి దగ్గరి దాపులలోని పేటలు చేరిపోతుండడంవల్ల... నిండుగా వుండిన మా పల్లెపాడుబడి పోతున్నట్లయిపోతోంది!

పల్లే ప్రాణంగా బ్రతికిన మా బాబాయిలు ముగ్గురూ కూడా వారి భార్యలతోసహా వారివారి పిల్లల దగ్గరకుచేరిపోయారు. అందువల్ల మాఅమ్మా, నాన్నా అక్కడ ఒకరకంగా వంటరివారయిపోయారు. పైగా మా నాయనమ్మా, నానయ్యా నిలచిపోతున్నారు.

వాళ్ళయితే తరతరాలుగా తమ పూర్వీకులు జీవించిన ఆ గాలినీ, ఆ నేలనూ వదిలి వెలుపలికి రాలేరు. ఒంటరిగా వారినలా వారి ఖర్మానికి వదిలి నేనిక్కడ

ఉండలేకపోతున్నాను. నా జన్మభూమి జవసత్వాలను జీవింపచేసుకోవాల్సిన బాధ్యత కూడా నా మీద ఉందని నేను భావిస్తున్నాను!" అంటూ తన అభిప్రాయాన్ని, ఆలోచనలనూ స్పష్టంగా, స్థిరంగా చెప్పేశాడు నరహరి.

నిజానికి నిలువెత్తు మనిషితనానికి నిదర్శనం నరహరి!

అప్పుడు అతన్ని చూస్తుంటే బాగా ముచ్చటేసింది.

పోతే, అతని శ్రీమతి కూడా అతనివెంట ఆ పల్లెటూరికి వెళ్ళడానికి ఆనందంగా అంగీకరించడం మాకో పెద్ద ఆశ్యర్యం ఆ రోజులలో!

ముప్పయిరోజులు వ్రేళ్ళమీద లెక్కపెట్టుకుంటే చాలు కరకు నోట్లకట్టను చేతుల్లోపెట్టే ఉద్యోగాన్నీ, నెమ్మదిమీద స్వంతం చేసుకోగల పెద్దంత క్వార్టరును, వృద్ధాప్యంలో లభ్యం కావాల్సిన పెన్షను సౌకర్యాలనూ... అన్నింటినీ... వదులుకుని అతడు నిశ్శబ్దంగా నిష్క్రమించడం మా డిపార్టుమెంటులోనే చాలా పెద్ద సంచలనం అప్పట్లో... ఆ జ్ఞాపకాలుకూడా బాగా పదిలమే... మాకు!

* * *

నిజానికి నికార్సయిన స్నేహితుడు నరహరి!

'ఏమయిపోయాడో? యేమో??' అని అనుకుంటూ అతన్ని వెతుక్కుంటూ వెళ్ళాను... రెండేండ్ల తరువాత!!

దాదాపు అరవయిమైళ్ళ రైలు ప్రయాణం, నలభైమైళ్ళ బస్సు ప్రయాణం... ఆపై ఆరుమైళ్ళు ఎడ్లబండిమీద బండిబాట ప్రయాణం... అదయ్యాక అరఫర్లాంగు దూరం బల్లకట్టులాంటి ఓ జలవాహనంపై కాలువ నీటిమీద ప్రయాణం... ఇక ఆపై అవతల్నుండీ ఎనిమిదిమైళ్ళ కాలినడక... కాలిబాట మీద... అదీ అడవిదారిన! పైగా మధ్యన రెండు చిన్న కొండల్లాంటి గుట్టల్ని ఎక్కిదిగడం!!

ఒక రకంగా భయానకం!

మరొకరకంగా అద్భుతమైన అనుభూతులతో కూడిన పచ్చని ప్రకృతి మధ్య ప్రయాణం!!

ఎట్టకేలకు లోయలాంటి ప్రదేశంలో పరమ ప్రశాంతమైన వాతావరణం మధ్యనున్న ఆ చల్లని పల్లెటూరిని చేరుకోగలిగాను. ఆ పల్లెకు, ఆ చుట్టుపట్ల అనేక పల్లెలకు, కొన్ని గ్రామాలకు కూడా కరంటు సౌకర్యం లేదప్పటికి.

సెల్‌ఫోను అంటే ఏమిటో కూడా తెలియని ఆ రోజులలో టెలిఫోన్‌ను ఉపయోగించు కోవాలన్నా కూడా ఆమడదూరంలో వున్న గ్రామంలోని బ్రాంచి పోస్టాఫీసుకు వెళ్ళాల్సిందే!

అయితే ఆ పల్లెలో నిశ్చింతగా, నిర్మలంగా, నిండుగా ఉన్నాడు నరహరి. అతని భార్యాపిల్లలు, ఇతర కుటుంబసభ్యులందరూ కూడా ఎంతో ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్నారు.

అయినా ఒక్క విషయం నన్ను కాస్త బాధించింది...

నరహరి అక్కడ మా మధ్యన ఉద్యోగం చేస్తున్నప్పుడు అతని పిల్లలు దర్జాగా జట్కాబండిలో బడికి వెళ్ళివస్తుండేవారు.

ఇక్కడ అడవిదారిన నాలుగుమైళ్ళు నడచి అవతలున్న చిన్న గ్రామంలోని పాఠశాలలో చదువు సాగించి చీకటిపడేవేళకు ఇంటికి తిరిగివస్తున్నారు.

నా బాధ చూసి నరహరి నవ్వేశాడు.

“మేమంతా అలా చదువు సాగించిన వాళ్ళమే కద?” అన్నాడు.

ఆపై నేనేం చెప్పలేకపోయాను. ఎందుకంటే సుఖంగా చదువులు సాగించే మా పిల్లలలో కన్పించని మెరుపులు, వెలుగులు యేవో వారి శరీరాలలో, ముఖాలలో కన్పించి ఆశ్చర్యం కలిగిస్తున్నాయి మరి.

మా కార్యాలయంలో పనిచేస్తుండినపుడు అతని దస్తూరీ, వ్రాత కసరత్తూ ఎంత చక్కగా, గొప్పగా ఉండేవో అంతకు రెట్టింపు గొప్పగా ఉందతని పాడీ, పంటా కూడా!

అతని ఇంటి ముంగిట, వెనుక కూడా కొట్టాలలో దేశవాలీ పశువులు నిండుగా కన్పిస్తూ చక్కటి రుచికరమైన పాడినివ్వటమేగాక అతని పొలాలకు సైతం సారవంతమైన సహజ ఎరువులు అందిస్తున్నాయి.

అతని తడిపొలాల్లో పచ్చని పంటలు పండుతున్నాయి. చేన్లలో పాడిపంటలతోపాటు అనేక ఫలవృక్షాలు సైతం పెరుగుతున్నాయి.

అక్కడతడప్పటికే ఆ ప్రాంత రైతులెందరికో ఆదర్శప్రాయుడయ్యాడని, అతన్ని అనుకరిస్తూ చాలామంది రైతులు తమ మట్టిలోంచీ బంగారపు పంటలను పండించేందుకు కృషిచేస్తున్నారనీ తెలిసింది.

ఆ పల్లెటూర్లో నన్నెక్కువ ఆకర్షించిన విషయం... అక్కడి మనుష్యులమధ్యని సయోధ్య. ముఖ్యంగా కులమతాలతో సంబంధం లేకుండా ప్రతిమనిషినీ ఆత్మబంధువులా భావిస్తూ వరుసలు పెట్టి సంబోధించుకునే ప్రేమపూరిత సంభాషణలు, ఆదరాభిమానాలు నాకెంతో నచ్చి నన్ను కొంతమేర ప్రభావిత పరిచాయి కూడా!

మరో విశేషం యేమిటంటే అక్కడి మనుష్యులు వారి పశువులను తమ ప్రాణంగా ప్రేమిస్తారు, శ్రద్ధగా పోషిస్తారు. దాదాపు ప్రతి ఇంటా శుక్రవారంనాడు గోవులను పూజించడం జరుగుతుంది.

అదలా వుంచితే, నేను ఆ పల్లెటూరు చేరిన మరునాడు...

పెందలాడే కపిలబాన భుజాన వేసుకుని మడికి నీళ్ళు తోడడానికి వాళ్ళ పెద్దబావివద్దకు వెళ్తున్న నరహరి వెంబడి అడుగులేస్తున్న నేను అదిరిపోయాను... దారికి అడ్డుగా వచ్చి నీరెండలో నిగనిగ మెరుస్తూ నిలబడి మరీ పడగపైకెత్తి చూసిన అరడుగుల త్రాచు దర్శనంతో!

మా వెనుకగా ఎద్దులను పట్టుకు వస్తున్న బుడ్డోడు కూడా ఎడ్లతోసహా ఆగిపోయాడు.

అసలే నాకు పామంటే చచ్చేంత భయం.

"అదేంచేస్తుంది? నా భుజం మీదున్న కపిలబానను చూసి భయపడి పడగెత్తి చూసింది... అంతే... మనం కాస్తా కదలకుండా ఇలాగే నిలబడ్తే దానిదారిన అదేపోతుంది!" అన్నాడు నరహరి నవ్వుతూ.

అతడు చెప్పినట్లే పామలా వెళ్ళిపోయింది.

మేం బావివద్దకు చేరగానే కపిలగిలక ముడుకులోంచీ మరోపాము వరిమడికేసి సాగిపోయింది సర్రున.

కపిలబాన తాళ్ళతో వెళ్ళి నీళ్ళలో పడగానే బావిలో రెండు సర్పరాజములు నీళ్ళలోనే వంకరటింకరగా కదిలి బావిమెట్ల క్రిందికి దూసుకుపోయి మాయం అయ్యాయి.

ఆ రాత్రి ఆరుబయట నిశ్చింతగా నిద్రించలేకపోయాను.

నా భయం చూసి నరహరి ఓ నులకమంచంమీద మందపాటి పరుపు పరిపించి, వెదురుకర్రలతో ఓ దోమతెరను కూడా బిగించాడు. అయినా నా సూట్‌కేస్‌లోంచీ టార్చ్‌తీసుకుని ప్రక్కనుంచుకున్నాక కానీ నాకు కంటిమీద కునుకు పడలేదు.

అది మొదలు...

ఆ వూర్లో ఎటువెళ్ళినా ఎక్కడో ఒకచోట తప్పనిసరిగా సర్పదర్శనం సర్పదర్శనంలా దృశ్యమానమవడం మొదలైంది. మొత్తానికి నరహరి వాళ్ళవూరు కాస్తా ఓ పాములరాజ్యంలా అన్పించసాగింది నాకు.

అయితే ఆ వూర్లో పిల్లలకుగానీ, పెద్దలకుగానీ... చివరకు స్త్రీలకు కూడా పాములంటే ఏ కాస్తయినా భయం ఉన్నట్లు లేదు. ఒక రకంగా పాములతో సహజీవనం చేస్తున్నారు అందరూ నిర్వికారంగా! నిశ్చింతగా!!

నరహరినీ, అతని కుటుంబాన్నీ, ఆ ప్రాంతపు మనుష్యులనూ, ఆ వూరి ప్రశాంతతనూ, చుట్టుపట్ల ప్రకృతి సౌందర్యాలనూ చూస్తూంటే ఆ ప్రదేశం వదిలిరావడానికయితే మనస్కరించలేదు కానీ... అడపాదడపా అలా కన్పించి ఇలా వెళ్ళిపోయే పాముల పరామర్శలకు మాత్రం బాగా భయపడిపోయాను. పైగా నిరంతర జీవన సంగ్రామానికి చెందిన వృత్తిబాధ్యతలు, కుటుంబపు వ్యక్తిగతపనులు తప్పవు కద?

అందువల్ల త్వరగానే తిరుగుప్రయాణం అయ్యాను.

✶ ✶ ✶

నరహరి ఎప్పటికీ ఆ పల్లెటూరు వదిలి వెలుపలికి రాకపోయినా నేను ఏడాదికో పర్యాయం తప్పకుండా వాళ్ళవూరు వెళ్ళి రెండ్రోజులయినా గడిపి వస్తుండడంవల్ల నరహరి కుటుంబంతో, ఆ వూరితో అనుబంధం పెరిగింది... కొనసాగింది కూడా!

నరహరి జీవనవిధానాన్ని చూస్తుండడంవల్ల తల్లిదండ్రులను, పెద్దలను ఎలా గౌరవించాలో, ఎవరిని ఎలా సేవించుకోవాలో, పిల్లలను ఎలా ప్రేమించాలో, క్రమశిక్షణలో కట్టడి తప్పకుండా ఎలా పెంచి పోషిస్తూ రావాలో నిర్దిష్టంగా తెలుస్తూ వచ్చింది.

అందువల్ల నా జీవితంలో కొన్ని అమూల్య జ్ఞాపకాలను మిగుల్చుకుని పదిలపరచుకో గల అవకాశం అభ్యమైంది నాకు. వాటిలో ముఖ్యమైనది నా తల్లిదండ్రులు వారి చివరిదశ కాలంలో నావద్దే వుండిపోవడం! అందువల్ల వారి రుణం కొద్దో గొప్పో తీర్చుకోగల భాగ్యం నాకు దక్కింది.

✶ ✶ ✶

సజావుగా ఉద్యోగంచేసి, సంతృప్తిగా, ఆనందంగా పదవీ విరమణ చెందిన తరువాత కూడా నా జీవనయానం నిండుగానే సాగుతోంది. అయితే అక్కడక్కడ కొన్ని అపశృతులూ, ఒక్కోచోట ఒకింత అశాంతీ తప్పడంలేదు.

అందుకు కారణం కొందరు బంధుమిత్రులు.

నేను రిటైర్ అయ్యాక ఆప్తులనుకున్న వారిలో కొందరి రాకపోకలు కారణమంటూ లేకుండానే క్రమంగా తగ్గిపోయాయి. బహుశా ఉద్యోగం అనేది కూడా వారి దృష్టిలో ఒక స్టేటస్ సింబల్ అయి వుండవచ్చు.

వారిలో ఎవరైనా దార్లో ఎక్కడైనా తటస్తపడినా వారి మాటలు తప్పనిసరై మాట్లాడుతున్నట్లుగా పొడిగా ఉంటున్నాయి తప్ప ఆ మాటలలో ఆత్మీయహృదయస్పర్శ కన్పించడంలేదు. అందులోనూ మరీ ఒక్కరిద్దరి ప్రవర్తనలయితే... నాతో మాట్లాడితే నేనేం సహాయం అర్థిస్తానో అని భయపడ్తున్నట్లుగా అన్పించి నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఎందుకంటే నేను ఎప్పుడూ, ఎందుకోసమూ, ఎవరిమీదా ఆధారపడ్డవాణ్ణి కాను మరి.

ఒక రకంగా చెప్పాలంటే నా చుట్టూ నేను ఏర్పాటుచేసుకున్న బంధాలలో కొన్ని మానవ సంబంధాలుగా కాక అవసర, ఆర్థిక బంధాలుగా మాత్రమే ముడిపడి నడుస్తూ వచ్చి వుండాలి. అయితే ఆ రెండింటి మధ్యనున్న చిన్నతేడాను మాత్రం ముందే నేను పసిగట్టలేక పోయానన్నది వాస్తవం.

సరిగ్గా ఈ విషయంలోనే నరహరి చాల తెలివిగా ముందు చూపుతో వ్యవహరించాడని చెప్పవచ్చు. అతడు యవ్వనంలో శ్రమపడ్డా వృద్ధాప్యంలో ఏ రకమైన లోటుపాట్లూ లేని కుటుంబ వ్యవస్థనూ, బంధుమిత్రుల బంధాలనూ తనచుట్టూ పటిష్టంగా ఏర్పరచుకో గలిగాడన్నది వాస్తవం. అతనితోపాటు అతని పల్లె కూడా బాగా ఎదిగి పంచాయతీ గ్రామంగా రూపుదాల్చింది. అంతేకాదు... ఆ ప్రాంతంలో సహజసిద్ధమైన ప్రకృతి వనరులూ, వృక్షసంపదా శ్రద్ధగా పరిరక్షింపబడ్తూ రావడంవల్ల అక్కడ బోరుబావుల అవసరం రాకపోయింది. పచ్చని పచ్చదనంతో నిండుకున్న ఆ చల్లటి ప్రాంతం మీద సులభంగానే వాన వాలుతుండడంవల్ల పశుగ్రాసానికి కొరత లేకపోయింది. అందువల్ల నీళ్ళ తొట్టెలలో ఎముకల పొడివేసి, మట్టి, నీళ్ళుపోసి నాచుపెంచి దాన్ని గడ్డిక్రింద పశువులకు పెట్టాల్సిన హీనదుస్థితి ఎప్పుడూ ఏర్పడలేదు ఆ ప్రాంతంలో.

దేశవాలీ పశువులు గణన తగ్గకుండా పెంపు చెందుతూ వస్తుండడంవల్ల అక్కడి పాడి, సహజసిద్ధమైన ఎరువులతో పండింపబడే ఆ ప్రాంత పంటలూ, పండ్లూ, కూరగాయలూ ప్రఖ్యాతి చెందాయి. ఆ రుచికరమైన ఆహారం కోసమే కద నేను అర్రులు చాచేది!

ఆ పంచాయతీకి చెందిన ఉన్నత పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులు సాధించిన ఉత్తీర్ణతలు, పొందిన మార్కులు, ర్యాంకులు రాష్ట్రవ్యాపితంగా సంచలనం కలిగించడమే కాదు, ప్రసిద్ధిపొందిన ఆంగ్లమాధ్యమ కార్పరేట్ విద్యాసంస్థలు సైతం ముక్కున వ్రేళ్ళేసుకునేలా చేశాయి.

మనుషులతోపాటు, పశువులూ, భూమీ, ప్రకృతీ కూడా ప్రేమింపబడే ఆ గ్రామం ఆదర్శగ్రామంగా కూడా ప్రభుత్వ గుర్తింపుకు నోచుకుంది.

ఇక్కడ... నా పరిసరాలలో క్రమంగా వచ్చిన, వస్తున్న కొన్ని చిన్నచిన్న మార్పులను, కొందరి ప్రవర్తనలను జీర్ణించుకోలేకపోయిన మరోప్రాణి నా శ్రీమతి!... మా ఇద్దరి మనస్తత్వాలు ఒక్కటే... పైగా తక్కువ జీవితానుభవం గల తను ఉక్కిరిబిక్కిరయిపోతుంటే, ఏం చెయ్యాలో తెలియని అయోమయంలో నేనుండిపోయాను.

“కొద్దిరోజులపాటు ఎటయినా వెళ్ళి తీర్థయాత్ర చేసి వద్దామండీ!” అంది నా శ్రీమతి ఒకరోజు.

సున్నితమైన ఆమె మనసు కుదుటబడడానికి అదే చక్కటి ఉపకరణం అన్పించి అంగీకరించాను నేను.

ఆ ప్రయత్నాలలో నేనుండగానే మా పట్టణాన్ని వరదచుట్టుముట్టింది. గత వందసంవత్సరాలలో ఎన్నడూ రానంత వరద నీరు జలాశయాలన్నింటిలో చేరుతున్నదనీ చాలా పెద్ద ప్రమాదం పొంచి వున్నదనీ వార్తలు వస్తోంటే కుటుంబం మొత్తం బెంబేలెత్తిపోయాం.

మా ఇంటి వరండా వరకూ నీరు వచ్చేసినా మరీ ప్రమాదకరమైన ప్రాంతం కాదని మాకెలాంటి సహాయ సహకారాలూ లభ్యం కాకపోయాయి. ఎందుకైనా మంచిదని రెండు రోడ్లకవతల మెరకలో మరింత సురక్షితంగా వున్న బంధువుల ఇల్లు చేరుకోవాలని భావించాం.

వీధులలో మనిషిలోతు నీరు. ఎక్కడ ఏ గొయ్యిలోనికి లాక్కుంటుందో తెలీని అయోమయ స్థితి. మనుషులను అటువైపు చేర్చడానికైతే నాటుపడవలతో మనుషులు వచ్చారు కానీ... ఆ కాస్త దూరానికి మా కుటుంబానికి ముప్ఫైవేల రూపాయలు అడిగారు.

అంత డబ్బు ఆ సమయానికి అందుబాటులో లేక ఆ ప్రయత్నం విరమించుకున్నాం. మానుకోవడమే మంచిదయింది. ఎందుకంటే... తాళం వెయ్యబడ్డ ఇండ్లన్నీ రేయీ, పగలు అనే తేడాలేకుండా దొంగతనాలకు గురవుతున్నాయి.

ఆ స్థితిలో మంచినీటి జార్ ఐదువందల రూపాయలు పెట్టి కొనుక్కోవాల్సి వచ్చింది! కూరగాయలకు సైతం వందలాది రూపాయలు!! వరద తగ్గాక కూడా కిలోబియ్యం వందరూపాయల చొప్పున అమ్మబడుతోందని తెలిసి నిర్ఘాంతపోవడం మినహా చెయ్యగలిగిందేమీ లేకపోయింది.

విపత్కర పరిస్థితులలో సైతం మనిషిని సాటిమనిషే తన స్థాయిలో తను దోపిడి చెయ్యడానికి వెనుకాడడం లేదు. అందుకే ఆకలి, పేదరికం ఎప్పటికీ అంతం కాకుండా పోతున్నాయి అని అన్పించింది.

ఎట్టకేలకు పరిస్థితి కాస్త కుదుటపడ్డది.

"ఒకప్పుడైతే 'కాశీకి వెళ్ళినవాడూ, కాటికి వెళ్ళినవాడూ ఒక్కటే' అనేవారు. మరి ఇప్పుడైతే కాశీకే వెళ్ళనక్కరలేదు! మనం ఇల్లు కదిలి ఎక్కడికి వెళ్ళినా తిరిగి రాగలమా? అన్న అనుమానం కలుగుతోంది!" అన్నాను.

"అదేమిటి?" అంటూ ఆశ్చర్యపోయింది నా శ్రీమతి.

"రోడ్డు ప్రమాదాలు, రైలు ప్రమాదాలు, వాహనాలలో బాంబులు పేలడాలు, అగ్నిప్రమాదాలు, వాహనాలనే హైజాక్ చెయ్యడాలు, తగులబెట్టడాలు... రగులుతున్న అగ్నిగుండంలా వున్న ఈ దేశంలో ఎటువైపు ఎక్కడికి వెళ్ళినా మృత్యుదర్శనమే కద?" అన్నాను.

"అయితే తీర్థయాత్ర వద్దంటారా?"

"వద్దనను.. కానీ... ప్రస్తుతానికి తీర్థయాత్ర సంగతలా ఉంచుదాం. నరహరి వాళ్ళ వూరువెళ్ళివద్దాం. ఆవైపు వరదలులేవు... ప్రమాదాలంతకన్నా రావు... అడపాదడపా కన్పించే పాముల భయం తప్ప మరే భయమూ లేని పరమ ప్రశాంతమైన ప్రాంతం అది!" అన్నాను.

నేను నరహరివాళ్ళవూరు వెళ్ళిన ప్రతిసారీ నా కుటుంబీకులందర్నీ నాతో రమ్మని కోరుతూనే ఉన్నాను. కానీ యేనాడూ వారెవరూ అంగీకరించిన పాపాన పోలేదు. అలాంటిది ఆశ్చర్యకరంగా నాభార్య బట్టలవీ సర్దుకుని బయల్దేరింది. ఇద్దరం కలసి అన్ని వాహన ప్రయాణాలనూ వరుసగా కానిచ్చి చివరన కాలినడకన ఆ గ్రామసీమను చేరుకున్నాం.

మమ్మల్ని ఆనందంగా, ఆదరంగా ఆహ్వానించారు నరహరి కుటుంబీకులు.

* * *

ప్రస్తుతం నరహరి వాళ్ళవూరికి కరంటు సౌకర్యం ఉంది. చాల ఇళ్లలో టీ.వీలున్నాయి. అయితే పగలెక్కడా, ఎవరూ సామాన్యంగా టీ.వీ. చూడరు... ఎక్కడైనా రాత్రిపూటే! అదీ వాళ్ళ పని సంస్కృతి!!

కొన్ని ఇండ్లకు ల్యాండుఫోను సౌకర్యం కూడా ఉంది. ఎటొచ్చీ ఏ కంపెనీ సెల్‌ఫోనూ అక్కడ పనిచెయ్యదు. ఆ నెట్‌వర్క్ ఇంకా ఆ అడవులను దాటి అంతదూరంవరకూ విస్తరించలేదు.

ఈ మార్పులు తప్పితే ఆ వూర్లోకానీ, మనుష్యుల మనస్తత్వాలలోకానీ, బంధాలలోకానీ ఏ రకమైన మార్పులూ, చేర్పులూ లేవు.

"చాలా తగ్గిపోయింది!" అంటాడు నరహరి. కానీ నాకు మాత్రం పాముల సంచారంలో ఎలాంటి తగ్గుదలా ఉన్నట్లనిపించలేదు.

ఏనాడూ పల్లెటూర్లు, గ్రామాలూ చూసి ఎరుగని మనిషి నా శ్రీమతి. అయితే ఎంతో సంతోషంగా నరహరి కుటుంబ సభ్యులతో స్వంత మనిషిలా కలసిపోయి అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ప్రశాంతంగా గడిపివేసింది పదిరోజులపాటు! పాములయితే ఆమెకూ కన్పించాయి కానీ... ఆ విషయంలో ఎలాంటి భయాందోళనలకూ గురికాలేదు తను.

ఆ ప్రాంత వాతావరణంలోనే మనుషుల్ని ఆకర్షించి ఆకట్టుకుని ఆహ్లాదపరుస్తూ ఆనందింపచేసే గమ్మత్తయిన గుణం ఏదో వుంది. అక్కడి మనుషులు సైతం ఏ ఒత్తిడీ లేని ప్రశాంతతతో కూడిన తేజస్సులతో, ముఖాలలో చెరగని మందహాసాలతో ఆశానిరాశలు లేని యోగజీవుల్లా కన్పించి ఆకట్టుకుంటారు.

అందువల్లే అక్కడ ఆనందంగా గడిపివెయ్యగలిగింది నా శ్రీమతి.

ఓనాడు నేనూ నా శ్రీమతీ కలసి షికారుగా చెరువు కట్ట మీదికి వెళ్ళాం.

ఓ చోట, పొదల మధ్యన పెనవేసుకున్న పొడవాటి సర్పాల జంట కన్పించింది మాకు. వాటి సరాగాలు చూస్తుంటే భయాశ్చర్యాలు కలిగాయి.

పరుగులాంటి నడకతో అక్కడ్నుండీ దూరంగా వెళ్ళిపోయి ఇంటిముఖం పట్టాం.

"ఈ పాములను చూస్తూంటే భయం వెయ్యడం లేదా సుగాత్రీ?" అని ప్రశ్నించాను దార్లో.

"ఇంతకాలం మనం మనకు తెలియకుండానే కొన్ని మానవ సర్పాలతో కలిసి కాలం గడిపామని అన్పిస్తోంది! ఈ నోరులేని జీవాలేం చేస్తాయి మనల్ని? అయినా శివుడాజ్ఞ లేనిదే చీమయినా కుట్టదు కదా?" అంది నా శ్రీమతి నవ్వుతూ.

"మానవ సర్పాలా? అదెవరు?" అన్నాను ఆశ్చర్యంగా.

"మీరు రిటైరయ్యాక రంగులు మార్చిన వాళ్ళు సర్పాలు కారా? మన ముందు హుందాగా, ఆత్మీయంగా ప్రవర్తించి మన వెనుక మరోలా... కొద్దో గొప్పో అమర్యాదకరంగా ప్రవర్తించినవారు సర్పాలు కారా? రెండుమూడు పర్లాంగుల దూరానికి నీళ్ళలో ముప్పయి వేలడిగిన మనుషులు సర్పాలు కారా? నీళ్ళ క్యాన్ అందించి ఐదువందలు పుచ్చుకున్న అపర భగీరథుడు సర్పం కాదా? చిట్టచివరికి డజను అరటిపండ్లు అందించి మూడువందలా అరవయి రూపాయలు తీసుకున్న మహానుభావుడు...? అంతెందుకు, వరద తగ్గిపోయాక డాక్టరు వద్దకు వెళ్ళి ఇంజక్షన్ చేయించుకుని తిరిగి రావడానికి ఆరొందలు పుచ్చుకున్న ఆటోవాలా...?" అంటూ ఊపిరి తీసుకోవడానికి కాస్త ఆగింది నా శ్రీమతి.

నేను అవాక్కయిపోయాను. గాలివాటానికి తూర్పెత్తుకునే వారిలా ప్రాణాలకు తెగించి నీళ్ళలో నీళ్ళ క్యాన్ మోసుకొచ్చిన వ్యక్తీ, పళ్ళూ, కూరగాయలూ పట్టుకు వచ్చినవాళ్ళూ ఎక్కువ మొత్తాలు పుచ్చుకోవడంలో నాకయితే లోపం కన్పించలేదు పెద్దగా.

"మంచి మనుష్యుల మధ్యన అక్కడక్కడ పాముల్లాంటి మనుషులున్నట్లే బంగారు లోకంలాంటి ఈ ప్రాంతంలోనూ అక్కడక్కడ పాములు కన్పిస్తున్నాయి. అంతమాత్రాన ఇది కాస్తా పాముల రాజ్యం అయిపోదు. మనం జాగ్రత్తగా సంచరిస్తే ఈ పాములవల్ల ఎలాంటి అపకారమూ జరగదు!" అంది సుగాత్రి మళ్ళీ తనే.

"సరే, నీకీ ప్రాంతం ఇంతగా నచ్చడానికి కారణం ఏమిటి?" అన్నాను ఆశ్చర్యం నుండి తేరుకుంటూ.

"తాము తినేదే తిండి" అని అనుకుంటున్నారండీ ఆధునిక మానవులలో ఎక్కువమంది! అలాంటివారిలో సంతృప్తి అనేది మృగ్యమవుతుండడం మనకు మన పట్టణాలలో అక్కడక్కడ తరచు దృశ్యమానమవుతూనే ఉంటుంది కద?! ఇక్కడయితే మనుషులలో మానవత్వం జీవించి వున్నందున 'పదిమంది తినేదే తిండి' అని భావిస్తున్నట్లు కన్పిస్తున్నారు. పైగా ఇక్కడి మనుషులలో కన్పిస్తున్న మనిషితనం నాకు బాగా నచ్చింది!" అంది సుగాత్రి మనస్ఫూర్తిగా.

తిరుగుప్రయాణానికి ముందురోజు ఓ మాటంది నా శ్రీమతి.

"నిజానికి నాకీవూరును, ఇక్కడి మనుష్యులను చూస్తుంటే ఇక్కడ్నుండీ వెళ్ళాలనిపించడం లేదండీ!"

మరోమారు అవాక్కయిపోయాను ఆశ్చర్యంతో! వచ్చిన ప్రతి పర్యాయమూ అక్కడ నా పరిస్థితీ అదే కద?!

అక్కడ జీవిస్తున్న వారిలో చాలామందికి... వారికిగానీ, వారి జీవితాలకుగానీ ఎలాంటి ఆర్థికభద్రతలు, ఆహారభద్రతలు, ఆరోగ్యభద్రతలు లేవు నిజానికి! అయితే వారందరూ ఎంతో నిశ్చింతగా, నిబ్బరంగా జీవితాలను వెళ్ళబుచ్చేస్తున్నారు. అదే ఆ ప్రాంతపు గొప్పదనం. అందువల్లే అక్కడి మనుష్యులమధ్యన సజీవనమైన మానవ సంబంధాలు సజావుగా కన్పిస్తాయి. నిలచి ఉంటాయి!

నిజానికి నాకా సమయంలో నా భార్య చాలా క్రొత్తగా, గొప్పగా అద్భుతంగా కన్పించింది.

కానీ అదెలా సాధ్యమౌతుంది?

మరునాడు తిరుగు ప్రయాణమయ్యాం!

ఎనిమిదిమైళ్ళు మాకు తోడుగా మాతోపాటు నడచివచ్చిన నరహరి మమ్మల్ని బల్లకట్టు ఎక్కించి శెలవు తీసుకున్నాడు.

బల్లకట్టు నడికాలువలో వుండగా, దూరమైపోతున్న కాలిదారిని చూస్తూ అంది నా శ్రీమతి...

"ఆ దారితో మన బంధం గొప్పగా కొనసాగాలంటే ఓ మార్గం కన్పిస్తోందండీ!"

"ఏమిటది?" అన్నాను ఆసక్తిగా.

"నరహరి చిన్నకుమార్తెను మన చిన్నోడికి చేసుకుంటే సరి... వాడి జీవితానికీ ప్రశాంతత ఉంటుంది. మన కుటుంబంలో కూడా సాంకేతిక వాతావరణం ఏర్పడకుండా కొంతమేరయినా కాపాడబడ్తుంది!" అంది సుగాత్రి.

నా హృదయం ఆనందంతో తాండవనృత్యం చేసింది. అంతమంచి ఆలోచన నా మట్టిబుర్రకు ఎందుకు తట్టలేదో? ఒక రకంగా తెలివి తక్కువ వాడిని నేను నిజానికి.

"మన కులమే కాబట్టి సమస్యలేదు. గోత్రం, శాఖలు కూడా సరిపోతాయి... అయినా ఈ వనకన్యను వరించేటందుకు మన సాంకేతిక నిపుణుడు అంగీకరిస్తాడంటవా?" అన్నాను సంశయంగా.

"వాడు మన మాటను మన్నిస్తాడనే నమ్మకం నాకుంది. కాబట్టి ఒప్పించడానికి ప్రయత్నిస్తాను" అన్న నా శ్రీమతి స్వరంలో విశ్వాసం ధ్వనించింది. ✪

*(జాగృతి వార పత్రిక, 27 డిసెంబర్ 2010)*

# మీరే చెప్పండి

పదవీ విరమణ పదిహేను రోజుల్లోకి వచ్చేసింది. ప్రశాంతంగా పదవిలోంచి దిగిపోయి రామా, కృష్ణా, గోవిందా అని అనుకుంటూ కూర్చోవచ్చని అనుకుంటుండగా... రాజధానిలో తప్పనిసరి కాన్ఫరెన్స్... రైలెక్కక తప్పలేదు.

నా మనసులోని భావాన్ని చదివాడేమో దేవుడు? ఒక రోజంతా జరుగుతుందనుకున్న కాన్ఫరెన్స్ నాలుగైదు గంటల్లోనే చక్కగా ముగిసిపోయింది! రిటైరయ్యాక ఉరుకులు పరుగులు లేని నా ప్రశాంత జీవితానికి ఇది తొలి సంకేతం కాబోలు అన్పించింది నాకు. అందువల్ల ఆనంద పడిపోయాను.

వెనక్కి వెళ్ళడానికి కూడా రిజర్వేషనయితే ఉంది కానీ, రైలుబండయితే రాత్రి పదింటికి.

గెస్ట్ హవుస్‌కు వెళ్ళి మరోమారు స్నానం కానిచ్చాను. అటెండర్ పట్టుకు వచ్చిన లంచ్ తీసుకున్నాక ఏం చెయ్యాలా అని అనుకుంటుంటే ఆనంద్ గుర్తుకొచ్చాడు. వాడు నా మిత్రుడు సుబ్బరామయ్య కొడుకు.

వాస్తవానికయితే ఆనంద్ అంటే నాకు అయిష్టం ఈ మధ్యన. అందుకే పలు పర్యాయాలు హైదరాబాద్‌కు వచ్చినా వాడిని మాత్రం ఒక్కసారయినా కలవలేదు.

అయినా వాడికి మాత్రం నా మీద అభిమానమే!

"ఒక్కసారయినా మా ఇంటికి రాలేదు?" అని నిష్ఠూరమాడ్తుంటాడు మా వూర్లో మా ఇంటికి వచ్చినప్పుడల్లా.

ఆ మధ్యన సుబ్బరామయ్య కూడా అన్నాడు "ఒరేయ్ నీవు రిటైరైపోయాక రాజధానికి వెళ్ళవు కదా! ఓసారి మా వాడి ఇంటికి వెళ్ళి రారాదూ!" అని.

అదంతా మననానికి వచ్చాక ఎటూ సమయం ఉంది కాబట్టి ఆనంద్ ఇంటికి వెళ్ళిరావాలనే నిశ్చయానికి వచ్చాను.

అదృష్టవశాత్తు నా సెల్‌లో వాడి నెంబరు ఫీడయి ఉంది. అందువల్ల ఆలస్యం చెయ్యకుండా వాడిని కాంటాక్ట్ చేశాను.

నా గొంతు వినగానే ఫోన్‌లోనే సంబరపడిపోయాడు వాడు.

"అంకుల్ మీరున్న గెస్ట్‌హౌస్ నుండీ కేవలం రెండున్నర కిలోమీటర్ల దూరంలోనే ఉంది మా ఇల్లు. ఏ ఆటోవాలా అయినా ట్రాఫిక్ పెద్దగా లేకపోతే పది నిముషాలలో, డిస్ట్రబెన్సు ఎక్కువగా ఉంటే పదిహేను లేదా ఇరవయి నిముషాలలో మా అపార్టుమెంట్స్ ముందు దించుతాడు. వచ్చెయ్యండి. నాకూ ఈవాళ కంపెనీలో పెద్దగా పనిలేదు. నాలుగు గంటలకంతా బయల్దేరి ఇంటికి వచ్చేస్తాను" అన్నాడు ఉత్సాహంగా.

వాడ్నడిగి వివరంగా చిరునామా, గుర్తులూ కనుక్కున్నాను.

వాడన్నట్లే అరగంటలోపే వాడి అపార్టుమెంటుకు చేరుకోగలిగాను. వాడి భార్య శిల్ప నన్ను ఆదరంగా ఆహ్వానించింది.

మేం టీ త్రాగి ఆ మాటా, ఈ మాటా మాట్లాడుకుంటూ ఉండగానే ఇంటికి వచ్చేశాడు ఆనంద్. అల్పాహారాలూ, అవీ అయ్యాక...

"ఎందుకంకుల్ మీరు మా ఇంటికి రావడానికే ఇష్టపడరు! నామీద కొంపదీసి కోపం లేదు కదా!" అని ప్రశ్నించాడు వాడు.

"ఒకింత కోపమేరా!" అని అనేశాను. ఆ నిముషంలో హిపోక్రసీ లేకుండా.

"ఎందుకంకుల్?!" అన్నాడు వాడు ఆశ్చర్యంగా. శిల్పకూడా కుతూహలంగా చూసింది నాకేసి.

"ఏమిట్రా నువ్వు చేసిన పని? సుబ్బరంగా నెలకు రెండు లక్షలందించే ఉద్యోగం చేస్తూ లండన్‌లో ఉండిపోక ఢిల్లీకి వచ్చేశావు. అక్కడయినా లక్ష రూపాయలు లభిస్తుండిన కంపెనీ వదిలేసి ఇక్కడికి కొచ్చేసి నలభైవేల రూపాయలకు పనిచెయ్యడమేమిటి? మీ నాయన ఒంటి ముక్కుతో ఏడ్చేస్తున్నాడు మా అందరి దగ్గరా. అందుకే అందరితోపాటూ నాకూ నీమీద కాస్త కోపం!" అంటూ నా మనసులోని దుగ్ధను వెళ్లగ్రక్కాను.

అంతావిని వాడు అందంగా నవ్వేసి ఊరుకున్నాడు. శిల్ప కూడా మందంగా మందహాసం చేసి మౌనం వహించింది.

కానీ నేనూరుకోను కదా! రెట్టించాను.

"నిజమే అంకుల్... అక్కడ నెలకు రెండు లక్షలు వచ్చేవి. స్కూలయ్యాక పిల్లల్ని సంభాళించే కేర్‌టేక్ హౌస్‌తో ఒప్పందం కుదుర్చుకుని మేం తిరిగివచ్చేదాకా పిల్లల్ని

చూసుకునే ఏర్పాటు చేసుకోగలిగి వుంటే నా భార్య కూడా ఉద్యోగం చేసి నెలకు నలభై, ఏభయి వేలు సంపాదించగలిగి ఉండేదక్కడ. కానీ...” అంటూ ఆగాడు వాడు.

“మరి అంత డబ్బు అప్పనంగా వచ్చిపడేటప్పుడు కానీ, అర్థేమిటి?” నేను కాస్త కోపంగానే అన్నాను.

“మా నాన్నగారి సంగతి వదిలెయ్యండి... ఇంతగా ఆలోచించగలిగే మీకయినా ‘దూరపు కొండలు నునుపు’ అన్న సామెత జ్ఞాపకం రాలేదా?” అన్నాడు ఆనంద్ నవ్వుతూనే...

ఆశ్చర్యంతో అవాక్కయిపోయాను నేను ఆ నిముషంలో మాత్రం!

“ఒకప్పటి సంగతి వదిలేసి ఆలోచిస్తే ప్రస్తుత పరిస్థితులలో చాలామంది ఆ సామెతను విశ్వసించక తప్పదేమో?” అన్నాడు ఆనంద్ రెండు నిముషాల తరువాత... ఉపోద్ఘాతంగా.

“అక్కడ అపార్ట్‌మెంట్ రెంట్ తక్కువంటే ఏభయివేలంకుల్. ఫర్నీచర్, కుకింగ్ సామగ్రి వాళ్ళే ఏర్పాటుచేసి ఉంటారన్నది మాత్రం వాస్తవం. ఐటమ్స్, సరుకులు వగైరా నెలకు పదిహేనువేల నుండీ పాతికవేల వరకూ కాగలవు. వాడకాన్ని బట్టి కరంటు బిల్లు వేసవిలో అయితే పదిహేనువేల నుండి ఇరవయివేల వరకూ, చలికాలంలో పాతికవేల నుండీ ముప్పయివేల వరకూ అవుతుంది. చిన్న జబ్బు చేసినా వైద్యఖర్చులు పదివేల పైమాటే! వారానికోసారి భార్యాపిల్లలతో అలా వెళ్ళి వచ్చినా చాలు పదివేల నుండీ ఇరవయి వేల వరకూ రావచ్చు ఖర్చు. ఇహ పెట్రోలు ఖర్చు, ఇతర ఖర్చులూ సరేసరి... ఒక విశేషమేమిటంటే జీతం చేతికందేటప్పుడే అందులో టాక్స్ మినహాయింపు జరిగిపోయి మిగిలిందే చేతికొస్తుంది. వాస్తవానికి నెలకూ లక్షా ఏభయివేల నుండి లక్షా డెబ్బయి అయిదు వేల వరకూ సునాయాసంగా ఖర్చయిపోతుందంటే బహుశా మీరు నమ్మక పోవచ్చు” అంటూ ఆగాడు వాడు.

వాడు చెప్తున్న విషయాలు నిజంగా కొత్త వాస్తవాలను తెలియచేస్తున్నందువల్ల ఆశ్చర్యంతో, ఆలోచనతో మౌనం వహించాను. నేను మాట్లాడకపోవడంవల్ల ఆనందే కొనసాగించాడు మళ్లీ...

“ఇంకో విషయం యేమిటంటే అక్కడి ఉద్యోగంలో విరామం అయితే ఉండీ ఉండనట్లుంటుంది. మనిషికీ యంత్రానికీ తేడా లేదేమో అని అన్పిస్తుంది ఒక్కోసారి.

అందుకే అక్కడ నేను నా భార్యచేత ఉద్యోగం చేయించడానికి ఇష్టపడలేక పోయాను. బహుశా అది నా మానసిక బలహీనత కూడా అయివుండవచ్చు.

ఇద్దరం కలిసి ఉద్యోగం చేస్తూ అక్కడి పౌరసత్వం తీసుకుని ఉండివుంటే టాక్స్ తగ్గి ఆదాయం ఇక్కడ మీరనుకునే దాని కన్నా ఎక్కువగానే ఉంటుందన్నది మాత్రం వాస్తవం. అయినా... అక్కడ మేం సుఖపడేదెంత? పిల్లలను తీర్చిదిద్దడంలో మా పాత్ర ఎంతవరకూ ఉండగలదు? అత్యవసరంగా ఇక్కడికి ఒక పర్యాయం వచ్చి వెళ్ళాలంటే కావల్సిన ఖర్చులు ఎంత? ఇవన్నీ నన్ను అక్కడ తరచూ కలవరపరిచిన ప్రశ్నలు. అందుకే ఢిల్లీకి వచ్చేశాను. అక్కడ సైతం ఆదాయవ్యయాలు చూసుకుంటే నాకయితే సంతృప్తి కలగలేదు. అందుకే అక్కడ్నుంచీ ఇక్కడికి వచ్చేశాను. ప్రస్తుతం నలభైవేలే లభిస్తున్నా ఒకటి రెండేళ్ళల్లో మంచి జీతం లభ్యమయ్యే అవకాశాలున్నాయి" అంటూ ఆగాడు ఆనంద్.

ఆనంద్ చెప్పిందంతా విన్న తరువాత వాడి ఆలోచన సబబే అని అన్పించింది. అయినా...

ఇక్కడ ఈ జీతాలతో నీవు బావుకునేదేమిట్రా?" అన్నాను.

"అంకుల్ ... ఈ అపార్టుమెంటు రెంటు ఆరువేలే. కరెంటు, వాటరు, మెయిన్‌టెనెన్స్ వెయ్యి. నా పెట్రోలు ఖర్చు మా ఇంటికి ఖర్చు పదమూడువేలు, ఇతర ఖర్చులు ఐదువేలయినా నెలనెలా పదిహేను వేలు మిగులుతోంది. ప్రయివేటు ప్రాజెక్టు వర్క్సు చేసుకోను వ్యవధి ఉండడం వల్ల నెలనెలా మరో పది, పదిహేను వేలు సంపాదిస్తున్నాను. పిల్లలు వచ్చే సమయానికి శిల్ప ఇంటికి చేరుకోగలిగే ఉద్యోగం కోసం తనూ సెర్చ్ చేస్తోంది. ఆమెకు ఏదయినా అలాంటి జాబ్ దొరికితే మేం విదేశాలలో ఉండి సంపాదిస్తున్నట్లే లెక్క. అన్నింటి కన్నా ముఖ్యమైనది అయిన వాళ్ళకు, ఆత్మీయులకు, ఆప్తులకు దగ్గరుండడంలోని ఆనందాన్ని అనుభవించ గలుగుతున్నాం కదా!"

నిజమే అన్పించింది వాడు చెప్పింది విన్న తరువాత.

పిల్లలు కాన్వెంటు నుండీ వచ్చాక ఆనంద్ ఆనందం చూసి నేనెంతో సంతోష పడిపోయాను.

"నాయనా, అప్పా!" అంటూ పిల్లలు వాడిమీదపడి వాడి పైకెక్కి తొక్కుతూ ఉంటే వాడి మొహంలో కన్పించిన ఆనందానికి ఏ ఆర్థిక నిపుణుడు వెలకట్టగలడు?!

పిల్లలు ముఖాలు కడుక్కుని డైనింగ్ హాల్లో ఏదో కాస్త తిని వచ్చాక శిల్ప వారిని తన దగ్గర పొందికగా కూర్చోబెట్టుకుని హోంవర్కు చేయించడం మొదలుపెట్టింది.

ఆ దృశ్యం చూస్తుంటే నా చిన్నతనంలో మేం హరికెన్ దీపాలు పట్టుకుని వెంకట్రాయలు అయ్యవారి వద్దకు ట్యూషన్‌కు వెళ్ళి వస్తుండిన నాటి రోజులు కళ్ళముందు కదలసాగాయి.

"దాదాపు నాలుగేళ్ళున్నాను కదా అంకుల్ లండన్‌లో! నిజం చెప్పాలంటే నేను పెద్దగా బావుకున్నదీ లేదు. నా తల్లి దండ్రులకు గొప్పగా పెట్టి పోషించిందీ లేదు. కానయితే మావాడు లండన్‌లో ఉన్నాడు నెలకు రెండు లక్షలు జీతం అని వాళ్ళు గొప్పగా చెప్పుకో గలిగేవారు. అలా గొప్పగా చెప్పుకోలేకపోతున్నదే ప్రస్తుతం వారి బాధ.

నిజానికి ప్రస్తుత పరిస్థితులలో విదేశాలలో జీవించడమే ఒక రిస్క్‌గా తయారయి పోతున్నది. ఈ దశలో బిక్కుబిక్కుమంటూ అక్కడుండడం మేలా? దొరికిన దానితో సంతృప్తి చెంది స్వదేశంలో అయిన వాళ్ళందరికీ చేరువగా ఇక్కడుండడం మేలా? మీరే చెప్పండి?!" అన్నాడు ఆనంద్.

ఆనంద్ సంధించిన ప్రశ్న సామాన్యమైనది కాదు నిజానికి. పరపౌరసత్వం తీసుకోకుండా, తీసుకోలేకా పరాయిదేశాలలో జీవిస్తున్న ప్రతి మనిషీ ఆలోచించవలసిన విషయానికి సంబంధించిన ప్రశ్న అది.

నిజానికి కష్టపడే మనస్తత్వం ఉన్నవాడికి మాతృభూమిలోనే ఎక్కడో ఒకచోట పని ఉండి తీర్తుందేమో?

రాత్రి భోజనలయ్యాక వాడి మోటారు సైకిలు మీదే పదినిముషాలలో నన్ను గెస్ట్‌హౌస్‌కు తీసుకువెళ్ళాడు వాడు. బేగు సర్దుకున్నాక మరో పదిహేను నిముషాలలో రైల్వే స్టేషన్‌కు చేర్చి రైలెక్కించాడు.

"అంకుల్... మా నాన్నకు మీరే చెప్పండి. ఇక్కడ జీవించడంలో నేనెక్కువ ఆనందాన్ని అనుభవించ గలుగుతున్నాననీ, నా భార్య పిల్లలు సుఖంగా సంతోషంగా గడుపుతున్నారనీ! ముఖ్యంగా వారికి చాలా చేరువలో ఉన్నాననీ!!" అన్నాడు వాడు రైలు కదుల్తున్నప్పుడు.

వాడ్ని చూస్తుంటే ముచ్చటేసింది. ✪

***(ఆంధ్రభూమి దినపత్రిక, మే 14, 2011)***

# తడి ఆరని గుండె ప్రశ్న!

**రా**త్రి పన్నెండు గంటలు...

టీవీ ఆఫ్ చేసి రిలాక్సుడుగా బెడ్‌రూంలోకి వెళ్ళబోతున్నాడు విజయవర్మ.

ఫోను మ్రోగింది.

శబ్దాన్ని బట్టి లోకల్ కాల్ అని గ్రహించినా తను వెంటనే తీయకపోతే ఇంటిల్లిపాదికీ నిద్రా భంగం అవుతుందనుకుంటూ చకచకా వెళ్ళి రిసీవర్ తీశాడు.

"సార్... ఇప్పుడే మెసేజ్ వచ్చింది..." అన్నాడు రామస్వామి అవతలి నుండి.

"చెప్పండి!"

"బెంగుళూరు రోడ్డు మీద అంకిపాడు మిట్టకు ఇవతల... మన డివిజనే... ఓ మనిషిని ఏదో పెద్దబండే కొట్టేసి వెళ్ళిపోయిందట. వెనుక వెనకే రెండు మూడు బండ్లు తొక్కేసినట్లున్నాయనీ ఆలస్యం అయితే ఇంకా చాలా రప్చర్ అయిపోయే ప్రమాదం ఉందనీ చెప్పారు సార్!"

"సరే మీరు జీపు తీసుకుని వెంటనే బయల్దేరండి... నేను బైక్ మీద నేరుగా అక్కడికే వచ్చేస్తున్నాను!" అని చెప్పి ఫోను పెట్టేశాడు వర్మ.

అతడు మిలటరీ సర్వీసు నుండి రిటైర్ అయి సివిల్ సర్వీసులోకి వచ్చిన వాడు. చకచకా తయారయి బైక్ ఎక్కాడు.

అతని స్ప్లెండర్ బైక్ హైవే మీద జీపు ముందు ఆగే సమయానికి గుర్తు పట్టడానికి ఏ మాత్రం ఆస్కారం లేకుండా నలిగిపోయిన శవంచుట్టూ జీపు హెడ్‌లైట్ల వెలుగులో రాళ్ళు పెట్టి, ఆ రాళ్ళ మీద ఎత్తుగా చిన్న చిన్న రాళ్ళు పెడ్తున్న పోలీసులు అరనిముషం పాటు తమ పనిని ఆపి వర్మకు టకటకా సెల్యూట్‌లు కొట్టి మళ్ళీ తమపనిలో మునిగిపోయారు.

వాయు వేగంతో అటూ ఇటూ పరుగులు తీస్తూ దూసుకుపోతున్న వాహనాలు ఆ ప్రదేశానికి వచ్చేసరికి కొద్దిగా వేగం తగ్గించుకుని ఆ వెంటనే మళ్ళీ వేగం పెంచుకుంటూ వెళ్ళిపోతున్నాయి.

దగ్గరి దాపులలో ఎలాంటి నివాసాలూ లేవు! అన్నీ పొలాలే!! అతన్ని ఢీకొట్టి చంపిన వాహనం ఎంత దూరం ముందుకెళ్ళి పోయుంటుందో చెప్పడం కష్టం. అసలది దొరుకుతుందా అన్నదీ అనుమానమే!

'ఎక్కడ పుట్టాడో ఎక్కడ పెరిగాడో?... ఇక్కడ ఈ నడిరోడ్డు మీద అనామకంగా దిక్కులేని చావు చచ్చాడు!' అనుకుంటూ నలిగిపోయిన శవాన్ని చూస్తూ నిట్టూర్చాడు వర్మ.

'నాగరికతకు సూచికలయిన రాజ మార్గాలు ఇటీవలి కాలంలో అతి తరచుగా ఇలా అతి అనాగరికమైన సంఘటనలకు బహిరంగ వేదికలయి పోతున్నాయి! వేగం... వేగం... ప్రపంచమంతా వేగం... నిష్కారణంగా సాటి మనిషిని చంపేసి ఏ సంకోచమూ లేకుండా నిశ్చింతగా ముందుకు దూసుకుపోగలిగిన వేగం! ఈ వేగం ప్రపంచాన్ని చివరకు ఎక్కడకు తీసుకుపోతుందో మరి?' అని కూడా అనుకున్నాడు వర్మ మనసులో.

"మనిషి ఆనవాలు చిక్కడం కష్టమేసార్! జేబులు కూడా ఖాళీగా ఉన్నాయి. దగ్గరి దాపుల్లో ఎక్కడా, ఎవరూ లేరు కాబట్టి తెల్లవారితే తప్ప ఆచూకీ చెప్పేవారు దొరకక పోవచ్చు!" అన్నాడు ఎ.ఎస్.ఐ. రామస్వామి.

వర్మ మౌనంగా తలపంకించి శవానికి మరికాస్త దగ్గరికి నడిచాడు. కడుపూ, తొడలూ పూర్తిగా నలిగిపోయి పేగులు చెదిరిపోయాయి. తలకూడ బ్రద్దలవడం వల్ల మెదడుకూడా బయటపడింది.

పరమ భయానకంగా ఉందా దృశ్యం.

"సార్, వాచ్ పదీ పదికి నిలచిపోయింది. కాబట్టి అప్పుడే ఆక్సిడెంటు జరిగి ఉండాలి!" అన్నాడు రామస్వామి పెద్ద టార్చి వెలుగు మృతుడి ఎడం చేతిమీదకు ఫోకస్ జేస్తూ.

సుడి తిరిగిపోయిన చేతిమీద వాచి ఆగిపోయి ఉండడం కన్పిస్తోంది. ఒక కాలికి చెప్పు ఉంది. రెండవ కాలి చెప్పు ఊడిపోయి కొద్ది దూరంలో ప్రక్కన పడి ఉంది. సరికొత్త బాటా చెప్పులు!

ఇంతలో అవతలి వైపు నుండీ ట్రాఫిక్ జీపు వచ్చి ఆగింది. "దగ్గరి దాపుల్లో అటూ ఇటూ ఎక్కడా స్కూటరు గానీ మోటరు సైకిలుకానీ, కారు కానీ... ఏదీ నిలచిపోయి లేదు. ఇతను ఇక్కడే ఎక్కడ్నుండీనో నడచి వస్తుండాలి! ఎందుకొచ్చాడో ఏమో?" అన్నాడు జీపు దిగిన ట్రాఫిక్ ఎస్.ఐ. శ్రీరాములు.

"అది తెలుసుకోవాల్సింది మనం! అన్నట్లు మెసేజ్ పంపారా?"

"హైవే కనెక్టెడ్ స్టేషన్లన్నింటికీ వైర్లెస్ మెసేజ్ వెళ్ళిపోయింది!

"ఎక్కడ్నుండీ అయినా రిప్లయి?"

"నిల్!" అన్నాడు నిరుత్సాహంగా శ్రీరాములు.

* * *

మధ్యాహ్నం పన్నెండు గంటలు...

గత రాత్రి హైవేమీద నలిగిపోయిన వ్యక్తి తాలూకు ఎడం చేతి నుండీ పోస్టుమార్టం జరిగినప్పుడు కత్తిరించబడి, కెమికల్స్‌తో శుభ్రంచేయబడిన చేతి వ్రేళ్ళను ఇంక్ ప్యాడ్ మీద ఒత్తి వాటితో రికార్డు పేపర్ల మీద వరుసగా వేలిముద్రలను వేస్తున్నారు, రామస్వామీ సార్జంట్ శంకర్ కలిసి.

"ఈ చేతి గుర్తులు గాక మృతుని వివరాలు తెలుసుకోగలిగిన ఆధారాలు మన దగ్గర ఇంకేమున్నాయి?" అన్నాడు శ్రీరాములు.

"దుస్తులు, వాచి, చెప్పులు ఉన్నాయి కదా? రామస్వామీ... బట్టలు...?" అంటూ ప్రశ్నించాడు వర్మ.

"బ్లడ్ రిపోర్ట్సుతో పాటు పిన్ చేసుకోవడానికి మెడికల్ ఆఫీసుకు చిన్న కటింగ్ తీసుకున్నారు సార్! తరవాత ప్యాంటు, బ్యాగు, అండర్ వేర్, బనీను, హ్యాండ్ ఖర్చీప్ మొలత్రాడుతో సహా కెమికల్ స్ప్రేకు ఇచ్చాను సార్... రేపు ఉదయానికి వచ్చేస్తాయి." అన్నాడు రామస్వామి తన పని తాను కానిస్తూనే.

"గుడ్... అన్నట్లు చాకలి గుర్తు లేమయినా?"

"అలాంటివేమీ లేవుసార్... బాగా చూశాను!"

"ఇంకా ఈ రోజుల్లో కూడా బట్టల మీద చాకలి గుర్తులు కన్పిస్తాయా?" నవ్వుతూ ప్రశ్నించాడు శ్రీరాములు.

"కన్పించడం లేదు సరే... ఇంతకూ నీవేమని భావిస్తున్నావు? ఇది ప్రమాదమా ఆత్మహత్యా?? లేక హత్యా?"

వర్మ ప్రశ్నవిని శ్రీరాములు నవ్వాడు మళ్ళీ!... నువ్వుతూనే అన్నాడు... "హత్య అనడానికి తగిన ఆధారాలు కన్పించడం లేదు కదా? ఆక్సిడెంటు అయి ఉంటుంది బహుశా... నీవేమనుకుంటున్నావు?"

“నేనింకా ఓ స్థిర నిర్ణయానికి రాలేకపోతున్నాను. కానీ కాస్తహెచ్చు తక్కువగా నీ ఆలోచనా, నా ఆలోచనా ఒక్కటే! పోస్టు మార్టం రిపోర్టు వచ్చాక కానీ నా ఆలోచన ముందుకు సాగదనుకుంటాను!” అన్నాడు వర్మ నవ్వి.

* * *

రాత్రి పన్నెండు గంటలు.

ఓ పట్టాన నిద్రరాకపోవడంవల్ల మంచందిగి పడకగదిలోంచి వెలుపలికివచ్చి హాలుకేసి నడిచాడు వర్మ.

రిసీవర్ అందుకుని నెంబర్లు ప్రెస్ చేశాడు.

“నేను ఎస్.ఐ.ని... వైర్లెస్ ఆపరేటరున్నారా?” అని ప్రశ్నించాడు నైట్‌డ్యూటీలో ఉన్న సార్జంటు లైన్‌లోకి రాగానే.

“వెళ్లిపోయారు సార్!” అన్నాడు సార్జంటు సత్యం అవతలి నుండి.

“రాత్రి ఆక్సిడెంటు మీద ఏ స్టేషను నుండీ అయినా మెసేజ్ వచ్చిందా?”

“లేదు సార్!”

“ఇన్‌ఫర్మేషన్ ఏదయినా వస్తే నాకు ఇన్‌ఫాం చెయ్యండి” అంటూ ఫోన్ పెట్టేశాడు వర్మ.

అతనికి చాల నిరుత్సాహంగా, అసంతృప్తిగా ఉంది.

‘ఆధునీకరింపబడిన శాఖాపరమైన వ్యవస్థ, ఎంతో అభివృద్ధి చెందిన టెక్నాలజీ, తగిన మేర బలగం ఉండి కూడా ఒక మనిషిని నిర్ధాక్షిణ్యంగా దారుణంగా చంపేసి వెళ్ళిపోయిన వాహనం. జాడ కనుక్కోలేకపోవడం అన్న విషయం వ్యవస్థ యొక్క వెనుకబాటు తనాన్ని సూచిస్తున్నది’ అనుకుంటూ బెడ్‌రూంకేసి అడుగులేశాడు వర్మ.

* * *

మధ్యాహ్నం పండ్రెండు గంటలు...

“మృతుడి రక్తంలో హ్యూమన్ ఇమ్యూనో డెఫిసియన్సీ వైరస్ ఉన్నట్లుగా పోస్టుమార్టం రిపోర్టు క్లిస్టర్ క్లియర్‌గా చెప్పింది కాబట్టి ఈ కేసును ఆక్సిడెంటల్ డెత్‌గా కాక సూసైడ్ డెత్‌గానే పరిగణించవచ్చు!” అన్నాడు శ్రీరాములు.

ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్‌పెక్టరు జార్జ్ కూడా అతని వాదనను సమర్థిస్తూ తల ఊపాడు.

"మృతుడు ఎవరన్నది తేల్చుడానికి ప్రయత్నం చేద్దాం. తనెవరయినా గానీ హెచ్.ఐ.వి.కి గురయ్యాడు. త్వరలోనే ఎయిడ్స్‌కు గురయి మరణిస్తాననే భయాందోళనలతో పాటు తీవ్ర నిరాశకు, దుఃఖానికి లోనయి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని అంకిపాడు మిట్ట క్రిందికి వచ్చాడు. ఆపై వేగంగా వస్తున్న ఏదో వాహనానికి చప్పున అడ్డుపడ్డాడు. అతని మీద దూసుకుపోయిన వాహనం, వెనుక వెనుకనే వచ్చిన వాహనాలు కూడా అతని శరీరాన్ని ఛిద్రం చేశాయి!" అన్నాడు శ్రీరాములు ఉత్సాహంగా.

"కరెక్ట్! అలా జరిగి ఉండవచ్చు!" అన్నాడు జార్జ్.

"కానీ ఒక విషయం జరిగి ఉండవచ్చు!" అన్నాడు వర్మ.

"ఏమిటి?" ఆసక్తిగా అడిగాడు జార్జ్.

"మరణం సాయంత్రం ఆరు... ఏడు గంటల మధ్య జరగి ఉంటుందని పోస్టుమార్టం రిపోర్టు తెలిపింది కద? మరి మృతుడి చేతిలో వాచీ పదిపది దగ్గర ఆగిపోయి ఉంది! నాకెందుకో ఇది హత్య అయివుండవచ్చనిపిస్తోంది!" అన్నాడు వర్మ సీరియస్‌గా.

శ్రీరాములు తేలికగా నవ్వేశాడు.

"తను ఏడు గంటలలోపే ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చు. పది గంటల ప్రాంతంలో మరో వాహనం ఏదయినా అతని శవం మీదుగా వెళ్ళినపుడు వాచీ నిలిచిపోయి ఉండవచ్చు కదా?" అన్నాడు.

వర్మ ఏం జవాబు చెప్పలేకపోయాడు.

అంతలోనే ఆగదిలోకి ప్రవేశించిన రామస్వామి అటెన్షన్‌లో నిలబడి అందరికీ సెల్యూట్ కొట్టాడు. అతని కుడిచేతిలో ఓ చిన్న ప్లాస్టిక్ సంచి ఉంది.

"సార్! దుస్తులు రక్తంతో తడిచి ఉన్నప్పుడు సరిగా కన్పించలేదు సార్!... ఇప్పుడు కాస్త స్పష్టంగా తెలుస్తోంది... చొక్కాకాలర్ మీద లేబుల్ తీసివేయబడివుంది!" అంటూ సంచిలోంచీ దుస్తులు తీసి చొక్కా టేబులు మీద పరిచారు.

అందరూ ఆసక్తిగా చొక్కాకాలర్‌ను పరిశీలించారు. లేబిల్ లేదు... కానీ కొస కొద్దిగా బిగుతుకుట్లలో తగులుకోవడం వల్ల లేబిల్ ఆఖరిపొర నిలిచిపోయి రెండు

మూడు అక్షరాలు కూడా కన్పిస్తున్నాయి అస్పష్టంగా.

"కాజా! మాగ్నిఫైయింగ్ లెన్స్!" అన్నాడు వర్మ చొక్కా కాలర్‌ను తన చేతులలోకి తీసుకుని ఉత్సాహంగా.

కానిస్టేబుల్ కాజా గబగబా పక్క గదిలోకి వెళ్ళి టేబులు సొరుగులోంచీ భూతద్దం తీసుకువచ్చాడు.

దాంతో పరీక్షగా చూస్తూ... "పై భాగంలో "ఎస్" అన్న ఒకే ఒక్క అక్షరం పెద్దగా కన్పిస్తోంది. బహుశా టయిలర్స్‌లో ఆఖరి అక్షరం అయివుంటుంది. 'సంఘం టైలర్స్' లేదా 'రామటైలర్స్' ఇలా ఏదో ఒక టైలర్ షాపుకు చెందిన పేరులోని ఆఖరి అక్షరం అది.

అదే విధంగా దాని క్రింద "ఏయం" అని రెండు చిన్నక్షరాలు మాత్రం కన్పిస్తున్నాయి. సహజంగా ఆ రెండక్షరాలు పురం అనే పదంలో చివర్న వస్తాయి కాబట్టి కృష్ణాపురం, రామాపురం, వాల్మీకిపురం... ఇలా... ఏదయినా ఊరి పేరులోని ఆఖరి అక్షరాలు అయివుండవచ్చు!" అన్నాడు వర్మ.

"ఖచ్చితంగా!" అన్నాడు జార్జ్.

"సార్!" అన్నాడు కాజా కాస్త సంశయంగా.

"సంకోచం వద్దు... నీకు తోచింది చెప్పు!" ప్రోత్సహించాడు జార్జ్.

"సార్, మన ఊరికి దగ్గరలోని ఘటోద్గజపురం కూడా అయివుండవచ్చు కదా?"

"వెరీగుడ్... అయివుండవచ్చు!" అన్నాడు జార్జ్ ప్రశంసా పూర్వకంగా.

"ఈ కాలర్ తీసివేయబడడాన్ని చూశాక నాకిది ఖచ్చితంగా హత్యే అని అన్పిస్తోంది సార్!" అన్నాడు వర్మ.

"మృతుడే తన మరణ విషయమూ, తన శరీరంలోని జబ్బు విషయమూ తన వాళ్ళకూ, సమాజానికీ తెలియకూడదనుకుని... ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాక తన కాలర్ మీది లేబిల్ తనే తీసివేసి ఉండవచ్చు కదా?" అన్నాడు శ్రీరాములు తనవాదాన్ని కొనసాగిస్తూ.

"మృతుడే తన కాలర్ మీది లేబిల్ తీసివేసివుంటే బాగా పూర్తిగా తీసివేసేవాడు. కొంత తగులుకునేలా ఎందుకు తీస్తాడు? హంతకుడు సహజంగా ఆతృతలో

ఉంటాడు కాబట్టి గబగబా తీసివేయడం వల్ల... అదీ చొక్కా శవం మీదుండగానే తీసివెయ్యడంవల్ల... ఈ మూడక్షరాల ముక్క కాలర్‌కు ఉండిపోవడం బహుశా గమనించి ఉండడు. దీన్నే తెలివైన హంతకుడు చేసిన తెలివి తక్కువ పొరపాటుగా భావిస్తున్నాను నేను. బహుశా అదే అతని పాలిట గ్రహపాటయి అతన్ని పట్టివ్వవచ్చు!" అన్నాడు వర్మ.

అందరూ నవ్వేయడంతో ఆ గదిలోని వాతావరణం కాస్త తేలికగా మారింది. "ఏన్ అన్ ఐడెంటిఫైడ్ డెత్ ఆఫ్ సూసయిడ్" గా ఫైల్ క్లోస్ చెయ్యడం తేలికే! కానీ ప్రయత్నం చేద్దాం... వర్మ వాదానికి అవకాశం ఇద్దాం!" అన్నాడు అంతదాకా మౌనంగా అంతా వింటూ కూర్చున్న సర్కిల్ ఇన్స్‌స్పెక్టరు శివయ్య.

* * *

రాత్రి పండ్రెండు గంటలు...

ఫోను రింగయిన శబ్ధం విన్పించడంతో చప్పున మెలకువ వచ్చేసింది. మంచందిగి చకచకా హాల్లోకి నడచి రిసీవర్ అందుకున్నాడు వర్మ.

"సార్ నేనూ, పీ.సీ. కాజా ఘటోద్గజపురం నుండీ వచ్చి ఇప్పుడే బస్ దిగాము సార్!" అన్నాడు శంకర్ అవతలి నుండీ.

"గుడ్... ఎనీ ఫేవర్?"

"ఘటోద్గజపురంలో ఒక టైలర్ చొక్కా, ఫ్యాంటు చూశాక తను కుట్టినవే కావచ్చంటున్నాడు సార్... అంతకు మించి ఏమీ చెప్పలేకపోతున్నాడు."

"ఎందుకని?"

"ఆ చొక్కా గుడ్డ దాదాపు ఒక తాను మొత్తం తనే అమ్మి చొక్కాలు కుట్టిచ్చాడట. ఆ చొక్కా ఎవరిదో చెప్పలేనంటున్నాడు."

"పోనీ ప్యాంటు?"

"అలాంటి ప్యాంటు పీసులు కూడా అమ్మాడట... కానీ ఆ ప్యాంటు తను అమ్మినదో, కాదో చెప్పలేక పోతున్నాడు!"

"అలాగా? రేపు ఉదయాన్నే మనం ఘటోద్గజపురం వెళ్దాం... ఎన్నింటికి బయల్దేరగలరు?"

అవతల శంకర్ మౌత్‌పీస్ మూసేశాడు కాబోలు ఓ నిముషం పాటు నిశ్శబ్దం...

తరువాత.

"సార్, ఉదయం ఆరు గంటలకు స్టేషను దగ్గరకు వచ్చేస్తాం సార్!" అన్నాడు శంకర్.

"ఇప్పటికే బాగా పొద్దుపోయింది. ఎనిమిది, ఎనిమిదిన్నరల మధ్యన వచ్చెయ్యండి చాలు... జీపులో వెళ్లొద్దాము!"

"అలాగే సార్! గుడ్‌నైట్ సార్!!"

"గుడ్‌నైట్!"

* * *

మధ్యాహ్నం పండ్రెండు గంటలు...

ఘటోద్గజపురంలో 'న్యూలుక్ టైలర్స్' అనేది ఓ మధ్య తరగతి దర్జీ దుకాణం. అందులో నాలుగు కుట్టుమిషన్లు, ఓ ఓవర్‌లాక్ మిషను పనిచేస్తున్నాయి. చిన్న బట్టల కొట్టు కూడా అందులోనే కన్పిస్తోంది.

"నిన్ననే మీ వాళ్ళతో చెప్పాను సార్!" ఈ చొక్కా నేను కుట్టాను. ఈ లేబిల్ ముక్క కూడా మాదే!! కానీ ఈ చొక్కా ఎవరికి కుట్టిచ్చానో చెప్పలేను!" అన్నాడు టైలర్ శ్రీనివాసులు ఇన్‌స్పెక్టరు వర్మతో...

"నీ దగ్గర బట్టలు కుట్టించుకునే వారంతా నీకు తెలిసే ఉంటారు కదా?"

"చాలామంది తెలుసుసార్! తెలియని వారూ కొందరుంటారు... ఎందుకంటే... చుట్టుపక్కల పల్లెలనుండీ వచ్చి ఎందరో బట్టలు కుట్టించుకుని వెళ్తుంటారు!" అన్నాడు శ్రీనివాసులు.

"అయితే నీ దగ్గరకు వచ్చే వాళ్ళలో చాలామంది పేర్లూ, వారి ఊర్లూ నీకు తెలియవు!"

"మనిషి పేరూ, ఊరి పేరూ తెలుస్తుంది. సార్! కాని ఈ సొగ్గుడ్డే ఎవరికి కుట్టిచ్చానో తెలియడం లేదు!!"

"అందరి పేర్లూ, ఊర్లూ తెలుస్తాయా? ఎలా??"

శ్రీనివాసులు బట్టలు కత్తిరించే పెద్ద టేబులు సొరుగులోంచి రెండు పుస్తకాలు వెలికి తీశాడు. ఒకటి తోక బుక్కులా పొడుగ్గా వున్న తక్కువ వెడల్పు బౌండుబుక్కు,

రెండవది ఫుల్‌స్కేప్ బౌండు బుక్కు.

“ఈ చిన్న బుక్కులో బట్టలు కుట్టించుకోవడానికి వచ్చిన వారి పేరిట సీరియల్ నెంబరు వేసి వారి పేరూ, ఊరి పేరూ వ్రాస్తాను సార్. ఇక్కడ వచ్చిన నెంబరే ఈ పెద్ద బుక్కులో వేసి, ఆ నెంబరు ప్రక్కన కొలతలు వ్రాసుకుంటాను. వారి బట్టలకు స్టిక్కర్ స్లిప్పులు అంటించి ఆ స్లిప్పుల మీద ఇదే నెంబరు వేస్తాను. అందువల్ల బట్టలు మారిపోయే అవకాశం, ఉండదు. అందువల్ల పేరూ, ఊరూ ఈ చిన్న పుస్తకంలో ఉంటాయి!” అన్నాడు శ్రీనివాసులు.

తోక పుస్తకంలోని వందలాది నెంబర్లలో ఉన్న పేర్లనూ, ఊర్లనూ మరో పుస్తకంలోని వందలాది కొలతలనూ యధాలాపంగా తిరగేస్తున్న వర్మ మనసులో ఓ మెరుపు మెరిసింది.

“శ్రీనివాసులూ ఈ పుస్తకంలో వ్రాశావే కొలతలు... అలా ఈ దుస్తులను కొలచి కొలతలు వ్రాయగలవా?” అని ప్రశ్నించాడు.

“బట్టలమీద తేడా లేకుండా కొలతలు తీసి వ్రాయడం కొద్దిగా కష్టం... అయినా వ్రాయవచ్చుసార్!” అన్నాడు శ్రీనివాసులు చకితుడయి.

పదినిమిషాలలో చొక్కాను, ఫ్యాంటును కొలతలు తీయడం వాటి కొలతలను ఒక తెల్లకాగితం మీద వ్రాయడం జరిగిపోయింది.

“శ్రీనివాసులూ ఇప్పుడు ఈ కొలతలు నీ పెద్దపుస్తకంలో ఎక్కడైనా వ్రాసివున్నాయేమో చూడు!” అన్నాడు వర్మ.

“ఇందుకే... యుద్ధంలో కాలుకూ, చేతికీ బుల్లెట్లు తగిలి మిలటరీ నుండీ డిశ్చార్చి అయినా వెంటనే ఆయనకు సివిల్ సర్వీసులో యస్సయి ఉద్యోగం వచ్చింది!” అన్నాడు శంకర్ కాజాకు మాత్రమే విన్పించేలా.

శ్రీనివాసులు పెద్ద పుస్తకంలో కొలతల్ని తన చేతి కాగితంలోని కొలతల్ని మార్చి మార్చి చూస్తూ పేజీలు నెమ్మదిగా తిప్పుతున్నాడు. వర్మ చూపులు కూడా ఆరెంటింటి మీదే కదుల్తున్నాయి.

“సార్! ఇవే కొలతలు!!” అన్నాడు శ్రీనివాసులు అరగంట తరువాత ఉక్కిరిబిక్కిరి అయిపోతూ... మెరుస్తున్న కళ్ళతో ఉత్సాహంగా చూస్తూ.

వర్మ ఓ పర్యాయం పరీక్షగా కాగితంలోని కొలతలనూ, పుస్తకంలోని కొలతలనూ చూసి తలపంకిస్తూ అన్నాడు...

"నెంబరు మూడువందల పదిహేడు... ఈ నెంబరు అభాగ్యుడెవరో చూడు!"

"క్షణం పని సార్!" అంటూ తోకబుక్కు తీసి తిరగేసి అరనిముషం తరువాత... "సార్ యేసుమణి సార్... నాకు బాగా తెలుసు... యేడాదికి యేడెనిమిది జతలు కుట్టించుకుంటాడు సార్... ఈ ఊరే... ఆర్.అండ్.బి. ఆఫీసులో గుమస్తా!" అన్నాడు అదోలా అయిపోతూ.

వర్మ చిన్నగా నిట్టూర్చాడు... తరువాత నెమ్మదిగా అన్నాడు.

"శ్రీనివాసులూ మేమిలావచ్చి విచారించిన విషయం కొంతకాలం గోప్యంగా ఉంచాలి!"

అంగీకారంగా తల ఊపాడు శ్రీనివాసులు. కానీ అప్పటికే కొంతమంది అంగడి ముందరా, జీపు దగ్గరా గుమికూడి చోద్యం చూస్తున్నారు.

✶ ✶ ✶

"ఏసుమణి త్రీడేస్ క్యాజువల్ లీవుమీద అనంతపురం వెళ్ళాడు. ఎక్స్‌టెన్షన్‌కు టెలిగ్రాం ఏదీ రాలేదు కాబట్టి. రేపు డ్యూటీకి రిపోర్టు చేస్తాడు!" అన్నాడు ఆర్.అండ్.బి. ఆఫీసు మేనేజరు వర్మ వాళ్ళని సంశయంగా చూస్తూ.

శంకర్ మౌనంగా బ్యాగుతీసి అందులోని చొక్కాను, ఫ్యాంటును ఆయన టేబులు మీద ప్రదర్శించాడు.

"అరె... ఇవి... ఏసుమణి దుస్తుల్లా వున్నాయే... ఏమిటిలా ఉన్నాయి?" అన్నాడాయన నిర్ఘాంతపోతూ.

నిముషాలమీద ఎక్జిక్యూటివ్ ఇంజనీరు మొదలుకొని ఆఫీసు అటెండర్ల వరకూ అందరూ మేనేజరు టేబులు చుట్టూ గుమికూడిపోయారు గందరగోళంగా.

వర్మ తీసుకువచ్చిన రికార్డు షీటు మీది మృతుడి వేలిముద్రల కాపీతో ఏసుమణి సర్వీసు రిజిస్టరులోని వేలిముద్రలు సరిపోతున్నాయి.

వాచి, చెప్పులు కూడా నిర్ధారించబడ్డాయి నిముషాలమీద.

ఏసుమణికి వివాహం కాలేదని తెలియగానే తృప్తిగా నిట్టూర్చాడు వర్మ. హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియన్సీ వైరస్ వ్యాధి గ్రస్తుడికి వివాహం అయివుంటే... వంశాంకురాల ద్వారా...

ఓ గంట తరువాత పోలీసు జీపు వెంబడి ఆర్.అండ్.బి. వారి జీపు రెండు

ప్రయివేటు కార్లూ బయల్దేరాయి శవాన్ని తెచ్చుకోవడానికి. వేగంగా పరిగెడ్తున్న జీపులో కూర్చున్న విజయవర్మ కళ్ళముందు... చివరి కార్లో వస్తున్న ఏసుమణి వృద్ధ తల్లిదండ్రుల గాజు కళ్ళల్లోని, దుఃఖమూ విషాదమే మెదులుతోంది.

✶ ✶ ✶

మరునాటి ఉదయం తొమ్మిది గంటలు...

ఘటోద్గజపురంలో మృతుని ఇంటి వద్ద...

"సార్, ఏసుమణి చాలా చలాకీగా, అల్లరి చిల్లరిగా తిరిగేవాడట! ఈ పుణ్యాత్ముని వల్ల ఎంతమంది ఆ జబ్బు బారిన పడ్డారో ఏమో?" అన్నాడు ఎ.ఎస్.ఐ. రామస్వామి.

"అదలా ఉంచుదాం. ఇది హత్యో, ఆత్మహత్యో తేల్చే వివరాలేమయినా తెలిశాయా?" అన్నాడు శ్రీరాములు కాస్త విసుగ్గా.

"ఇది ఆత్మహత్య!" అన్న పూర్తి విశ్వాసంతో ఉన్నాడతను.

"ఆత్మహత్యే అయివుండాలి సార్! ఏసుమణికి విరోధులున్నట్లు ఎక్కడా ఏ ఆచూకీ లభ్యం కాలేదు. ఇక్కడి మనవాళ్ళు కూడా ఆవిషయమే కన్‌ఫర్మ్ చేసేశారు!" అన్నాడు రామస్వామి.

అంత్యక్రియలకు శవం స్మశానానికి బయల్దేరేవరకూ ఏసుమణి బంధువులను, స్నేహితులను, ఆఫీసు స్టాఫ్‌ను విచారిస్తూనే ఉన్నాడు వర్మ.

శవం కదిలి వెళ్ళి పోతుండగా... "సార్, మనం ఇంకా కొంతసేపు ఇక్కడుండాలి సార్!" అన్నాడు సార్జంటు శంకర్ వర్మతో రహస్యంగా. అతడు సివిల్‌డ్రెస్‌లో ఉన్నాడు ఎవరూ పోలీసుని తెలుసుకోవడానికి వీలులేకుండా.

శవం చర్చికి వెళ్ళిపోయాక కొంత స్వంత పనుందంటూ తతిమ్మా వాళ్ళనందరినీ జీపులో పంపేసి శంకర్‌తోపాటు నిలచిపోయాడు వర్మ ఘటోద్గజపురంలో.

✶ ✶ ✶

"సార్! ఏసుమణి శవాన్ని చూడడానికి వచ్చిన వారిలో కొందరి మాటలను బట్టి మిష్టర్ సుందరం అనే అతని భార్యతో మృతునికి చాలా సాన్నిహిత్యం ఉండేదని తెలిసింది సార్!" అన్నాడు శంకర్.

"గుడ్! ఆ సుందరం ఎవరో మనం వెంటనే తెలుసుకోవాలి!" అన్నాడు వర్మ.

✶ ✶ ✶

మధ్యాహ్నం పన్నెండు గంటలు... యూనిఫాంచొక్కా తీసివేసి రెడీమేడ్ స్లాగ్ తొడుక్కున్న వర్మ, శంకర్‌తో కలిసి ఆటో దిగి ఆ ఇంట్లో ప్రవేశించే సమయానికి అంతపెద్ద ఇంట్లో దాదాపు డెబ్బయి అయిదేళ్ళ వృద్ధురాలూ, నడివయసు పనిమనిషి మాత్రమే ఉన్నారు.

సుందరాన్ని గూర్చి ప్రశ్నించగానే...

"మా అబ్బాయా? తిరుపతి వెళ్ళాడుకదా?" అంది వృద్ధురాలు.

"ఎప్పుడు వెళ్ళారు?"

"నిన్న రాత్రి పొద్దుపోయాక పోయాడు! ఈ రోజు రాత్రికి వస్తాడు!!"

"వారి శ్రీమతి గారున్నారామ్మా?"

"ఎక్కడున్నారు? ఇద్దరు శ్రీమతులూ అక్కడికే పోయారుగా?" అంది ఆమె దీనంగా ఆకాశానికేసి చేయి చూపుతూ. ఆమె గాజు కళ్ళలోతుల్లో చెప్పరాని దిగులు కన్పించిందా సమయంలో.

"అయ్యో! అలాగా? ఎన్నాళ్ళయింది? అన్నాడు వర్మ చకితుడయి.

"నాకు సరిగా జ్ఞాపకం లేదయ్యా!" అందామె దీనంగా.

"సార్, ఆ పెద్ద ఫోటోలో ఉన్నమ్మ మా పెద్దమ్మ లలితమ్మగారు... పోయి ఆరేండ్లయింది. ఈ ప్రక్కనున్న ఫోటోలో ఉన్నది. చిన్నమ్మ రాధమ్మగారు... ఆయమ్మ పోయీ పదకొండు నెలలు దాటిపోయింది కదా?" అంది పనిమనిషి.

ఫోటోలలో ఆ ఇద్దరు స్త్రీల పేర్లతోపాటు వారు మరణించిన తేదీలు కూడా పెయింట్ చెయ్యబడివున్నాయి.

ముసలామె, పనిమనిషీ చూడకుండా ఆ పేర్లను, తేదీలను ఎడం అరచేతిమీద పెన్‌తో నోట్ చేసుకున్నాడు వర్మ.

ఆ ఇంట్లోంచి, వెలుపలికి రాగానే ఖాళీ ఆటో ఎదురయింది. ఇద్దరూ ఎక్కికూర్చున్నాక "మునిసిపల్ ఆఫీసుకు పోనీ!" అన్నాడు వర్మ.

"అక్కడికెందుకు సార్?" అన్నాడు శంకర్ ఆశ్చర్యంగా.

"చీకట్లోకి ఓబాణం వేసి చూద్దాం... కాస్త ఆగు!" అన్నాడు వర్మ నవ్వి.

"ఒక కేసు విషయంగా వచ్చాము సర్, ఈ ఊర్లోనే జరిగిన ఈ రెండు డెత్‌లు రిజిస్టర్ అయ్యాయేమో చూడాలి. రిజిస్టర్ అయివుంటే వాటి తాలూకు డెత్ ఇంటిమేషన్ రిపోర్టులను కూడా చూడాలి!" అన్నాడు వర్మ రిక్వెస్టుగా.

మున్సిపల్ కమీషనరు బర్త్ అండ్ డెత్ సబ్‌రిజిస్ట్రార్‌ను పిలిపించారు. అతనూ, అతని అసిస్టెంటూ కలిసి ఆరు సంవత్సరాల క్రితం రికార్డులు, ఆ సంవత్సరం రికార్డులు చూడడం మొదలుపెట్టి కాస్సేపట్లోనే రెండు డెత్‌లూ రిజిస్టరు అయినట్లు గుర్తించారు. అరగంటలో రికార్డు రూంనుండీ ఆ రెండింటి తాలూకు ఇంటిమేషన్ రిపోర్టులూ కమీషనరు టేబులు మీదికి వచ్చేశాయి దుమ్ముదులుపుకుని.

లలితమ్మ డెత్ రిపోర్టు మిషనాసుపత్రి వారు పంపించినది. అందులో మరణకారణం గుండెజబ్బు వల్ల గుండె ఆగిపోవడం అని తెలుపబడింది.

రాధారాణి డెత్ రిపోర్టు ఘటోద్గజపురం సూపర్ స్పెషాలిటి, ప్రయివేట్ హాస్పటల్స్ వారి నుండీ అందినది... కాజ్ ఆఫ్ డెత్ కాలంలో స్పష్టంగా హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియన్సీ వైరస్ అని వ్రాసుంది.

మునిసిపల్ కమీషనరుకూ, బర్త్ అండ్ డెత్ సబ్ రిజిస్ట్రారుకూ అతని సహాయకునికీ కృతజ్ఞతలు తెలిపి ఆఫీసులోంచి వెలుపలికి వచ్చాక అన్నాడు వర్మ.

"యూడిడ్ ఎ గుడ్ జాబ్ శంకర్... మనం ఎలాగైనా ఓ విషయం కనుక్కోవాలి!"

"ఏమిటి సార్ అది?"

"రాధారాణివల్ల యేసుమణికి ఎయిడ్స్ వచ్చిందా? లేక... అతని వల్ల ఆమెకు వచ్చిందా? అన్న విషయం తెలుసుకోగలిగితే ఈ కేసు తేలిపోతుంది!"

"చెట్టు ముందా? విత్తుముందా? అన్నంత చిక్కు ప్రశ్నలా కన్పిస్తోంది సార్!... మీ ఆలోచన!!"

"నిజమే!... మనం ఓసారి ఘటోద్గజపురం సూపర్ స్పెషాలిటీ హాస్పటల్స్‌కు వెళ్ళి వద్దాం!" అన్నాడు వర్మ.

* * *

"రికార్డు పరిశీలించాల్సినంత అవసరంలేదు... మిసెస్ సుందరం. శ్రీమతి

రాధారాణి కేసంతా జ్ఞాపకం ఉంది. నేనే ట్రీట్ చేశాను. హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియన్సీ వైరస్... ఎప్పటికప్పుడు లేటెస్ట్ లైఫ్ సేవింగ్ డ్రగ్స్ వాడుతూ ఎయిడ్స్‌కు కన్వర్ట్ కాకుండా చాలా జాగ్రత్తగా ట్రీట్ చేశాను. ఆమె కూడా మా సూచనలూ, సలహాలూ క్రమం తప్పకుండా పాటిస్తూ చాలా సహకరించింది. వెరీ నైస్ ఉమన్!! బట్ వాట్?? సడన్‌గా డవున్‌ఫాల్ అయింది బి.పి. ఓరోజు. అడ్మిట్ చేసుకుని అబ్జర్వేషన్ మొదలు పెట్టేలోపే పోయింది ప్రాణం!" అన్నాడు డాక్టర్ వేదవ్యాస్ నవ్వుతూనే. వర్మ నవ్వలేకపోయాడు...

"ఆమె హస్బెండ్ అయినా సేఫ్‌గానే ఉన్నారు కదా?"

"అయ్యో... ఎక్కడా? అసలు మొదట ఆయనకే వచ్చి ఆపై ఆమెకు అటాచ్ అయి ఉండవచ్చు. నాకు తెలిసినంతవరకూ అతనిదీ లాస్ట్ స్టేజ్... ఎయిడ్స్ కన్‌ఫర్మ్ కాలేదు కానీ... స్టేజి చాలా డల్... మరెన్నో రోజులు గడవడం కష్టం!" అంటూ ఆపాడు వేదవ్యాస్.

ఆయనకు కృతజ్ఞతలు తెల్పి వచ్చేస్తున్నప్పుడు అన్నాడు శంకర్.

"సార్ రాధారాణి ద్వారా యేసుమణికి హెచ్.ఐ.వి. సోకి ఉండవచ్చు. ఎటూ చచ్చిపోతాననే నిరాశతో అనామికంగా చచ్చిపోవాలనుకుని మన ప్రాంతానికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు!"

"అయివుండ వచ్చు శంకర్!" అన్నాడు వర్మ నవ్వేస్తూ.

* * *

రాత్రి పన్రెండు గంటలు... నెమ్మదిగా నిశ్శబ్దంగా వస్తున్న ఖరీదైన కారును సుందరం ఇంటికి ఇవతలగానే చెయ్యి ఊపి ఆపమన్నట్లుగా సైగ చేశాడు వర్మ. శంకర్‌ను ఊరికి పంపేసి వంటరిగా కాచుకున్నాడు వర్మ అంతదాకా.

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు మీద నిశ్శబ్దంగా ఆగిపోయింది కారు. క్షణం తరువాత హెడ్‌లైట్లు కూడా ఆరిపోయాయి.

అవతలి డోర్ తీసి కార్లో కూర్చున్నాడు వర్మ.

"సార్ నాకో పదిరోజులు వ్యవధి కావాలి!" అన్నాడు సుందరం. జబ్బు వల్లనో, కారు నడుపుకు వచ్చినందువల్లనో అలసటగా కన్పిస్తున్నాడు మనిషి... కార్లోకి పడ్తున్న

స్ట్రీట్‌లైట్ వెలుగులో! స్వరం కూడా చాలా నీరసంగా ఉంది!!

"ఎందుకు?" వర్మ కాస్త కఠినంగానే ప్రశ్నించాడు.

"వారంరోజుల తరువాత నాభార్య తొలి సంవత్సరీకం ఉంది... అది కాస్తా సజావుగా చేసేశాక నేనెక్కడికీ పారిపోకుండా వచ్చి సరండర్ అయిపోతాను... పారిపోగల స్థితికూడా కాదు నాది... మానవతా దృక్పథంతో పదిరోజులు వ్యవధినివ్వండి!"

"అది చట్ట విరుద్ధమైన పనికదా?"

"చావుకు దగ్గరలో ఉన్న మనిషిని సార్ నేను! మీరు టైలర్ శ్రీనివాసులును విచారించగానే ఇహ మీనుండి తప్పించుకోవడం కష్టమని అర్థం చేసుకున్నాను. నేనే మిమ్మల్ని ఏకాంతంగా కలిసి వ్యవధి కోరాలనుకుంటున్నాను... మీరే...!"

"ఇంతకూ ఆ యేసుమణిని ఎందుకు చంపావు?"

"వాడు అణుబాంబు కన్నా ప్రమాదకరమైన వ్యక్తిగా తయారయ్యాడట సార్... సామాజిక పరంగా ఆలోచించే వాణ్ణి చంపేశాను. వాణ్ణి నిరోధించడానికి వేరే మార్గాంతరం లేదు నిజానికి!"

"కాస్త వివరంగా చెప్పు... సరిగ్గా అర్థం కావడంలేదు!"

"నా మొదటి భార్య గుండెపోటులో చనిపోయాక రెండేళ్ళకు... మా అమ్మమాట కాదనలేక రాధారాణిని మళ్ళీ పెళ్ళి చేసుకున్నాను. నా మొదటి భార్యకి సంతానం కలగలేదు. రాధారాణికీ సంతానం కలగదని తెలుసు. కానీ... ఆ సంతానం కోసమే రాధారాణి మా కుటుంబ మిత్రుడు ఏసుమణితో రహస్యంగా స్నేహం పెంచుకున్నదని మాత్రం నాకు తెలియదు.

నా మొదటి భార్య పోయాక ఈమెను చేసుకునేలోపు... మధ్యకాలంలో బయట ఊర్లకు వెళ్ళినప్పుడు రెండు మూడు పర్యాయాలు ఏదో గడ్డికరిచాను. దానివల్లే నాకీ జబ్బు సంప్రాప్తించి నా ద్వారా నాభార్యకు సోకిందని భావించాను. కానీ అసలు వాస్తవం నా భార్య చనిపోవడానికి రెండ్రోజుల ముందు తెలిసింది!" అంటూ ఆగాడు సుందరం. గబగబా మాట్లాడడం వల్ల ఆయాసపడ్తున్నాడు.

"ఏమిటా వాస్తవం?" క్యూరియస్‌గా ప్రశ్నించాడు వర్మ.

"ఏసుమణి చాలా కాలంగా తన రక్తంలో హెచ్.ఐ.వి. కలిగి ఉండడమే కాదు. ఆ జబ్బుతోపాటు మానసికంగా శాడిస్టుగా కూడా మారిపోయాడట. తను మరణించేలోగా వీలయినంత మంది ఆడవాళ్ళను ఈ జబ్బు బారిన పడవెయ్యాలన్నది

అతని వినాశనకరమైన ఆలోచన అట!

పైగా బాగా ఆరోగ్యంగా, అందంగా, ఆకర్షణీయంగా కన్పిస్తూ పరిచయాలు పెంపొందించుకుంటూ ఎంతోమంది అమాయకులకు తన జబ్బును అందజేస్తూ దూసుకుపోతున్న అతడు హిరోషిమా, నాగసాకీలమీద పడ్డ అణుబాంబుల కన్నా ప్రమాదకరమైన వ్యక్తిగా తయారయిపోయాడని వివరంగా తెలిసింది నా భార్య చనిపోవడానికి కేవలం రెండు రోజుల ముందు. అతని దుర్మార్గాన్ని ఆపాలన్నదే నా భార్య ఆఖరికోరిక కూడా ఒక రకంగా!

అలాంటి సామాజిక బాధ్యతలేని పశువులను చంపడం తప్ప చెయ్యగలిగిందేమీ లేదు. ఎందుకంటే ఇది చట్ట పరిధిలోకి రాని సమస్య నిజానికి. అనంతపురం మిషతో సెలవు పెట్టిన యేసుమణి సులభంగా నావలలో పడ్డాడు. నాకార్లో ఓ మారుమూల ప్రదేశానికి తీసుకువెళ్ళి అతనికిష్టమైన జానీవాకర్ బ్లాక్‌లేబుల్ అతి ఎక్కువగా త్రాగించి తను స్పృహలో లేనిస్థితిలో ఉండగానే చాలా కష్టపడి కార్లోనే చంపేశాను.

ఈ జబ్బువల్ల నా చూపు కూడా మందగించినట్లుంది... లేబిల్ తీసివేసినప్పుడు కాలర్‌కు అతుక్కున్న ముక్కని చూడలేకపోయాను.

నాకు అనుకూలమయిన వాహనం ఎదురయ్యేవరకూ కారును చాలా నెమ్మదిగా పోనిచ్చాను.

బుడ్డీ దీపం లాంటి హెడ్‌లైట్లు వేసుకుని వస్తున్న లారీని అంకిపాడుమిట్ట క్రింద దాదాపు రెండు కిలోమీటర్ల దూరం నుండే చూసి నా కారు హెడ్‌లైట్లు ఆపేసి శవాన్ని నడిరోడ్డు మీదకు లాగి కార్ను రివర్సులో బాగా దూరం తీసుకువెళ్ళి మళ్ళీ ముందుకు దూసుకువస్తూ డబుల్ హారిజాంటల్ హెడ్‌లైట్లను ఒక్కసారిగా వెలిగించాను.

నా హెడ్‌లైట్ల పవర్‌లో కండ్లు మిరుమిట్లు గొలిపాయేమో? ఆ మూడు నెంబర్ల లారీ డ్రయివరు... దిక్కుతోచక... తనకు తెలియకుండానే శావాన్ని తొక్కించుకుని వెళ్ళిపోయాడు... అతని వెనుకనే వచ్చిన ఓ పెద్ద లారీకూడా..." అంటూ ఆయాసంతో ఆపేశాడు సుందరం.

"మిష్టర్ సుందరం! నీ భార్య సంవత్సరీకం జరుపుకుని ఆరోగ్యం చూపించుకో... కొద్దిరోజులపాటు ఈ రహస్యం మన ఇద్దరిలోనే ఉంటుంది!" అంటూ కారు దిగేసి డోరుమూసి చకచకా వెనక్కి నడచుకుంటూ వెళ్ళి మలుపు తిరిగాడు వర్మ.

*   *   *

మధ్యాహ్నం పండ్రెండు గంటలు...

"మైడియర్ వర్మా సాబ్... మేమందరం ఏసుమణిది ఆత్మహత్యేనని స్థిరనిశ్చయానికి వచ్చేశాము!" అన్నాడు శ్రీరాములు.

"సరే... అలాగే ముగించి ఘటోద్గజపురం స్టేషనుకు కూడా కాపీ సబ్‌మిట్ చేసేద్దాం!" అన్నాడు వర్మ... ఓటమిని అంగీకరిస్తున్న వాడిలా!

శ్రీరాములు ఏదో బరువుదించుకున్న వాడిలా రిలీఫ్‌గా నవ్వాడు.

వర్మ కళ్ళముందు... చాలా సంవత్సరాల క్రితం సంఘటన ఒకటి మెదిలింది...

అప్పటికి తనింకా మిలటరీ ట్రయినింగ్ కేంపస్‌లోనే శిక్షణ పొందుతున్నాడు.

ఓ రోజు క్లాస్‌లో తమ కమాండర్ అంటున్నాడు...

"యుద్ధరంగంలోని మనిషికి రెండే రెండు మార్గాలుంటాయి. శత్రువును చంపడం లేదా తను చావడం!!... అంతకు మించి క్షణం ఆలోచించినా మరణం తప్పదు... కాబట్టి నిర్దాక్షిణ్యంగా చంపుకుంటూ ముందుకు దూసుకుపోవాల్సిందే!..."

"సాబ్! ఒక చిన్న ప్రశ్న!" అన్నాడు ఒక ట్రెయినీ.

"ఎస్... షూటిట్!"

"మరణించే స్థితిలో పడిపోయివున్న శత్రువు తారసపడినా చంపాల్సిందేనా?"

ఇంకా కరకుతేలని మనసులో పుట్టి తడి ఆరని గుండె లోతుల్లోంచి వచ్చిన ఆ ప్రశ్న కమాండర్ని కూడా కొద్దిగా ఇబ్బంది పెట్టినట్లుంది. అరనిముషంపాటు సూదిమొన క్రింద పడ్డా విన్పించేంత నిశ్శబ్దం...

"శతృవు అవసాన దశలో ఉన్నప్పుడు అలావదిలేసి ముందుకు వెళ్ళిపోయినా నష్టం లేదు... ఎటొచ్చి అతని ఆయుధాలను తీసుకుపోవాలి!"

వాస్తవానికి కమాండర్ ఇవ్వకూడని జవాబది!! ✪

*(శ్రీకాకుళం జిల్లా కలెక్టరు ఎ. కోటేశ్వరరావుగారి సౌజన్యంతో ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'సమరం'*

# భీమరథి

ఇల్లంతా సందడిగా ఉంది. ఏడాదిలో ఏ ఒకటి రెండు రోజులో ఉంటుంది ఈ సందడి. వచ్చిన పిల్లలూ, పెద్దలూ అందరూ వెళ్ళిపోగానే మళ్ళీ అంతా నిశ్శబ్దమే! అదే ఆలోచిస్తూ స్నానం చేసివచ్చి తల వెంట్రుకలకు బ్రిల్‌క్రీమ్ పెట్టుకుంటున్నాను.

"తాతయ్యా ఇంత జాగ్రత్తగా తల దువ్వుకుంటావు కదా? మరి మా నాన్నారిలా డై ఎందుకని వేసుకోవు?" ప్రశ్నించింది భవ్య.

భవ్య వేసిన ప్రశ్న విని చిన్నగా నవ్వుకున్నాను.

కానీ తల దువ్వుకున్నాక అద్దంలో తదేకంగా చూసుకోకుండా ఉండలేకపోయాను.

నిజమే! డెబ్బయేడేళ్ళు వచ్చేసినా నా శరీరంలో కొద్దో గొప్పో అందం, పటుత్వం కన్పిస్తున్నాయి. తల పూర్తిగా నెరసిపోకపోవడం కూడా నా తలకు అదో రకమైన అందాన్ని కలిగిస్తోంది.

"అవును పెదనాన్నా, నీవు గనుక తలకి రంగేసుకుంటే పాతికేళ్ళ యువకుడిలా కన్పిస్తావు!" అన్నాడు తిలక్ చిన్నపిల్లాడిలా నవ్వి.

వాడు అలా అన్నాక "ఈ వయసులో తలకు రంగు వేసుకుని వృద్ధాప్యాన్ని దాచుకోవాల్సిన అవసరం లేదు కదంట్రా!" అన్నాను నవ్వి.

"మరి బ్రిల్‌క్రీమ్ మాత్రం ఎందుకు రాసుకుంటావు?" అంటూ మరో ప్రశ్నను పేల్చింది భవ్య.

ఆ అమ్మాయి చీట్ల ఫిరంగి లాంటిది కాబట్టే అందరూ 'భవ్య' అన్న పేరును దాదాపుగా మరచిపోయి 'చిటారీ!' అని పిలుస్తుంటారు.

చివరకదే ఖాయం అయిపోతూవస్తోంది.

"నెత్తిమీద మిగిలిన వెంట్రుకలు టెంకాయ నారలా వికారంగా పైకెగసిపడకుండా జాగ్రత్తపడుతున్నాను తల్లీ!" అన్నాను ఓపికగా.

"అన్ని విషయాలలో ఇన్ని జాగ్రత్తలు పాటిస్తుంటావు కద? జీవితాంతం నీకు తోడుండడానికి వీలుగా ఎవర్నైనా పెళ్ళెందుకు చేసుకోలేదు?" అంది భవ్య.

"ఏయ్, చిటారీ చిన్నంత్రం, పెద్దంత్రం లేకుండా ఏమిటా మాటలు?" భవ్య

తల్లి భవాని గట్టిగా గదమాయించడంతో, చితారి నోరయితే మూతపడింది కానీ నా మనసులో ఒక్కసారిగా కలిగిన కదలిక, హృదయం తాలూకు అట్టడుగుపొరల్లో నిక్షిప్తమయి ఉన్న జ్ఞాపకాలలో చిత్రమైన స్పందన... ఆ వెంటనే ఆ రెండింటినీ తోసిరాజని గుండెను అరచేతులతో పట్టుకున్న అనుభూతి... అన్నీ కలగలసి చిన్న ఉలికిపాటుకు గురయ్యేలా చేశాయి నన్ను.

ఏభైయేళ్ళ క్రితం నాటి జ్ఞాపకాల వెనుకకు లాగుతోంది మనసు అప్పటికే. కళ్ళముందు ఎన్నో సంఘటనలు సజీవంగా కదులుతున్నాయి. పాడుబడి వుండిన మడికయ్యల శివాలయం... ఆలయానికి దక్షిణాన పెద్దబావి గట్టుమీద... పగలు వచ్చారు, వేపచెట్ల కలయిక కింద... సాయం సంధ్యను కప్పివేస్తున్న మసకచీకట్ల మధ్యన... చల్లటి చలిగాలుల తాకిడిలో, వెచ్చటి సుమిత్ర శరీరాన్ని ఆనుకుని కూర్చుని, తనచుట్టూ చేతులు పోనిచ్చి కౌగిలించుకోడానికి ప్రయత్నించిన... ఆనాటి తియ్యటి అనుభూతి తాలూకు సుగంధపూరితమైన సువాసనలు మనసును కదిలించసాగాయి.

"మామయ్యగారూ, ఏమిటి అలా అయిపోయారు? చితారి చిన్నపిల్ల... దాని మాటలేం పట్టించుకోకండి!" నొచ్చుకుంటూ భవాని అన్న మాటలతో కదలికలతో కూడిన ఆలోచనల లోంచీ కాస్త వెలుపలపడి–

"అబ్బే ఏం లేదులేమ్మా!" అంటూ వరండా గదికేసి అడుగులు వేశాను.

✶ ✶ ✶

సుమిత్ర... ఆనాటికీ–నేటికీ... నా ప్రాణం!

నా మనసు ఆక్రోశిస్తోంది, కదిలిన జ్ఞాపకాలతో హృదయం రోదిస్తోంది. ఇంతకూ ఎక్కడుందో తను? ఎలా ఉందో? అసలు ఉందో? లేక...? ఆ ఊహనే భరించలేకపోయాను.

మంచం మీదనుండి లేచి కిందికి దిగి గదితలుపు తెరుచుకుని వరండాలోకి వచ్చాను.

ఇల్లూ, వీధీ... అంతా ప్రశాంతంగా నిద్రపోతున్నాయి. మెట్లెక్కి మిద్దెమీదికి వెళ్ళాను.

అమావాస్య రోజులు... ఆకాశంలో చంద్రుని జాడలేదు. నక్షత్రాలు మాత్రం కన్పిస్తున్నాయి.

అనంతమైన ఆకాశమంత ఆకృతితో అందమైన సుమిత్ర నా మనసంతా ఆక్రమించుకుని నన్ను కలవరపెడ్తున్నది. 'నేలమీద ఓ కాలు, చితిలో ఓ కాలు

ఉంచుకున్న నాకెందుకింత ప్రేమ? ఆరాటం?' అని ప్రశ్నించుకున్నాను మనసులో.

బదులుగా రెండు వేడి కన్నీటిచుక్కలు జారిపోయాయి నా రెండు కళ్ళనుండి.

"సుమిత్రా... సుమిత్రా... సుమిత్రా!" అని పైకే అనుకున్నాను, మరో రెండు వేడి కన్నీటి చుక్కలు జారిపోతోండగా రెండు నిమిషాలపాటు భయంకరమైన నిశ్శబ్దం... తరువాత...

"సుమిత్ర ఎవరు పెదనాన్నా?" అన్న ప్రశ్న విన్పించింది. తగ్గు స్వరంతో ఉలికిపడి వెనుతిరిగి చూశాను. చీకటిలో తిలక్ రూపం కన్పించింది అస్పష్టంగా!

* * *

మదనపల్లె అనీబిసెంట్ దివ్యజ్ఞాన కళాశాలలో చదువు సాగిస్తున్న రోజులు...

సున్నితంగా, సుకుమారంగా, నెమ్మదిగా నడచివచ్చే, మాట్లాడే సుమిత్రమీద ఇష్టం ఏర్పడింది.

ఫారిన్ గాబర్డీన్ ప్యాంట్లు, సిల్కుచొక్కాలు ధరించే నేను కూడా తనను ఆకర్షించినట్లే విశాలమైన ఆమె కనులు భాష్యం చెప్పాయి. ఆవరేజ్ మార్కులు పొందే నేను అత్యున్నత మార్కులు సాధించే ఆమె పుస్తకాలను అడిగి తీసుకోవడం ఎవరికీ ఎటువంటి అనుమానాలనూ కలిగించేది కాదు.

మొదట పుస్తకాల మధ్యన మామూలు లేఖలు నడిచాయి. ఆపై ఒకరి ఇష్టాలూ, అభీష్టాలూ ఇరువరులా చెప్పుకుంటూ తిరిగాయి. చివరికి అమూల్యమైన ప్రేమలేఖలుగా ఊపందుకుని ప్రయాణం చెయ్యసాగాయి.

ఏ పక్షానికో, నెలకో ఒక పర్యాయం బాహుదా కాలువ ఒడ్డునున్న ఆంజనేయస్వామి గుడికి తూర్పునున్న చిన్నబావి ఒడ్డునో... లేదా.. ఊరి చివరి మడికయ్యల మధ్యనున్న పాడుబడిన శివాలయానికి దక్షిణాన ఉన్న పెద్ద బావిగట్టుమీదో చిరుచీకటిలో ఐదు లేదా పది నిముషాలు మాత్రం ఏకాంతంగా కలుసుకోవడానికి అవకాశం లభ్యమయ్యేది... పాముల రాజ్యం మధ్యన...

అప్పుడైనా తను ఎన్నో హద్దులు పాటించేది.

గాఢమైన వెచ్చటి కౌగిలి లేకపోతేపోయె కనీసం ఓ చిరుముద్దునయినా ధైర్యంగా,

సంతోషంగా స్వీకరించగలిగేదికాదామె.

కొద్దిరోజులలో అక్కడ మా చదువైపోబోతోండగా ఓనాడు... పాడుబడిన శివాలయానికి దక్షిణాన, పెద్ద బావిగట్టుమీద పగలు వచ్చారు, వేపచెట్ల కలయిక కింద సాయంసంధ్యను కప్పివేస్తున్న మసకచీకట్ల మధ్యన, చల్లటి చలిగాలుల తాకిడిలో వెచ్చటి సుమిత్ర శరీరాన్ని ఆనుకుని కూర్చునివున్న నేను ఆమె శరీరం మీదనుండీ, కురులనుండీ వస్తున్న పవిత్రమైన సువాసనలను పీలుస్తూ నిగ్రహించుకోలేక ఆమె శరీరం చుట్టూ చేతులు పోనిచ్చి నెమ్మదిగా కౌగలించుకున్నాను. ఆశ్చర్యకరంగా ఆమె అభ్యంతరం చెప్పలేదు.

అద్భుతమైన ఆ అనుభూతిలోంచే తలవంచి ఆమె చిక్కని చెక్కిలిమీద ఓ చిరుముద్దు పెట్టాను.

స్వర్గాన్ని అధిరోహించినంత ఆనందంలో, తన్మయంలో నేనుండగానే ఆమె పెదవులు కదిలాయి.

"నన్ను మరచిపో రాజా!"

నెత్తిన పిడుగుపాటుకు గురైన వ్యక్తిలా వణికిపోయాను. ఆమెను చుట్టి ఉండిన నా చేతులు జారిపోయాయి. మా పక్కనుండీ అవతలి పొదలోకి సాగిపోతున్న పొడవాటి నల్లత్రాచు గమనం ఆ క్షణాలలో ఏకాస్తయినా భయాన్ని కలిగించలేదు నాకు.

"మా బావతో నా పెళ్ళి త్వరలో జరగబోతున్నదని నాకీ రోజే తెలిసింది!" అంది ఆమె తన కళ్ళనుండీ కన్నీటి ధారలు జారిపోతోండగా.

"రెండ్రోజుల్లో మా ఊరినుండీ వీలైనంత డబ్బు తెస్తాను. ఈ రాజారావును నమ్మి వెంటవచ్చెయ్యి. ఎటైనా వెళ్ళిపోదాం" అన్నాను ఐదునిముషాల తర్వాత.

"నాకు నలుగురు చెల్లెళ్ళువున్నారు. నేను మీతో వచ్చేస్తే అత్యున్నత సంప్రదాయక కుటుంబానికి చెందిన ఆ నలుగురి చెల్లెళ్ళ గతీ ఏమవుతుందో తెల్సా?" అంది ఆమె ఆవేదనగా.

అంత విషాదంలోనూ ఆమె సహృదయానికి, సంస్కారానికి, సౌజన్యానికి శిరస్సు వంచి నమస్కరించాను మనసులోనే. ఆమె పదికాలాలపాటు పవిత్రంగా జీవించాలి అని అనుకున్నాను దృఢంగా.

అప్పటికే అక్కడ్నుంచీ కన్నీళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోతోంది ఆమె.

* * *

అక్కడ చదువైపోయింది. పై చదువులకోసం బెనారస్ వెళ్ళిపోయాను. ఎంతకాలమైనా మనసు కుదుటపడలేదు. చదువే నా ప్రాణంగా కాలం గడిపాను. కాలం కదిలింది. కానీ మనసులోంచీ సుమిత్ర రూపం చెదరడంలేదు. జ్ఞాపకాలూ సజీవమే.

ఢిల్లీలో మంచి ఉద్యోగమే వచ్చింది.

పెళ్ళిమాట పక్కనపెట్టి అన్నదమ్ముల పిల్లలతో జీవితం గడిచిపోయింది.

ఆ పిల్లలూ తమ పిల్లాపాపలతో వాళ్ళ వాళ్ళ దార్లు వెతుక్కునే ప్రయత్నాల్లో పడిపోయాక ఒంటరి జీవితం మొదలయింది.

ఏ పండుగలకో, పబ్బాలకో సెలవులు చూసుకుని పిల్లలు వచ్చినప్పుడే సందడి, తతిమ్మా రోజులన్నీ నిస్సారంగా, నిస్పృగా పాతజ్ఞాపకాల స్మృతులతోటే...

* * *

చీకటిరాత్రిలో నక్షత్రాల కింద తిలక్‌కొద్దిగా ఒత్తిడి చేసి ప్రశ్నించగానే అనేక సంవత్సరాలుగా నాలో దాగివున్న నా గతం అంతా అలా, అలావచ్చి వెలుపల పడిపోవడం నాకే ఆశ్చర్యాన్ని కలిగించింది.

నిజం చెప్పాలంటే చిన్నవాడి ముందు బయటపడి పోయినందుకు కొద్దిగా సిగ్గుపడ్డాను కూడా.

"తరువాత ఎప్పుడూ చూడలేదా పెదనాన్నా?"

తిలక్ ప్రశ్న నన్ను కలవరపెట్టింది.

"లేదురా... ఆ తరువాత ఎప్పుడూ ఆ వూళ్ళో అడుగుపెట్టలేదు. అయితే ఇంత కాలమయిన తర్వాత, మరణానికి చేరువవుతున్న కాలంలో ఒక కోరికమాత్రం కలుగుతోందిరా!" అన్నాను.

నాకు తెలియకుండానే నా అంతరంగంలోని మాటలు నాలుక దాటిపోతున్నాయి మరి.

"ఏమిటి పెదనాన్నా అది?" తిలక్ క్యూరియస్‌గా ప్రశ్నించాడు.

"చనిపోయేలోగా ఒక్కసారి తనని చూడాలనిపిస్తోందిరా! అయితే తన స్థితేమిటో? ఎందరు మనవళ్ళు, మనవరాళ్ళ మధ్యనుందో? లేక అసలుందో లేదో కూడా తెలియని

అయోమయ స్థితి" అన్నాను.

నా పెదవులమీద వెలసిన శుష్కహాసం చీకటిలో వాడికి కన్పించివుండదు బహుశా!

ఐదునిమిషాల నిశ్శబ్దం తరువాత వాడు ప్రశ్నించాడు. "మదనపల్లెలో వారు ఎక్కడుండేవారు?"

"బ్రహ్మణవీధిలో... పదకొండూ బై ముప్ఫయి నాలుగు ఇంటి నెంబరు" అన్నాను. నా గుండెలలో అణగదొక్కబడి ఉండిన విషాదం అంతా అలా వెలుపలికి తన్నుకువచ్చేసిందేమో తెలియదు.

✶ ✶ ✶

రెండవరోజే బట్టలవీ సర్దుకుని బయలుదేరాడు తిలక్. వాడు ఇండియన్ ఎయిర్‌ఫోర్సులో ఉద్యోగి. పంజాబ్‌లో ఉంటున్నాడు.

"రెండు నెలల సెలవు మొత్తం నాతోనే గడుపుతానన్నావుకదరా?" అన్నాను ఆక్షేపణగా.

"అనుకోకుండా ఓ ముఖ్యమైన పని ఏర్పడింది పెదనాన్నా. ఈ సెలవులలోనే దాన్ని ముగించాలి" అన్నాడు వాడు బయల్దేరుతూ.

రెండ్రోజుల తరువాత నా ఆఖరి తమ్ముడు ఫోన్‌చేశాడు తిలక్ కోసం. తిలక్ తన కుమారుడే.

అప్పుడుకానీ తెలియలేదు నాకు వాడు వాళ్ళ ఊరికి వెళ్ళలేదన్న విషయం.

✶ ✶ ✶

మరో రెండ్రోజులు గడిచాక తిలక్ ఫోన్ చేశాడు. "పెదనాన్నా నీకో న్యూస్. సుమిత్రమ్మగారు జీవించే ఉన్నారు. అయితే ఎక్కడున్నారో తెలియడంలేదు" అన్నాడు.

"ఏమిట్రా నీవు చెప్పేది?" అన్నాను అయోమయంగా. అయితే అప్పటికే నా గుండె వేగంగా కొట్టుకుంటున్నది. శరీరంలో రక్తం సైతం వడివడిగా ప్రవహిస్తోంది.

"సుమిత్రమ్మగారు జీవించేవున్నారని తెలుసుకోగలిగాను పెదనాన్నా. అయితే ఎక్కడున్నారో తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నాను" అన్నాడు వాడు.

"ఇంతకూ నీవెక్కడున్నావురా?" అని ప్రశ్నించాను.

"ప్రస్తుతానికి మదనపల్లెలో. బ్రాహ్మణవీధిలోని లెవన్ బై థర్టీఫోర్ నెంబరు ఇప్పుడు ట్వంటీ బార్ సిక్స్టీన్ బై వన్ సిక్స్‌టీ ఫైవ్!

ఇంటినంబరూ, ఇంటిలోని రెండుతరాల మనుషులూ మారిపోయారు. మడికయ్యల శివాలయం ఎప్పుడో పునరుద్ధరింపబడింది. వందలాది భక్తులు. గుడికి దక్షిణానగానీ ఉత్తరానగానీ బావులూ, చెట్లూ, పాములూ లేనేలేవు. అనేక భవనాలూ, గుడులూ వెలిశాయి" అంటూ అవతల ఫోన్ పెట్టేశాడు వాడు.

తరువాత నేను ఫోన్‌లో ఎన్నిసార్లు కాంటాక్ట్ చేసినా స్విచ్ఛాఫ్ అనే వస్తోంది.

✶ ✶ ✶

వారం రోజుల తరువాత కానీ మళ్ళీ తిలక్ ఫోన్ చెయ్యలేదు. "ఎక్కడున్నావురా కన్నా... మీ నాన్న గోల గోల చేస్తున్నాడు ఫోన్ మీద" అన్నాను.

"ప్రస్తుతానికి కరుణాశ్రమంలో ఉన్నాను. దురదృష్టవశాత్తూ సుమిత్రమ్మగారు ఇక్కడ్నుండీ నాలుగు సంవత్సరాల క్రితమే వెళ్ళిపోయారట. వారి అన్వేషణలో నేను ఇక్కడ్నుండీ హిందూపురం వెళ్తున్నా" అన్నాడు వాడు.

"సుమిత్ర వృద్ధాశ్రమంలో ఉందా?" నిర్ఘాంతపోతూ ప్రశ్నించాను.

"చెప్పాను కద... నాలుగు సంవత్సరాల క్రితం వరకూ అని. నీకింకో సంతోషకరమైన వార్త ఏమిటంటే సుమిత్రమ్మగారు కూడా నీలాగే వివాహం చేసుకోలేదట" అంటూ అవతల ఫోను డిస్‌కనక్ట్ చేశాడు వాడు.

ఆనందమూ, విషాదమూ కలగలిసిపోయిన స్థితిలో బుర్ర మొద్దుబారిపోయింది నాకు.

✶ ✶ ✶

మొత్తానికి ఇరవైరోజుల తరువాత ఊడిపడ్డాడు తిలక్. "పెదనాన్నా, నీవు అనుకుంటున్నట్లుగా సుమిత్రమ్మ గారి జీవితం... ఒకనాటి ఒంటిచెట్టు వనం అయినట్లుగా లేదు" అన్నాడు.

"కాస్త అర్థం అయ్యేలా చెప్పరా"

"నీవు అనుకుంటున్నట్లుగా మనవళ్ళతో, మనవరాళ్ళతో ఆనందంగా లేదు ఆమె. అసలు ఆమె జీవితమంతా బాధల మయంగానే గడిచింది... గడుస్తోంది"

అన్నాడు తిలక్ ఉపోద్ఘాతంగా.

✶ ✶ ✶

అందరూ అనుకున్నట్లుగా సుమిత్రకు తన బావతో వివాహం జరిగిపోలేదు. ఎందుకంటే, సుమిత్రకన్నా ఎక్కువ అందంగా ఉన్న ఆమె చెల్లెలు సౌజన్యనే వివాహం చేసుకోగలనని తేల్చేశాడు అతడు.

సుమిత్ర అలా ఉండగానే ఆమె చెల్లి వివాహం బావతో జరిగిపోయింది. ఐదారేళ్ళలోపే తతిమ్మా ముగ్గురు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళూ అయిపోయాయి ఎలాగో.

పిల్లలకు ట్యూషన్లు చెప్పుకుంటూ తల్లిదండ్రులను చూసుకుంటూ గడిపేసింది సుమిత్ర.

తల్లిదండ్రులు ఒకరి తరువాత ఒకరు కాలం చెల్లిపోయాక, ఎక్కడో మిలటరీలో ఉద్యోగం చేస్తున్న తన బాబాయ్ కుమారుడు, అతని తల్లిదండ్రులకు దాపుగా ఉండమని అభ్యర్థించాడు సుమిత్రను.

వయసుమీరిపోతున్న స్థితిలో ఒంటరిగా ఉండలేక 'మానవసేవే మాధవసేవ' అనుకుంటూ వృద్ధాప్యంలో ఉన్న పిన్నీ, బాబాయ్‌లకు సేవలు చేస్తూ హిందూపురంలో పదిసంవత్సరాలు గడిపింది సుమిత్ర.

ముసలివాళ్ళు కాలం చెల్లేటప్పుడు తమకు చెందిన ఒక పాత రాతిమిద్దెను ఆమె పేరిట రాసిపోయారు.

ట్యూషన్లు చెప్పుకుంటూ ఆ చిన్న ఇంట్లో జీవితం గడుపుతున్న ఆమె దుస్థితిని, సెలవులో వచ్చినప్పుడు గమనించిన ఆమె బాబాయ్ కుమారుడు జాలిపడి ఆమెను తీసుకువెళ్ళి కరుణాశ్రమంలో చేర్చాడు. ప్రతి నెలా క్రమం తప్పకుండా అతని ద్వారా ఆశ్రమానికి డబ్బు అందుతుండేది.

దురదృష్టవశాత్తూ నాలుగేళ్ళ క్రితం కాశ్మీర్‌లో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో అతడు చనిపోవడంతో కరుణాశ్రమానికి డబ్బు అందడం ఆగిపోయింది.

అంతకాలం సుమిత్ర మంచితనాన్ని, వ్యక్తిత్వాన్ని గమనించిన ఆశ్రమ నిర్వాహకులు ఆశ్రమంలోనే ఉచితంగా ఉండిపొమ్మన్నారు.

కానీ ఆత్మాభిమానం కలిగిన సుమిత్ర ఆశ్రమం వదిలి హిందూపురం చేరుకుంది.

పాడుబడిపోబోతున్న రాతిమిద్దెను పరిశుభ్రపరుచుకుంది.

కానయితే కాలం ఎప్పుడో మారిపోయింది.

కాన్వెంట్లు, ఇంగ్లీషు మీడియం పాఠశాలలూ ఎక్కువయిపోయాక ట్యూషన్లకు వచ్చేవారు అరుదయ్యారు. వచ్చే కొద్దిమంది పిల్లలకు ట్యూషన్లు చెప్పుకుంటూ వత్తులు తయారుచేస్తూ, విస్తర్లు కుట్టుకుంటూ బ్రతుకుబండిని ఒంటరిగా ఈడ్వడం మొదలెట్టింది సుమిత్ర.

✶ ✶ ✶

శ్రద్ధగా వింటున్న నా కళ్ళలో నీళ్ళు తిరగడం చూసి చెప్పడం ఆపేశాడు వాడు.

పదినిమిషాలు భారంగా, నిశ్శబ్దంగా గడచిపోయాక ఒకే ఒక మాటన్నాడువాడు.

"పెదనాన్నా ఈ వయసులో నీకు ఓ తోడవసరం... అలాగే ఆమెకు కూడా ఖచ్చితంగా నీ నీడవసరం. చూస్తే ఇది దైవనిర్ణయంలా కన్పిస్తోంది"

✶ ✶ ✶

తరువాత ఘటనలన్నీ చకచకా కలలోలా జరిగిపోయాయి.

✶ ✶ ✶

నా జీవితంలో మొట్టమొదటిసారి తల వెంట్రుకలకు రంగు పడుతుంటే గమ్మత్తుగా అన్పించింది.

స్నానం చేశాక క్రీమ్ రాసుకుని తల దువ్వుకుంటూంటే అద్దంలో నా రూపం నాకే కొత్తగా నలభై అయిదేళ్ళ యువకుడి రూపంతో, పాతికేళ్ళ వయసు ఉత్సాహంతో గమ్మత్తుగా కన్పించింది.

తిరుమల కొండమీద సుమిత్రను చూసి నిర్ఘాంతపోయాను. తను రంగు వేసుకోకపోయినా చక్కటి కేశ సౌందర్యాన్ని కలిగి వుంది. అక్కడక్కడా నెరుస్తూ కన్పిస్తున్న వెంట్రుకలు సైతం ఆమెకు అదోరకమైన అందాన్ని ఆపాదిస్తున్నాయి. శరీరం, రంగు, రూపం అన్నీ సంపూర్ణ ఆరోగ్యంతోటే మెరుస్తూ కన్పిస్తున్నాయి.

శ్రీనివాసుని నీడలో మా కాటేజీల ముంగిట వేయబడ్డ షామియానాలకింద, మంగళ వాయిద్యాల మధ్యన, పిల్లలే విశాల హృదయాలతో పెళ్ళి పెద్దలైనవేళ ఒక అద్భుతంలా మా వివాహం జరిగిపోయింది.

ఇంటికి తిరిగివచ్చినా నాలుగు రోజులపాటు మమ్మల్ని విడివిడిగా రెండు గదులలోనే పడుకోనిచ్చాడు తిలక్ తతిమ్మా వారితో కలిసి.

ఐదవరోజు ఉదయాన్నే అన్నాడు తిలక్ నవ్వుతూ... “పెదనాన్నా ఈ రోజుతో మీ వయసెంత?”

వాడెందుకలా అడిగాడో నాకు అర్థంకాలేదు. లెక్కవేసుకుని... “డెబ్బయి ఏడు సంవత్సరాలా, ఏడు నెలలా, ఏడు రోజులు” అన్నాను.

“అందుకే ఈ రోజు మీ జీవితానికి పెద్దమ్మతో కలిసే భీమరథి” అన్నాడు వాడు ఆనందంగా.

ఇంటిల్లిపాదీ సంతోషంతో చప్పట్లు తట్టారు.

సుమిత్ర సిగ్గుపడి తన గదిలోకి వెళ్ళిపోవడం నా శరీరంలో ఏదో పులకింతను కలిగించింది.

✶ ✶ ✶

మల్లెల, అగరువత్తుల సువాసనలు మత్తెక్కిస్తుండగా... “ఈ వయసులో నాకీ పులకింతలేమిటి?” అంది సుమిత్ర నా కౌగిలిలో ఒదిగిపోతూ.

ఆమె కళ్ళు వింతగా మెరుస్తూ మత్తుగా ప్రకాశిస్తున్నాయి. ముఖారవిందంలో తన్మయత్వం... ఎక్కుపెట్టిన విల్లులా తయారవుతోంది అప్పటికే ఆమె ఒళ్ళు నా చేతుల మధ్యన.

“ఆ ప్రశ్నే నేను నిన్ను అడగాలనుకున్నాను. బహుశా మనసులకు... తద్వారా శరీరాలకు వృద్ధాప్యం ఉండకపోవచ్చు” అన్నాను తృప్తిగా.

“నాకూ అలాగే అనిపిస్తోంది” అంది ఆమె తన్మయంగా నాకేసి చూస్తూ.

ఆమె కళ్ళను ముద్దాడి అన్నాను...

“ఆలస్యంగా ఆరంభమైన మన జీవితానికి ఇక తిరుగుండదు... మనం తప్పకుండా సహస్రచంద్ర దర్శనాన్ని కూడా చేసుకోగలం”

పుష్పాలంకారంతో విరాజిల్లుతున్న తల్పం వద్దకు నేను ఆమెను తీసుకువెళ్ళానో, ఆమె నన్ను తీసుకువెళ్ళిందో తెలియని స్థితిలో దానిమీదకు చేరుకున్నాం. ఎప్పుడో ఏభై, ఏభై అయిదేళ్ళ క్రితం నాటి ఆఖరి అనుభూతి ఉవ్వెత్తున ఎగసిపడ్తూ మా మనసులనూ, శరీరాలనూ ఉద్విగ్నతలకు గురిచేస్తోంది అప్పటికే.

అది నా జీవితంలో... కాదు కాదు... మా జీవితాలలో సంపూర్ణమైన తొట్టతొలిరాత్రి...

హేట్స్ ఆఫ్, టు తిలక్! ✪

*(స్వాతి మాసపత్రిక, జూన్ 2010)*

# ఆత్మానందం

**మొ**న్నటిదాకా పదిమందినీ పచ్చసిరాతో శాసిస్తూ బ్రతికిన వాడ్నే అయినా... "జి.పి. రాజారావు, మేనేజింగ్ డైరెక్టర్" అన్న బోర్డున్న ఆ గదిముందు నాలుగైదు నిముషాల పాటు నిలబడక తప్పలేదు.

మొత్తానికి... అటెండరు వచ్చి "వెళ్ళండిసార్!" అన్నాడు తలుపు బార్లా తీసి పట్టుకుంటూ.

"ఓడలు బండ్లగును!" అన్న నానుడిని మననం చేసుకుంటూ లోనికి నడిచాను.

మీడియం సైజు గదే అయినా ఎ.సి. చెయ్యబడిందనీ అత్యాధునికమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కలిగివున్నదనీ గ్రహించాను.

ఖరీదైన టేబులు వెనుక రివాల్వింగ్ చెయిర్‌లో ఓ యువకుడు కూర్చుని ఉన్నాడు. చూడడానికి యువకుడిలా కన్పిస్తున్నా వయసు నలభై అయిదు ఏభయి మధ్య ఉంటుంది అని అన్పించింది నాకు.

నాకేసి నవ్వుతూ చూసిన అతడ్ని ఎక్కడో ఎప్పుడో చూసినట్లనిపించింది.

కానీ సరిగా స్ఫురణకు రావడం లేదు.

"రండి... కూర్చోండి!" అన్నాడతడు.

ఐదునిముషాల క్రితం నేను పంపించిన నా విజిటింగ్ కార్డు అతని చేతులలో ఉంది.

అతని పెదవులు చిరునవ్వును చిందిస్తున్నా నాకేసి చూస్తున్న అతని కళ్ళలో మాత్రం ఓ వింతభావన మెరుస్తూ కన్పించి నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది! పైగా నేను ముందే లోకల్ కొరియర్‌లో పంపివుండిన నా అప్లికేషను అతని టేబులు మీదకానీ, అతని ప్రక్కనే వున్న కంప్యూటర్ స్క్రీను మీద కానీ కన్పించక పోవడం నాకొంచెం నిరుత్సాహాన్ని, ఇబ్బందినీ కూడా కలిగించింది.

"సో! రిటయిర్ అయిపోయారన్న మాట!" అన్నాడతడు.

"మూడు మాసాల క్రితం!" అన్నాను కూర్చుంటూ.

అతడేం అనలేదు... ఏదో ఆలోచిస్తున్నాడు.

"జీతం ఎంత ఆఫర్ చేస్తున్నారు?" అంటూ దర్పంగా ప్రశ్నించాను.

వారివద్ద ఖాళీవున్న ఆ ఉద్యోగానికి అన్ని విద్యార్హతలతో పాటు అపారమైన అనుభవంవున్న నా లాంటివ్యక్తి పర్సనల్ ఆఫీసర్‌గా దొరకడం వాళ్ళ అదృష్టం అని నా నమ్మకం మరి.

కానీ...

"క్షమించాలి!" అన్నాడతడు.

అసంకల్పిత ప్రతీకారచర్యలా, అప్రయత్నంగా నా నోటిగుండా "ఈజాబ్ నాకు చాల అవసరం!" అన్నమాట వెలువడబోయింది. 'కానీ... చప్పున సర్దుకో గలిగాను.

"నా సర్వీసులో ఎక్కువసార్లు ఈ ఊరికి బదిలీల మీద వచ్చాను. అలా చాల సంవత్సరాలు ఇక్కడే గడచిపోయాయి. పైగా నా స్వంత ఊరికి బాగా దగ్గరగా ఉన్న ఊరయినందున ఇక్కడే స్థిరపడి పోయాను. అందువల్ల..." అంటూ అర్థోక్తిలో ఆపేశాను.

అంతా ఓపికగా విన్నాడు కానీ... కాస్త సున్నితంగానే అయినా... "సారీ సర్, మీకీ ఉద్యోగాన్ని ఇవ్వలేను!" అన్నాడు.

"కారణం తెలుసుకోవచ్చా?!" అని ప్రశ్నించాను.

"వెరీ సారీ!" అనేశాడతడు కాస్త ఖచ్చితంగా.

"ఇట్సాల్‌రైట్!" అంటూ నేను కుర్చీలోంచి లేచి ఆ గదిలోంచి, హుందాగానే వెలుపలికి వచ్చేశాను.

కానీ అప్పటికే నా మనసులో కొంత నిరాశ చోటు చేసుకుని నిస్పృహ కలిగిస్తోంది.

"అతడ్ని ఎక్కడ చూశానా?" అన్న ఆలోచన మాత్రం నా మనసులోంచి తొలగడంలేదు.

ఆటో ఎక్కి ఇల్లు చేరుకున్నాక కూడా నా ఆలోచనలు తెగలేదు... అతణ్ణి ఎక్కడ చూసిందీ గుర్తుకు రావడం లేదు.

"ఏమండీ, మా పెద్దన్నయ్య చిన్న కుమారుడు విశాఖలో కట్టిస్తుండిన ఇల్లు పూర్తయిందట... గృహప్రవేశానికి ఇన్విటేషన్ పంపుతూ విడిగా ఉత్తరం కూడా వ్రాశారు!" ఆనందంగా అంటూ ఎదురు వచ్చింది నా శ్రీమతి.

"భువనా! మనకంటూ ఓ ఇల్లు కట్టుకోకుండానే రిటయిర్ కూడా అయిపోయాను. మన పిల్లలకూ సరయిన ఫౌండేషన్ లేదింకా... ఇకనైనా మనం కాస్త జాగ్రత్తగా..."

నా మాటలు మధ్యలో ఉండగానే చిన్న బుచ్చుకుంటూ వెనుదిరిగి ఇంట్లోకి వెళ్ళిపోయింది నా శ్రీమతి.

నా మనస్సు చివుక్కుమంది... తను బాధపడ్తే నేను చూడలేను.

అయితే తన పుట్టింటి వాళ్ళలో ఆర్భాటంగా, అట్టహాసంగా ఉండడం కోసం తను ఎన్ని అనవసరమైన ఖర్చులు చేసినా లెక్కచెయ్యకుండా ఇంతకాలం సంతోషంగా భరించాను... కానీ... ప్రస్తుతం నేను రిటైర్ అయిన వాణ్ణి... పెన్షన్ తప్ప మరే ఆధారమూ లేనివాణ్ణి. పైగా వెనుకేసుకున్నది పెద్దగా లేకపోగా వచ్చిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అన్నీ చేసి వుండిన తప్పులకూ, అప్పులకూ సమర్పించుకున్న వాణ్ణి... ఇలా ఆలోచిస్తుండగా నా మనసులో ఓ చిన్న మెరుపు మెరిసినట్లయింది.

"పాతిక గంటల రాజారావు!" అని అనుకున్నాను.

మిష్టర్ జి.పి. రాజారావును ఈ వూర్లోనే ఎప్పుడు, ఎక్కడ చూసిందీ స్పష్టంగా జ్ఞాపకం వచ్చింది నాకు.

* * *

ఎప్పటి మాట? పాతికేళ్ళకు పైబడిపోయింది...

"పదిహేనో తేదీ...

మా అక్కకుమారుని నామకరణం జరగబోతోంది.

ఆ ఫంక్షన్‌లో మీరు నా ప్రక్కన లేకపోతే నా కస్సలు బావుండదు. పిల్లలు కూడా మిమ్మల్నడుగుతున్నారు. కాబట్టి వెంటనే బయల్దేరిరండి!" అంటూ ప్రతిరోజూ భువన నుండీ ఫోనుకాల్సు!

ఎక్కడి మచిలీపట్నం? ఎక్కడి ఘటోత్కచ పురం??

పచ్చని పల్లెటూర్లో పుట్టి పెరిగిన వాడ్నే అయినా మా దగ్గరి దాపులలో ఎక్కడా సముద్రం లేదు. ముందునుండీ కోస్టల్ ప్రాంతాలంటే చాల ఇష్టం నాకు. బాగా

దూరమైనా బందరు అమ్మాయిని కోరిమరీ చేసుకుంది కూడా అందుకే. ఆ తరువాత సంవత్సరంలో సగం రోజులు ఆవిడ పుట్టింటిలోనే ఉండిపోతూ నన్ను తనచుట్టూ త్రిప్పుకుంటూ కోస్తామీది నామోజును చాలవరకూ హరించివేయగలిగింది.

బాగా పై ఆదాయం లభ్యమయ్యే ఉద్యోగం కాబట్టి సరిపోయింది కానీ... లేకపోతే నా జీతం మా ప్రయాణాలు, ఖర్చులకు కూడా సరిపోయేది కాదు బహుశా.

తప్పనిసరిగా నిర్వహించవలసిన ఇంటర్వ్యూ ఒకటి పధ్నాలుగో తారీఖునాడు ఉండడం వల్ల వెంటనే బయల్దేరలేకపోయాను.

రొటేషన్‌లో జిల్లా ఎంప్లాయిమెంటు ఎక్చేంజివారి నుండీ అందిన పట్టికలోంచి నియామకం జరపాల్సిన ఉద్యోగం తాలూకు ఇంటర్వ్యూ అది. పైగా అప్పటికే నా ఇష్టంగా రెండుసార్లు వాయిదా వేశాను. రిటన్ టెస్ట్ కూడా అప్పటికే పూర్తయింది కాబట్టి మళ్ళీ వాయిదా వెయ్యడం సమంజసం కాదు.

అందువల్ల పధ్నాలుగో తేదీనాటి ఉదయాన్నే ఇంటర్వ్యూ అయ్యిందనిపించి, మధ్యాహ్నం నుండీ బయల్దేరి వెళ్ళి పదిహేనో తారీఖు మధ్యాహ్నంలోగా మచిలీపట్నం చేరుకోగలనని హామీ ఇచ్చాను నా శ్రీమతికి.

* * *

ఓరల్ కం ఫైనల్ ఇంటర్వ్యూనాటి ఉదయం పదిగంటలకు...

"శరత్‌బాబు! శరత్‌బాబు!!" అంటూ అటెండరు ఆరెప్ప నా గది వెలుపల పిలవడం లోపలున్న మాకు కూడా విన్పించింది స్పష్టంగా.

అరనిముషం తరువాత పాతికేళ్ళ యువకుడు గదిలోకి ప్రవేశించాడు. ముఖంలో తేజస్సు, కళ్ళలో కాంతి... మంచి తెలివైన యువకుడని తెలియజేస్తున్నాయి. మా కందరికీ నమస్కరించి మేం చూపిన కుర్చీలో కూర్చున్నాడు.

"వేరీజ్ మొహంజోదారో?" మొదలు పెట్టేశాడు మేనేజరు కాలయాపన కాకుండా.

"ఇటీజ్ ఇన్ లార్ఖానా డిస్ట్రిక్ట్, సింధ్ ఏరియా పాకీస్తాన్ సర్!" తడబాటు లేకుండా చప్పున బదులు చెప్పేశాడు అతను.

"తాజ్ నిర్మాణం ఎప్పుడు ప్రారంభం అయింది?" కమిటీ మెంబరు ప్రశ్నించాడు.

"పదహారు వందలా ముప్పై ఒకటవ సంవత్సరంలో ప్రారంభం అయి పదహారు

వందలా యాభయి మూడవ సంవత్సరంలో పూర్తయింది సర్!"

"రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజి ఎక్కడ ఉంది?" మరో కమిటీ మెంబరు ప్రశ్నించాడు.

"డెహరాడూన్లో ఉంది సర్!"

ఇంటలిజంట్ ఫెలో కాబట్టే వ్రాతపరీక్షలో కూడా మంచి మార్కులు సంపాదించ గలిగాడు.

అతనికేసి సూటిగా చూస్తూ "ఒక వారంలో ఎన్ని గంటలు పనిచెయ్యగలరు?" అని ప్రశ్నించాను.

"అరవయ్యారు గంటలయినా సంతోషంగా పని చెయ్యగలను సర్!"

అతని జవాబువిని మనసులోనే నవ్వుకున్నాను.

ఆదివారంపోగా తతిమ్మా ఆరురోజులూ రోజుకు పదకొండు గంటలపాటయినా సరే పనిచేస్తానని అంటున్న ఈ తెలివైన యువకుడు తనకు ఉద్యోగం దొరికిన పిదప ఒకటి రెండేళ్ళు గడచిపోతే రోజుకు కనీసం నాలుగైదు గంటలపాటయినా పనిచెయ్యకపోవచ్చు.

అదే ప్రభుత్వ కార్యాలయాలలో చాల చోట్ల కన్పించే మాయాజాలం.

"ఇక మీరు వెళ్ళవచ్చు!" అన్నాడు మేనేజరు.

అతడు నిష్క్రమించగానే "సదానందం! సదానందం!!" అంటూ ఆరెప్ప పిలుపులు చిన్నసైజు అరుపులలా విన్పించాయి వెలుపల.

ఏకోశానా ఆనందం అనేదే కన్పించని ముఖం కలిగివున్న ముప్పయి సంవత్సరాల యువకుడు గదిలోకి ప్రవేశించి మాకందరికీ నమస్కరించి కూర్చున్నాడు.

మేనేజరు ప్రారంభించాడు...

"విచ్ ఈజ్‌ద లాంగెస్ట్ రోడ్ ఇన్ ఇండియా?"

"గ్రాండ్ ట్రంక్ రోడ్ సర్!"

"మిట్టూరు ప్రాజెక్టు ఎక్కడుంది?"... కమిటీ మెంబరు ప్రశ్న

"తమిళనాడులో సర్!"

"గ్లాస్ వాటర్ ఫాల్స్ ఎక్కడుంది?"

"బ్రెజిల్‌లో!" అని చెప్పలేకపోయాడతడు.

"వారంలో ఎన్ని గంటలు పనిచెయ్యగలరు?" అని ప్రశ్నించాను.

"డెబ్బయిగంటలు పనిచెయ్యగలను!" ఉత్సాహంగా అన్నాడతను. అప్పుడతని హుషారు చూసి నవ్వుకున్నాను.

అతడు వెలుపలికి వెళ్ళగానే "ప్రత్యూష! ప్రత్యూష!!" అన్న పిలుపులు విన్పించాయి వెలుపల.

పద్దెనిమిది సంవత్సరాల అమ్మాయిలా లేతగా కన్పిస్తున్న ఇరవయి మూడేళ్ళ యువతి లోపలికి ప్రవేశించి మాకు నమస్కరించింది.

పేరేకాదు చూపులకు కూడా చాల అందంగా ఆకర్షణీయంగా ఉదయసుందరిలాగే కన్పిస్తోంది ఆమె.

రిటన్ టెస్టులో అత్యధిక మార్కులు పొందిన ఇద్దరిలో ఆమె ఒకరు.

"వాట్ హాపెన్డ్ ఇన్ ఎయిటీన్ ఫిఫ్టీత్రీ ఏప్రిల్?"

ఉత్సాహంగా ప్రశ్నించాడు మేనేజర్.

"ది ఫస్ట్ రైల్వేలైన్ ఇన్ ఇండియా ఫ్రం బొంబే టూ టానా ఓపెన్డ్ సర్!" వీణ సవరింప బడ్తున్నట్లున్న స్వరంతో జవాబు చెప్పింది ఆమె.

"ఇండియన్ ఆర్మీ మొట్టమొదటి కమాండర్ ఎవరమ్మా?"

"జనరల్ కరియప్ప సర్!"

"అత్యధిక జనాభాగల మన నగరమేది?"

"కలకత్తా సర్!"

"వారానికి ఎన్ని గంటలు పని చెయ్యగలరు?" అంటూ నా ప్రశ్న నేనూ సంధించాను ఆమె కళ్ళలోకి చూస్తూ.

"దాదాపు ఏభయి గంటలు సర్!"

ఆమె గదిలోంచి వెళ్ళిపోగానే...

తరువాత వచ్చిన వ్యక్తి హరికిషన్.

ఉత్తర, దక్షిణలతో వచ్చిన వ్యక్తయినందున అతన్ని కాస్త సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టారు.

రొటీన్‌గా వెయ్యబడ్డ ప్రశ్నలలో ఒక్కదానికయినా సరయిన సమాధానం లేదు అతని వద్దనుండి.

రావనీ, రాబట్టలేమనీ తెలుసు... అయినా చివరగా నా ప్రశ్న నేనూ వేశాను...

"వారంలో ఎన్ని గంటలు పని చెయ్యగలరు?"

"నూట నలభై గంటలయినా పని చెయ్యగలను సార్!"

మూగవాడు అమ్మా అన్న చందాన కనీసం నా ప్రశ్నకయినా... ఆదివారంతో కలుపుకుని రోజుకు ఇరవయి గంటలయినా పనిచెయ్యగలవని ధీమాగా చెప్పగలిగినందుకు ఆనందించాను. అతన్ని అభినందించాను!

ఆ జవాబుకే అతనికి ఉద్యోగం ఇవ్వవచ్చు!!

అతని తరువాత సృజన అనే అమ్మాయి పిలువబడింది. ప్రశ్నలన్నింటికీ సంతృప్తికరమైన సమాధానలే ఇవ్వగలిగింది. కానీ వ్రాత పరీక్షలో మాత్రం మార్కులు సరిగ్గా రాలేదు ఆమెకెందుకో?!

నా ప్రశ్నకు జవాబుగా నలభై ఎనిమిది గంటలు పనిచెయ్యగలనని ఆచి, తూచి ప్రత్యుత్తర మిచ్చింది ఆమె.

చిట్టచివరగా గదిలోకి వచ్చిన వ్యక్తి జి.పి. రాజారావు.

"వేర్ ఈజ్ ద ఏన్షియంట్ స్టాచ్యూ ఆఫ్ జీసస్?" మేనేజరు ప్రశ్నించాడు... హుందాగా కూర్చున్న ఆ పాతికేళ్ళ యువకుడ్ని.

"ఎట్ ఒలంపియా సర్!"

"విచ్ ఈజ్‌ది హైయ్యెస్ట్ మౌంటెన్ ఇన్‌ది వరల్డ్?" ఎందుకో రెండవ ప్రశ్న కూడా అడిగాడు మేనేజరు.

"ఎవరెస్ట్... లోకేటెడ్ ఎట్ నేపాల్ సర్!" స్థిరంగా ఉంది అతని జవాబు.

"ప్రపంచ పురాతనమైన ఏడు వింతలలో భారత దేశానికి చెందిన వింత ఏది?" మంచి ప్రశ్న సంధించాడు కమిటీ మెంబరు.

"క్షమించాలి సర్... ప్రపంచ పురాతనమైన ఏడు వింతలలో మనదేశానికి చెందినది ఏదీ లేదు... ప్రపంచపు ఇతర వింతలలో మాత్రం మన తాజ్‌మహల్

కూడా ముఖ్యమైనది!" చాల డీటెయిల్డు జవాబు సునాయాసంగా ఇవ్వగలిగాడతడు.

"మెషనరీ ఎక్విప్‌మెంట్ ఇండ్రస్ట్రీస్ అత్యధికంగా కలిగివున్న దేశం ఏది?" మరో కమిటీ మెంబరు ప్రశ్నించాడు.

"జకోస్లోవేకియా సర్!"

వ్రాత పరీక్షలో అత్యధిక మార్కులు పొందిన ఇద్దరిలో ఒకరైన అతన్ని ఎన్ని ప్రశ్నలడిగినా మౌఖిక జవాబులు కూడా స్పష్టంగా, నిర్దిష్టంగానే ఉంటాయి... అని అనుకుంటూ నా ప్రశ్న నేనూ సంధించాను...

"వారంలో ఎన్ని గంటలు పని చెయ్యగలరు?"

"పాతిక గంటల వరకూ చెయ్యవచ్చుసార్!" తడుముకోకుండా జవాబు చెప్పాడు.

"ఏమిటీ?" అంటూ కళ్ళు కాస్త పెద్దవి చేసి ప్రశ్నించాడు మేనేజరు... అతని స్వరంలో ఇంచుక ఆశ్చర్యం కూడా ఉంది.

"వాస్తవమే చెప్తున్నాను సర్. వారానికి పాతిక గంటల వరకూ పనిచెయ్యగలను. అంతకన్న ఎక్కువ సమయం పనిచెయ్యడానికి బహుశా ప్రస్తుత సాంఘిక, సామాజిక పరిస్థితులలో సాధ్యం కాకపోవచ్చు!"

అతని జవాబు అందరికీ చిరాకు తెప్పించినట్లు ముఖకవళికలే తెలియజేస్తున్నాయి.

అయితే మేనేజరు ఏ కాస్తయినా ఎక్సయిట్ కాకుండా చాలా బ్యాలన్సుగా ప్రశ్నించాడు.

"తమరు యే పరిస్థితులను పరిగణనలోనికి తీసుకుని వారానికి పాతిక గంటలు పని చెయ్యగలమని సెలవిస్తున్నారు?"

"ఏడు రోజుల వారంలో ఆదివారం ఖచ్చితంగా సెలవుసర్! నెలకో రెండవ శనివారం తప్పనిసరి సెలవు. పండుగలకూ పబ్బాలకూ ప్రభుత్వ సెలవులు వస్తూనే ఉంటాయికద? ముందే ప్రకటించిన సెలవులు కాక హఠాత్తుగా ప్రభుత్వం సెలవు ప్రకటించగల పండుగో ఓ మహనీయుడి జన్మదినమో, హఠాత్మరణ దినమో లేక సాధారణ మరణ దినమో ఏదో ఒకటి వచ్చి పడ్తూనే ఉంటాయి అడపా దడపా.

అంతేగాక ఉద్యోగికి అత్యవసర సెలవులు, ఆప్షన్ సెలవులు, ఆర్జిత సెలవులు, అర్ధ జీతపు సెలవులు, కమ్యుటెడ్ మెడికల్ సెలవులు మొదలైనవన్నీ ఉండి తీర్తాయి

కద? వాటిలో కొన్నింటినయినా ఉపయోగించుకోకా తప్పదు కద?

వీటికి తోడు మనుషులు విశృంఖలమైన వ్యక్తి స్వేచ్ఛ ననుభవించగలుగుతున్న మన దేశంలో మనకు బంద్‌లు, సమ్మెలు, రాస్తారోఖోలు, కార్యాలయాల ముట్టడులు మొదలైన వాటికి కూడా కొదవ లేదు కదా?! వీటన్నింటినీ బేరీజు వేసుకుంటే వారానికి ఎన్ని గంటలు పని చెయ్యగలరు?

పోనీ ఓ వారమంతా యే ఆటంకమూ లేకుండా పనిజరిగినా అప్పుడూ మళ్ళీ అదో వింత పరిస్థితి కదా?

ఉద్యోగులలో ఎక్కువమందికి ఉదయం కార్యాలయానికి పాతిక నిముషాల ఆలస్యంగా రావడం, సాయంకాలం పావు గంట ముందుగా వెళ్ళిపోవడం అలవాటు! మధ్యలోనా?... రెండుసార్లు టీకి వెళ్ళి రావడం, న్యూస్ పేపర్ తిరగెయ్యడం, నాలుగుసార్లు నీళ్ళగదికి వెళ్ళిరావడం, ఎనిమిది సార్లు ఆఫీసుఫోనుకు వచ్చే స్వంతకాల్స్ రిసీవ్ చేసుకోవడం మొదలైనవెన్నో ఉంటాయి కద? అలాంటి వారు పనిచేసే వారినీ చెయ్యనివ్వకుండా హింసిస్తుంటారు కదా?

కాబట్టే వారానికి పట్టుమనిపాతిక గంటలకన్నా ఎక్కువ పనిచెయ్యగల ప్రభుత్వోద్యోగులు అరుదయిపోతున్నారు సార్! రేపు నేనయినా...?!"

సుదీర్ఘమైన బౌద్ధిక్ అందించిన అతగాడు ఊపిరి తీసుకోవడానికి కాస్త ఆగాడు. అతని మాటలలో ఫన్ ఉందో, సిన్సియారిటీ వుందో కనిపెట్టలేకపోయాను.

కానీ, తన భావాలపట్ల తనస్వరంలో విన్పించిన, కళ్ళలో కన్పించిన విశ్వాసాన్ని గుర్తించగలిగాను.

"చాలా అతిశయోక్తులు చెప్తున్నావు!" అన్నాడు కమిటీ మెంబరు కాస్త కోపంగా.

అతడు మౌనం వహించాడు... కానీ... అతని దరహాసం మాత్రం చెక్కు చెదరలేదు.

"ఇంతకూ నీకీ ఉద్యోగం వస్తుందో, రాదో చెప్పగలవా?" అంటూ గమ్మత్తయిన ప్రశ్న వేసేశాడు మరో కమిటీ మెంబరు కాస్త ఉడుక్కుని.

నిజానికి అతడా ప్రశ్న అడిగి ఉండకూడదు.

"ఈ ఉద్యోగం ఖచ్చితంగా నాకు రాదని తెలుసు సర్!" అన్నాడతడు చిన్నగా నవ్వి.

"రాదని తెలిసీ మరి తమరు విజయం చెయ్యడమెందుకో?"

తను బ్యాలన్సు కోలుపోతున్నానని గ్రహించేలోపే అసంకల్పిత ప్రతీకార చర్యలా కమిటీ మెంబరు నోటిగుండా వెలువడిపోయిందా ప్రశ్న.

"నిజానికి మీరీ ప్రశ్న వెయ్యకూడదు సర్! కానీ వయసులో మీరు నాకన్నా బాగా పెద్దవారు. పెద్దవాళ్ళను గౌరవించడం మనదేశ సంస్కృతి కాబట్టి జవాబు చెప్తున్నాను... అవకాశం వచ్చిన ప్రతి ఇంటర్వ్యూకు హాజరవడం అనేది క్రమశిక్షణ కలిగివున్న ప్రతి నిరుద్యోగికీ దైవకార్యం వంటిది. పోతే నా ఎబిలిటీని నేను ప్రతి ఒక్కచోటా నిరూపించుకోవడం ద్వారా పొందగలిగే ఆత్మానందం చాల గొప్పది, వెల కట్టలేనిది!" అన్నాడతడు సావధానంగా, ప్రశాంతంగా.

ఇబ్బందికరంగా మారిన ఆ పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నంలో...

"మీకు ఈ ఉద్యోగం లభిస్తే డ్యూటీ ఎలా చేస్తారు?" అని ప్రశ్నించాను.

"దేశభక్తితో, పూర్తి విశ్వాసంతో, అంకిత భావంతో, నిజాయితీగా నా విధులను నేను నిర్వర్తించగలను!"

అంత అద్భుతమైన జవాబు విన్న తరువాత కూడా అతనికి నేను ఉద్యోగం ఇవ్వలేక పోయాను. అతనికే కాదు అతనిలో సరిసమానంగా పోటీపడ్డ ప్రత్యూషకు కూడా!

హరికిషన్‌కు ఆర్డర్సు వేసేసి బందరుకు బయల్దేరి వెళ్ళిపోయాను.

✶ ✶ ✶

ఆనాటి తరువాత అతణ్ణి... ఇంతకాలానికి ఇంత గొప్ప స్థితిలో చూడాల్సి వచ్చింది. కానీ... దురదృష్టవశాత్తూ నా ప్రస్తుత పరిస్థితి వేరు!!!

సంవత్సరాల తరబడి నేను రెండు చేతులా సంపాదించినదంతా నాలుగు చేతుల దేవతా స్త్రీలా దర్జాగా ఖర్చుచేసేస్తూ గడిపింది నా శ్రీమతి. తన వాళ్ళలో ఘనంగా వెలగాలి అన్న ఆలోచన తప్ప అంతకు మించిన ముందుచూపు లేకపోయింది ఆమెకు. నా భార్యను సంతోషపెట్టడమే నా జీవన పరమావధి చేసేసుకున్నానని నన్ను నిందిస్తూనే నా వైపు వారూ నన్ను వీలయినంతమేర పీక్కుతిన్నారు.

చివరికి...

"అన్యాయార్జిత విత్తం దశవర్షాని జీవితం

అథవా... ద్వాదశ వర్షాని... సహమూలం వినశ్యతే!!"

అన్నట్లుగా ఎలా వచ్చింది ఎలా పోయిందో తెలియకుండా పోయింది... ప్రాణాలు పోలేదంతే!

అందుకే రిటైర్ అయి మూడు మాసాలయినా కాకమునుపే హాయిగా ఇంటి పట్టున విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో ఉద్యోగం వేటలో పడాల్సి వచ్చింది.

ఖర్మగాకపోతే మొట్టమొదటి ప్రయత్నమే ఈ రాజారావువద్ద... "అవునూ... ఈ రాజారావు... ఎలా??..."

ఆలోచిస్తూ కూర్చోలేకపోయాను. లేచి టేబులు వద్దకు వెళ్ళి టెలిఫోన్ డైరెక్టరీలో "ప్రత్యూషా ఇంపోర్టర్స్ అండ్ ఎక్స్‌పోర్టర్స్" కంపెనీ నెంబర్లు చూసి ఎం.డి. నెంబరు డయల్ చేశాను.

"మిష్టర్ రాజారావ్! ఒక చిన్న ప్రశ్న!!" అన్నాను అతడు లైన్‌లోకి రాగానే.

అతడూ నా స్వరం గుర్తుపట్టి "అడగండి!" అన్నాడు.

"ఆనాడు నా వద్దకు ఉద్యోగార్థివై వచ్చావు... ఇంత తక్కువ వ్యవధిలో ఓ ఎంప్లాయర్ స్థాయికి ఎలా ఎదిగావు?"

అతని నవ్వు విన్పించింది మొదట... తరువాత...

"డబ్బు తప్ప మరో ప్రపంచం ఎరుగని మీలాంటి అధికారుల చుట్టూ ఇంటర్వ్యూల పేరిట తిరుగుతున్న రోజులలోనే నేను రోజుకు పద్దెనిమిది గంటలు పని చేసేవాడ్ని.

తెల్లవారు ఝామునే చలిలో సైకిలు మీద క్యాన్లు పెట్టుకుని చుట్టు ప్రక్కల పల్లెటూర్లకు వెళ్ళి పాలు సేకరించుకు వచ్చి పాలడిపోలలో వెయ్యడం, ఇళ్ళకు వెళ్ళి పిల్లలకు ట్యూషన్లు చెప్పడం, పత్రికలు, పుస్తకాలు అమ్మే దుకాణాలకు పత్రికల కట్టలు చేర్చడం, వ్యాపార దుకాణాలలో, వస్త్రదుకాణాలలో రోజువారీ పద్దులు వ్రాయడం, నైట్ క్లబ్‌లో పార్టుటైం వెయిటర్‌గా పనిచెయ్యడం... ఒక్కటేమిటి? దొరికిన ప్రతి పనినీ దైవకార్యంగా భావిస్తూ అంకిత భావంతో చేసేవాడ్ని! వయసుకు మించిన కష్టం పడ్డాను నిజానికి!!

అందుకే నిజాయితీ అనే పునాది మీద, శారీరక, మానసిక పరిశ్రమలనే గోడలతో, సత్ప్రవర్తన అనే కప్పుతో వెలసిన "ఆత్మానందం" అనే ఓ చక్కటి భవంతి నాకు నీడనిచ్చి ఉన్నతుడిగా నన్ను మలచగలిగింది" అన్నాడు.

అతని స్వరంలో అంతులేని ఆత్మ విశ్వాసం ధ్వనిస్తోంది.

"రాజారావ్, మరో ప్రశ్న... మీ కంపెనీ పేరు...?"

"మీ అనుమానం అర్థమైంది... ఆ రోజు మీ ఆఫీసుకు ఇంటర్వ్యూకు హాజరైన ప్రత్యూషే!... ఆ రోజే మా తొలిపరిచయం.

"ఇరువురి భావాలూ, ఆలోచనా విధానాలూ ఒక్కటేనని క్రమంగా తెలుసుకున్నాం. కష్టాలూ, సుఖాలూ, బరువులూ, బాధ్యతలూ పంచుకుంటూ వచ్చాం.

మా పెళ్ళయ్యాక... ఇంటిమీద ఫౌల్ట్రీఫాం... ఇంటి వెనుక కొట్టాలలో పశువులు! ప్రత్యూష, మాస్టర్ ఆఫ్ కామర్స్... కోళ్ళనూ, ఆవులనూ చూస్తూ పేడకూడా వృధా కాకుండా స్వయంగా పోగుచేస్తుండేది.

వీలు చిక్కినప్పుడు పిడకలు చెయ్యడం, ఎండిపోయిన పిడకలను పాత సంచులకు వేసి ఉంచడం, ఆ తరువాత వాటిని అమ్మడం!! ఆమె ఆలోచనా విధానం అబ్బురపరచేది, నాకు మార్గదర్శకం అయ్యేదికూడా.

పశువుల క్రింద త్రొక్కుడు గడ్డి, పేడ, చెత్త మొదలైనవి ఆమె శ్రమతో క్రమంగా ఎరువు దిబ్బలుగా మారిపోతుండేవి.

పిడకలు, ఎరువు దిబ్బలు అమ్మగా వచ్చేడబ్బు విడిగా పోగయి ఆమెకో స్కూటీ, నాకో మోటారుసైకిలు కొనుక్కోగలిగిన శక్తినిచ్చాయి. క్రమంగా పాడి పెరిగింది. కోడి గ్రుడ్లకూ డిమాండ్ ఏర్పడుతూ వచ్చింది. కొందరు నిరుద్యోగులకూ పనులు కల్పించగలిగాము. వ్యవస్థ ఏర్పడుతూ వచ్చింది. ఆత్మవిశ్వాసంతో తేనెటీగల్లా కష్టపడ్తూ మా రక్తాలను చమటలుగా ధారపోసి సంపాదించి కూడగట్టుకున్న డబ్బుతో ఈ కంపెనీ ప్రారంభించాం.

కష్టపడి ఓ స్థానం సంపాదించుకోవాలనుకునే వారెవరూ విదేశాలకుకానీ, పరరాష్ట్రాలకు కానీ, కనీసం పొరుగు జిల్లాలకు కూడా వలస వెళ్ళాల్సిన అవసరం అస్సలులేదు అన్న ప్రత్యూష సిద్ధాంతం వాస్తవం అయింది అందువల్లే..."

అవతల్నుండీ... అతడింకా ఏదో చెప్తూండగానే రిసీవర్ క్రెడిల్ చేసి అన్యమనస్కంగా హాల్లోంచీ వెలుపలికివచ్చి వరండా మెట్లుదిగి వీధి గేటువద్దకు నడచి... ఎర్రటి ఎండలోనే... గేటువద్ద నిలబడ్డాను.

దారిన పోతున్న ఓ పడుచు బిచ్చగత్తె నన్ను చూసి చప్పున ఆగి...

"తాతా ఓ రూపాయి ఇప్పించవూ?!" అంది.

నేను మనసులో ఉలికిపడి మౌనంగా వెనుదిరిగి, నెరిసిపోతున్న మీసాలను

తడుముకుంటూ వెళ్ళి హాల్లో అడుగు పెట్టాను.

ఇన్విటేషనూ, ఉత్తరమూపట్టుకుని లోపల్నుండీ హాల్లోకివస్తూ కన్పించింది భువన.✪

*(వెలుగు, మాసపత్రిక జనవరి 2010)*

# అంతకు మించిన ఆలోచన...

**మొ**లకల చెరువునుండీ మోటారు సైకిలుమీద మదనపల్లెకు రావడం ఎంతసేపు? ట్రాఫిక్ డిస్టబెన్స్ లేకపోతే ఒకటింపావు గంట... ఉంటే... ఒకటిన్నర గంటే కద?

పెందలాడే బయల్దేరాను కాబట్టి సకాలంలోనే చేరుకున్నాను. సత్తిగాడయితే అప్పటికే వాయల్పాడు నుండీ బస్‌లో వచ్చేసి గణేష్ హోటల్ దగ్గర ఎదురు చూస్తున్నాడు.

రవికిరణ్, బుచ్చిబాబులే అంతఖరీదయిన కార్లోనూ చెప్పిన సమయానికి అరగంట ఆలస్యంగానే వచ్చారు బెంగుళూరు నుండీ.

గణేష్ హొటల్లోనే ఫ్యామిలిరూమ్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్లు పూర్తిచేశాం.

"మీరిద్దరూ కూడా రండి... సరదాగా వెళ్ళి వద్దాం. మళ్ళీ ఇటే వచ్చి మిమ్మల్నిక్కడ దింపి మేమిటే బెంగుళూరు వెళ్తాం" అన్నాడు బుచ్చిబాబు.

వాడు కర్ణాటకలో పేరుమోసిన ఇండ్రస్ట్రియలిస్టిప్పుడు. మమ్మల్ని చూడాలనే చింతామణి మీదుగా ఇలా వచ్చాడు... రవికిరణ్ గాడ్ని కూడా వెంటదీసుకుని. లేకపోతే నేషనల్ హైవే నంబర్ ఫోర్‌లో వెళ్ళిపోయుండేవారు కోలారు, ముల్‌బాగల్‌ల మీదుగా.

మరి మేమందరం మదనపల్లెలో పుట్టి పెరిగిన వాళ్ళం.

"ఇప్పుడు రాలేం లేరా!" అన్నాను సున్నితంగా

"మరోసారి ఎప్పుడైనా కలిసి వెళ్దాంలే!" అని అనేశాడు సత్తిగాడు కూడా.

ఎందుకంటే మా సాధక బాధకాలు మాకున్నాయి. అప్పటికప్పుడు ఎక్కడికీ బయల్దేరలేం.

"మా పని అక్కడ ఒక్కరోజేరా... రేపు సాయంకాలానికి మిమ్మల్నిక్కడ దింపేసి వెళ్తాం మళ్లీ!" అన్నాడు రవికిరణ్.

మేం మధ్య తరగతి మందహాసాలతో సున్నితంగా తిరస్కరించేశాం.

హోటల్‌లో బిల్లు చెల్లించి వెలుపలికి వచ్చాం.

ముందు నేను నడుస్తున్నాను. నా వెనుకనే సత్తిగాడు...

మా వెనుకగా నడచి వస్తున్న రవికిరణ్, బుచ్చిబాబులు హఠాత్తుగా నవ్వడం విన్పించింది.

'ఎందుకా?' అని అనుకుంటూ వెనుదిరిగి చూశాం మేం ఇరువురం.

నేనయితే నా ప్యాంట్ జిప్ పెట్టుకున్నానో, లేదో చెక్ చేసుకున్నాను. ఎందుకంటే... నేను సదా నీట్‌గా టక్ చేసుకుని, షూ తొడుక్కుంటాను కానీ... అప్పుడప్పుడు పేంటు జిప్ బిగించుకోవడం మరచి పోతుంటాను.

"ఎందుకురా అలా నవ్వుతున్నారు?" అని అడిగాడు సత్తిగాడు.

"ఒరేయి... ముందు రాజారావు గాడు తొక్కిపోయాడు. వాడి వెనుక నీవు తొక్కిపోయావు... ఇద్దర్లో ఒక్కరైనా చూడలేక పోయారు. కానీ మేమిద్దరం చూశాం. మొదట వంగిన నా చేతికందింది!" అంటూ మళ్ళీ నవ్వి తనకు దొరికిన వెయ్యి రూపాయల నోటును ఎడం చేత్తో పట్టుకుని కుడిచేత్తో దుమ్ము విదిలించి జేబులో పెట్టుకున్నాడు రవికిరణ్.

రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో కర్నాటకలో కోట్లు గడించిన రవికిరణ్ గాడికి దొరకకపోతే ఆనోటు కాస్తా ములకల చెరువులో ప్రయివేటు స్కూలు టీచరుగా పనిచేసుకు బ్రతుకుతున్న నాకో, వాయల్పాడు ప్రయివేటు హాస్పిటల్‌లో లాబ్‌టెక్నీషియన్‌గా బ్రతుకు ఈడ్చుకొస్తున్న సత్తిగాడికో దొరక కూడదా అని అన్పించింది.

అంతకు మించిన ఆలోచన నా కప్పుడు కలుగలేదు!

"ఇక వెళ్ళొస్తాంరా... మళ్ళీ చెన్నయ్ వెళ్ళాల్సి వస్తే ఇదే విధంగా ఈ దారినే వచ్చి మిమ్మల్ని కలిసివెళ్తాం!" అన్నాడు బుచ్చిబాబు కారుడోర్ తీసి స్టీరింగ్ దగ్గర కూర్చుంటూ.

"ఒరేయి సత్తీ, ఈ రాజారావు గాడ్ని పట్టుకుని బెంగుళూరు వచ్చెయ్యరా... రెండ్రోజులు సరదాగా గడుపుదాం!" అన్నాడు రవికిరణ్... ఇటువైపు డోర్ తీసి సీట్లో కూర్చుంటూ.

"వీలు చూసుకుని తప్పకుండా వస్తాంరా!" అన్నాడు సత్యనారాయణ మనస్ఫూర్తిగా.

కార్లో వాళ్ళు చిత్తూరు రోడ్డుకేసి వెళ్ళిపోయాక నేను సత్తిగాడ్ని తీసుకు వెళ్ళి వాయల్పాడు మీదుగా వెళ్ళే తిరుపతి బస్ ఎక్కించాను.

తరువాత సూపర్ బజార్లో కొన్ని సరుకులు తీసుకుని మోటార్ సైకిల్ ట్యాంకు కవర్ బ్యాగులో, సైడు బాక్సులో సర్దుకుని తిరుగు ప్రయాణం అయ్యాను.

ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న ఇండియన్ ఆయిల్ బంకులో పెట్రోలు వేయించుకున్నాక మోటారు సైకిల్ని కదిరి రోడ్డుమీదికి పోనిచ్చాను.

దారి పొడుగునా ట్రాఫిక్ ఎక్కువగానే ఎదురవుతుండడం వల్ల కాస్త నెమ్మదిగానే నడపసాగాను... "టైం ఈజ్ ప్రెషియస్... బట్... లైఫ్ ఈజ్‌మోర్!" అని అనుకుంటూ విశ్వం ఇంజనీరింగ్ కాలేజీకి కాస్త అవతలగా నడచి వెళ్తున్న ఓ బక్కమనిషి నా బండి శబ్ధం విని వెనక్కి తిరిగి కాస్త ఆగి ఆశగా, దీనంగా చూశాడు నాకేసి.

నేను వేగం తగ్గించి అతని ప్రక్కగా ఆపుతూ ప్రశ్నించాను...

"ఎంతదాకా వెళ్ళాలి?"

"బురకాయల కోటన్నా!" అన్నాడు అతడు కాస్త నీరసంగా.

"కూర్చో, నేనూ అటే వెళ్తున్నాను!" అన్నాను.

"నారాయణా, శ్రీరామచంద్రమూర్తీ" అని అంటూ అతడు నా వెనుక కూర్చున్నాడు.

దాదాపు పాతిక నిముషాలపాటు మౌనంగా మోటారు సైకిల్ను ముందుకు పోనిచ్చాను. వెనుక కూర్చున్న అతడూ బెల్లంకొట్టిన రాయిలా మౌనంగా కూర్చున్నాడు.

మల్లూరివారిపల్లె దగ్గరున్న తుమణంగుంట రైల్వేగేటు వేసి వుండడం వల్ల బైకు ఆపాను.

"ఎందుకు నడిచి వస్తున్నావు?" అని యధాలాపంగా ప్రశ్నించాను.

"జేబులో డబ్బు ఎక్కడో పడిపోయిందయ్యా... అది చూసుకోకుండా బస్సెక్కేశాను. డబ్బు పోయిందంటే ఎవరూ నమ్మలేదు బస్‌లో. దొంగోడనుకున్నారో యేమో?... అక్కడ దార్లో దింపేశారయ్యా!" అన్నాడతడు కొద్దిగా బాధ ధ్వనిస్తున్న స్వరంతో.

అతనికేసి పరీక్షగా చూశాను.

ప్రపంచానికి అన్నం పెడ్తున్న బక్కరైతు. అతడు నికార్సయిన నిజం చెప్పినా బస్‌లో జనం నమ్మలేదు.

బస్‌లోనే కాదు... ఎక్కడైనా సరే అన్నదాత పరిస్థితి అవిశ్వసనీయంగానే ఉంది ప్రస్తుతం.

"ఎంత పోగొట్టుకున్నావు?" అని యథాలాపంగానే అడిగాను.

"వెయ్యి కాయితమయ్యా!" అన్నాడతడు బాధగా.

నా మనసులో ఏదో చిన్న ఉలికిపాటుతో కూడిన కదలిక.

"ఎక్కడ పోగొట్టుకున్నావు?" అని ప్రశ్నించాను అతన్నే పరీక్షగా చూస్తూ.

"మదనపల్లెలోనయ్యా... గణేష్ హోటల్లో రెండిడ్లీలు, దోశ తిని కాపీ త్రాగానయ్యా. వెయ్యి రూపాయలిస్తే చిల్లర లేదన్నాడు హోటలతను. వెయ్యిగాక నా దగ్గరున్న రూకలు చూసుకుంటే హోటల్ బిల్లుకు రెండ్రూపాయలకు తక్కువుంది. రెండ్రూపాయల తక్కువ బిల్లుతోటే బిల్లు తీసుకున్నాడు హోటలాయప్ప.

ఆనక నేరుగా బస్టాండుకొచ్చి బస్సెక్కాను. ఎనకాల సీట్లో కూర్చున్న నా దగ్గరకు కండక్టరు నిదానంగా వచ్చారు. అప్పుడు చూసుకుంటే జేబులో నోటు ఎక్కడో పడిపోయిందని తెలిసింది. బస్‌లో జూస్తే తెలిసిన వారెవరూ లేరు. ఉన్నవాళ్ళు ఎవరూ నా మాట నమ్మలేదు.

అక్కడికీ బస్ దిగంగానే మిఠాయి కిట్టన్న అంగట్లో ఇప్పిస్తానని చెప్తి. కండక్టరు ఇనలా. మధ్యలో దించేశాడు. నీవు దేవుడిలా వచ్చి నీ బండ్లో కూర్చోబెట్టుకుంటివి... లేకపోతే మద్దాన్నందాకా నడవాల్సిందే గద?!" అన్నాడతడు.

"మదనపల్లెకేం పనిమీద వచ్చావు?"

"టమేటా గంపలేసుకుని వస్తిమన్నా. ఆరుమంది జనాలు కలిసి ట్రాక్టరుకు మా అందరి గంపలెత్తుకుని తెల్లారగట్టే వచ్చేస్తిమి. ఏమిరేటులేన్నా... దళారులు బతికే రేటు! వెయ్యి కాగితం చేతికొచ్చె. డ్రయివరేమో కొంచెం రిపేరు చేయించుకోవాలని చెప్పె. నాకా ఈ రోజు వంకాయచెట్లకు నీళ్ళు పట్టాల్సిన పని.

అందుకే ట్రాక్టరు ట్రాలిలో ఖాళీ గంపలేసేసి నేను మదనపల్లె పెద్ద బజార్లోకి

ఉరికెత్తుకొస్తి. అక్కడ నాకు కావాల్సిన అంగడి మూత పడిందీపూట. గొల్లపల్లె కాలనీలో కొంత లెక్కరావాల్సుండె. ఆటికిబోతే ఆ మనిషీ లేడు. ఇంక లాభం లేదనుకుని గణేష్ హొటల్లో అంత టిఫిన్ తిని బస్టాండుకు బోయి బస్సెక్కితి. హొటల్లో చూసుకున్నప్పుడు వెయ్యుంది. మద్దెలో ఏడబోయిందో యేమో? వెయ్యిపాయ... నాగతలా అయింది!" అంటూ ముగించాడతడు.

కూత పెట్టుకుంటూ వచ్చిన రైలు బండి మోత పెట్టుకుంటూ వెళ్ళిపోయాక మోటారు సైకిలు స్టార్టు చేసుకున్నాను. ఆ బక్కరైతు నా వెనుక కూర్చున్నాక ముందుకు పోనిచ్చాను.

ఐదు నిముషాలలో బురకాయలకోట చేరాము.

"ఇక్కడ దిగిపోతానన్నా!" అన్నాడతడు.

నేను బైక్ ఆపి అతడు దిగాక నా జేబులో వున్న వందరూపాయల కాగితం తీసి అతనికివ్వబోయాను.

"ఒద్దన్నా... ఒద్దుసామీ... నడిచే బాధ లేకుండా నన్నింత దూరం చేర్చావు. అదే పదివేలు!" అన్నాడు.

"డబ్బులు పోగొట్టుకున్నావు కదా? ఇబ్బంది వుంటుంది తీసుకో!" అన్నాను అనునయంగా.

"ఊరు జేరిపోయాను కదన్నా. ఇంకేం ఇబ్బంది లేదు. టయానికి వంకాయ చెట్లకు నీళ్ళు కడ్తా... రేపిడిస్తే మన్నాటికి మళ్ళీ పది పన్నెండు గంపలు టమేటాలు కోస్తాము. వంకాయలూ రెండు గోతాలవుతాయి. మదనపల్లెకేసుకుపోతే మళ్ళీ డబ్బులొస్తాయన్నా... నీ మాటే సాలు!" అన్నాడతడు.

నేను సంశయంగా బైక్ మీద అలా కూర్చుండిపోయాను. అతడు పోగొట్టుకున్న సొత్తు ఎక్కడుందో తెలిసినా చెప్పలేని స్థితి... నా వద్ద వందకన్నా ఎక్కువలేదు.

"ఇంకా నీలాంటోళ్ళు ఆడాడా ఉండబట్టే అప్పుడప్పుడైనా వానలు బడ్తున్నాయి. నువ్వు సల్లగుండాల... పొయ్యిరాన్నా!" అన్నాడతడు అభిమానంగా.

నేను ఫస్ట్‌గేర్ వేసుకుని ఆక్సిలేటర్ రెయిజ్ చేస్తూ క్లచ్చి వదులుతుండగా చేతులు జోడించి దండం పెట్టాడు.

తల వంచి ప్రతి నమస్కారం తెలుపుతూ ముందుకుసాగాను.

అతని వెయ్యినోటును తొక్కుకుంటూ వెళ్ళిన నాకుగానీ, సత్తిగాడికిగానీ, చూసిన బుచ్చిబాబుకు గానీ, ఆ నోటును జేబులో వేసుకున్న రవికిరణ్‌కు గానీ... నలుగురిలో కనీసం ఒక్కరికైనా... ఆనోటు ఎవరు పడేసుకున్నారా? అన్న ఆలోచన మాత్రం ఎందుకు రాలేదా? అన్న ప్రశ్న వేధిస్తోంది నన్నిప్పుడు. ✪

*(విశాలాక్షి మాసపత్రిక, సెప్టెంబర్ 2011)*

## అడుగుజాడలలో...

**బ**స్తీలో వ్యాపారం చేస్తూ దర్జాగా జీవిస్తుండిన తన చిన్న కుమారుడు త్వరలో వ్యాపారం మానుకుని మరో వ్యాపారస్తుని గిడ్డంగుల మేనేజరుగా చేరాలనే ప్రయత్నాలలో ఉన్నాడని తెలిసి అతన్ని చూసి రావడానికి వెళ్ళాడు రంగప్ప.

ఆయన కోడలు నిండుకుండ. నిండుగా నవ్వి కుశలం అడుగుతూ సోలార్‌హీటర్ పైపులోంచి వేడివేడి నీళ్ళు పట్టి, మామగారికి వీపు రుద్ది స్నానం చేయించిన తరువాత వేడివేడి అన్నం, కూరలూ వడ్డించింది అన్నపూర్ణలా.

ఏనాడూ బస్ కోసం కాచుకుని బస్సు ఎక్కే అలవాటు లేని రంగప్ప తమ గ్రామం నుండీ ఐదు మైళ్ళూ నడిచి రావడం వల్ల మంచి ఆకలిమీద ఉన్నాడేమో సుష్టుగా భోంచేసి భుక్తాయాసంగా హాల్లోకివచ్చి సోఫాలో కూర్చుని "నీ చల్లని చేతులు గాజుల గలగలతో పదిమందికీ పది కాలాల పాటు ఇలాగే అన్నం పెట్టాలి తల్లి!" అంటూ తాంబూలం పళ్లెంతో వచ్చిన కోడల్ని ఆశీర్వదించాక...

"ఏమిట్రా వ్యాపారం మానేస్తానంటున్నావట?" అంటూ కొడుకును కదిలించాడు.

"నష్టంతో నడుస్తోంది నాన్నా మన వ్యాపారం!" అన్నాడు నరేష్ ముక్తసరిగా.

"అలాగా! అయితే నీకు అవసరం వచ్చినప్పుడు ఇవ్వాలని రెండు లక్షలు దాచివుంచాను ఇంట్లో. రేపు పల్లెకు వచ్చి అది తెచ్చుకుని వీలయినంత నష్టాన్ని పూడ్చుకుని వ్యాపారం కొనసాగించే ప్రయత్నం చెయ్యి! ఇంకా కావాలన్నా పెద్ద రెడ్డి వద్ద చెయ్యి బదులు తీసుకుందాము!!" ఆయనా ముక్తసరిగానే, సూటిగా చెప్పేశాడు.

సురేష్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎనిమిది మంది పిల్లలను పెంచి పెద్ద చేసి వాళ్ళకు న్యాయం కలిగించడం కోసం ఎన్నో కష్టాలు పడ్తూ అహోరాత్రులు యంత్రంలా పొలాల మధ్య జీవితం గడిపిన తన వృద్ధ తండ్రికేసి ప్రేమగా చూశాడు.

"డబ్బు ఒకటే కాదునాన్నా సమస్య... నాతోటి వ్యాపారస్తుల విషయాలన్నీ చూశాక నాకు వ్యాపారం అంటేనే అయిష్టం ఏర్పడింది. మొత్తం అమ్మేసి వచ్చిన డబ్బు పిల్లల పేరిట ఫిక్సడ్‌లో వేసేసి ఓ మంచి వ్యాపారస్తుని వద్ద మేనేజరుగా జీతానికి చేరిపోవాలను కుంటున్నాను!"

"ఏం చేశారేమిటి నీతోటి వ్యాపారస్తులు?"

"నేను ఈ ఊర్లో వ్యాపారం ప్రారంభించిన నాటి నుండీ కూడా నాకు పరిచయం అయిన వ్యాపారస్తులందరి తోటి స్నేహంగానే ఉంటూ వచ్చాను. ప్రతి ఒక్కరికి నా చేతనయినంత సహాయం చేస్తూనే వచ్చాను. అత్యవసర పరిస్థితి ఏర్పడి అడిగిన వారికంతా డబ్బు చేబదుళ్లు ఇచ్చాను. వృద్ధిలోకి వస్తున్న వారికయితే నా శక్తికి మించికూడా సహాయం చెయ్యడానికి ప్రయత్నించాను.

నా ద్వారా సహాయాలు పొందిన వారు కూడా నా వ్యాపారం బాగా పుంజుకుంటుండడంతో కుమిలిపోయారు. ఇవన్నీ నాకు అప్పట్లో తెలియవు. నా ద్వారా ఎంతో లాభం పొందిన వాళ్ళు సైతం టాక్సువాళ్ళకూ, ఫుడ్ అథారిటీ వాళ్ళకూ నా మీద లేనిపోనివి తెలియపరచి ఉసిగొలిపారు. ఇదంతా చేస్తూ మళ్ళీ నా వద్దకే సహాయాల కోసం వచ్చేవారు.

ఈ మధ్యకాలంలో వ్యాపారంలో నేను కాస్త దెబ్బతినేసరికి వాళ్ళందరూ ఆనంద పారవశ్యాలలో మునిగి, తేలిపోయారట. నానుండీ ఎంతో లాభం పొందిన వారిలో కొందరు సైతం నా పతనాన్ని గూర్చి కథలు కథలుగా చెప్పుకున్నారట.

'ఈ రోజు తన హౌస్ ప్లాట్స్ అమ్ముకున్నాడట! రేపేం అమ్ముకుంటాడూ? ఆ పల్లెలో పొలం ఉంది కద? తన వాటా పొలం అమ్ముతాడు కాబోలు?! అవునూ మర్నాడేం అమ్ముతాడూ? ఏమీ మిగిలి వుండదుగా?'... ఇలాంటి హీనమైన చర్చలతో పగలబడి నవ్వుకుంటూ గడిపారట నా వెనుక.

వారందరి మనస్తత్వాలూ తెలిశాక వ్యాపారస్తుడుగా వుంటే నేనూ ఒకనాటికి అలాగే తయారయిపోతానేమో? నా వ్యక్తిత్వాన్ని కోల్పోతానేమో?? అనే భయంతో ఈ నిర్ణయానికి వచ్చాను!" అన్నాడు సురేష్.

"నీ పరిచయస్తులందరూ అలాంటి వారేనా?"

"మంచివారూ లేకపోలేదు నాన్నా! అలాంటి ఓ మంచి వ్యాపారస్తుని వద్దనే నాన్నా నేను ఉద్యోగిగా జీవితం గడిపేయాలని అనుకుంటున్నది. శ్రమకు తగ్గ మంచి

జీతం ఇవ్వగలడు నాకాయన!"

రంగప్ప చాలాసేపటి వరకూ మాట్లాడలేదు... ఏదో ఆలోచిస్తూ...

"నీ చిన్న తనంలో ఓసారి చింతచెట్టు మీదనుండీ పడిపోయావు గుర్తుందా?" అని అడిగాడు ఆలోచనలలోంచి తేరుకున్న తరువాత, సురేష్ ఆశ్చర్యపోయాడు తండ్రి ఆ ప్రశ్న ఎందుకు వేశాడో అర్థంకాక.

"ఎందుకు గుర్తులేదు నాన్నా... అప్పుడు నా కుడికాలు విరిగిపోయిందిగా? నాలుగు నెలలు మంచంలోనే పడివున్నాను కద! బాగా గుర్తుంది!"

"అప్పుడు మన గ్రామ జనాభా ఎంతో తెలుసా? రెండు వందలపాతిక!"

"అదంతా నాకు సరిగ్గా గుర్తులేదు... బాగా చిన్నవాడ్ని కదా?"

"నీవు చెట్టు మీద నుండీ పడి, నీ కాలు విరిగి మనం అవస్థలు పడుతూవుంటే పాతిక మంది" 'అయ్యో!... రంగప్ప మామ కొడుకు... లేతబిడ్డడు చెట్టుమీదనుండీ పడిపోయాడు, కాలు విరిగిందే దేముడా? అవిటి వాడయిపోతాడో యేమో?' అనుకుంటూ, అంటూ, ఎంతో బాధపడ్తూ సానుభూతి చూపారు.

నలభైమంది 'అబ్బే వాడు పసిపిల్లావాడేగా? లేత కాలేగా?? త్వరలో కట్టుకుంటుంది. కానయితే కాస్త సొట్టరావచ్చు... అదయినా వయసొస్తే సొట్ట కన్పించకుండా పోదూ?' అనుకుంటూ అదే నాకూ చెప్పి ధైర్యాన్నిచ్చారు.

మిగిలిన వారిలో అరవయి మంది 'అతి వెధవ కాకపోతే చెట్టు ఎందుకు ఎక్కాలి? ఈ కుర్రాళ్ళకు బాగా తలపొగరు... ఇలా తగ్గాల్సిందే. వాడి కాలు కట్టుకున్నా కట్టుకోకపోయినా ఇక చస్తే అతిపనులు చేయడు... వెధవ!' అంటూ తిట్లు లంకించుకున్నారు.

ఇక మిగిలిన వందమందీ ఏమనుకున్నారో తెలుసా...?" అంటూ ఆగాడు రంగప్ప.

"ఏమనుకున్నారు?, ఎందుకనుకున్నారు?, ఏమన్నారు?" అంటూ కొడుకూ, కోడలూ, మనువడూ కూడా అడిగారు ఆసక్తిగా.

'పిల్ల ముం...కొ..... చింతకాయలు తిని చావడానికి పెద్ద ఆరిందాలా చెట్టు ఎక్కాలా? ఒక కాలేనా విరిగింది? రెండు కాళ్ళూ విరిగిపోయివుంటే బావుండేది. ఆ

రంగప్ప గర్వం కొంత తగ్గేది... మరీ మిడిసిపడ్తుంటాడు!' అనుకున్నారు. అనుకోవడమే కాదు చెప్పుకుని నవ్వుకున్నారు.

ఆ మాటలన్నీ తెలిసి నాకు మన గ్రామం అంటేనే విరక్తి కలిగింది. ఎందుకంటే మన గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా నాకే ఆ కష్టం వచ్చినట్లుగా గిలగిలలాడి పోతుండే వాడిని ఎప్పుడూ, పొలాలన్నీ అమ్మేసి ఈ ఊరు వచ్చేయాలనుకున్నాను అప్పట్లో! అప్పటికి మీ తాతయ్య బ్రతికే వున్నాడుగా, ఆయన అన్నాడు...

'రంగా! దూరపు కొండలు నునుపురా నాయనా! ఇది ప్రపంచం... రకరకాల మనుషులూ, మనసులూ ఎక్కడైనా మామూలే! నీవు బస్తీకి వెళ్ళినా, బర్మాకు వెళ్ళినా నీ చుట్టూ మనుషులలో మంచివాళ్ళు తక్కువగానే వుంటారు. దుర్మార్గంగా ఆలోచించే వాళ్ళే ఎక్కువ ఎక్కడైనా ఎప్పుడైనా... ఇదీ లోకం తీరు... అంతే!

పెళ్ళినాటి సంతోషమూ, చావునాటి దుఃఖమూ శాశ్వతంకాదంటారు పెద్దోళ్ళు. ఎంత బాధయినా కాలం మాన్పేస్తుంది. అంతే!'

మీ తాతయ్య మాటలు నాకు ధైర్యాన్నిచ్చాయి. నాకు కలిగిన బాధ నాకే చిన్నదిగా అన్పించింది. దూరం ఆలోచించి పల్లె వదలాలన్న ఆలోచన మానుకున్నాను!"

తండ్రి చెప్పిందంతా ఓపికగా విన్న సురేష్ ఆలోచనల్లో పడిపోయాడు.

"నీకున్నదాంట్లో కొంతయినా పదిమందికీ పంచిపెట్టగలిగే హృదయం నీకుంది. మనుషుల్ని గూర్చి ఆలోచించే నేర్పు నీ మనసుకుంది. అదే రైతు తత్వం. నీ వంశ లక్షణంగా ఆ తత్వం నీ నరనరాల్లో జీర్ణించుకు పోయింది. కాబట్టే పదిమందికీ మంచిచేసి ఆ మంచి వల్ల నీకు బాధకలిగినా భరిస్తున్నావు తప్ప చెడు తలంపులకు పోలేకపోతున్నావు. అంతే! కానీ వ్యాపారం వదులుకోవాలనుకోవడం మాత్రం సమంజసమైన ఆలోచనగా నాకన్పించడం లేదు!"

"ఎందుకు నాన్నా?" అన్నాడు సురేష్ చకితుడయి.

"ఒక ప్రశ్న వేస్తానురా అబ్బి! నీవు వ్యాపారం మానుకున్నా ఉద్యోగం చేసేది ఎవరి వద్ద?"

"మరో వ్యాపారస్తుడి వద్ద నాన్నా!" అన్న సురేష్ మనసులో ఏదో ఒక మెరుపులాంటిది తళుక్కున మెరిసింది.

"అంటే పరోక్షంగా వ్యాపార పర్వంలోనే నీ నడక సాగుతుంది. కొత్త జీవితం

అని నీవనుకుంటున్న దాంట్లో నీ చుట్టూ పాత మనుషులే ఉంటారు. పాత పరిస్థితులే పునరావృతం అవవచ్చు. వాస్తవానికి మార్పు లేనప్పుడు స్వేచ్ఛగా నీ వ్యాపారమే కొనసాగిస్తే మంచిది కదా?"

సురేష్ మరింత ఆలోచనలలో పడి మౌనం వహించాడు.

"ప్రశాంతత అనేది నీ మనసులోంచి, పుట్టుకు రావాలి రా అబ్బి! నీ మనసు స్వేచ్ఛగా, సంపూర్ణంగా, ధైర్యంగా ఉన్నప్పుడు నీవు పల్లెలో నీ పొలం దున్నించుకుంటూ కానగచెట్టు నీడన గనుముమీద కూర్చున్నా సింహాసనం మీద కూర్చున్నంత ఆనందంగానూ ఉండగలుగుతావు.

ఇంకో ముఖ్య విషయం యేమిటంటే అపాత్రదానాలూ, అనవసర ఉపకారాలూ ఎవ్వరికీ చెయ్యకు. ఎందుకంటే...

'మనిషికి మేలు చెయ్యడం శవానికి సింగారం చెయ్యడం ఒకటేరా!' అనేది మా జేజమ్మ. జేజి చెప్పిన మాటలోని వాస్తవం నా జీవితానుభవంలో గ్రహించడానికి చాలాకాలం పట్టింది. వీలయినంత వరకూ ఆలోచనతో నీ చుట్టూ ఓ గిరి గీసుకుని జీవించడం అలవాటు చేసుకుంటేనే నీ తత్వానికి మంచిదనిపిస్తోంది!"

తను చెప్పదలచుకున్నది అయిపోయినట్లుగా సోఫాలోనే పడుకునేశాడు రంగప్ప.

ఆయన ఓ కునుకుతీసి నిద్ర లేచేసరికి సురేష్ ఇంట్లో లేడు. ముఖం కడుక్కుని కోడలు ఇచ్చిన కాపీ త్రాగిన తరువాత నీరెండలో నింపాదిగా బయల్దేరి వెళ్ళిపోయాడు ఆయన కాలినడకన.

వచ్చిన పని అయిపోయిన తరువాత అనవసరంగా ఎక్కడా ఒక్కగంటకూడా వృధాగా కాలం గడపడం తనకలవాటు లేదు.

* * *

టవును నుండి వచ్చేశాక ఓనెలరోజులపాటు సురేష్ కోసం ఎదురు చూశాడు రంగప్ప. అతడు రాకపోయేసరికి వ్యాపారం మానేసి ఉద్యోగంలో చేరిపోయి ఉంటాడను కున్నాడు ఆయన.

కానీ టవున్‌కు వెళ్ళివచ్చే తమ వూరివాళ్ళ ద్వారా, అడపాదడపా పల్లెకు వచ్చే తన పిల్లల పిల్లల ద్వారా సురేష్ వ్యాపారం మానుకోలేదని తెలుస్తూ వచ్చింది ఆయనకు.

దాదాపు మూడేండ్లు గడిచిపోయాక టవున్‌కు బయల్దేరి వెళ్ళాడు రంగప్ప! ఆయన తన పెద్ద కుమారుడి పెద్దకుమార్తె వివాహం ఖరారు చేసే ప్రయత్నాల్లో ఉన్నాడు. ముఖ్యమైన కార్యం ఏదైనా పిల్లలందర్నీ సంప్రదించడం ఆయన అలవాటు.

నడక తాలూకు అలసట పోయేలా వేడినీళ్ళ స్నానం చేయించి వేడివేడి అన్నం, కూరలతో కోడలు భోజనం వడ్డిస్తే తన వద్ద నున్న సి.డి. తీసి వి.సి.డిలో సెట్‌చేసి తాతకు “లవకుశ” సినిమా చూపించాడు మనుమడు.

సినిమా చూసే సరికే సాయంకాలం అయిపోవడం వల్లా, సురేష్‌తో సంప్రదించాల్సిన విషయం ఉండడం వల్లా ఆ రోజు నిలచిపోయాడు రంగప్ప.

రాత్రి భోజనాలు ముగిశాక సురేష్‌ను అడిగాడాయన...

“వ్యాపారం ఎలా సాగుతోందిరా అబ్బి? డబ్బేదయినా అవసరం అయితే వచ్చి తీసుకోరాదూ?”

“భగవంతుని దయవల్లా, మీ ఆశీస్సులతో నా వ్యాపారం చాలా బాగా సాగుతోంది నాన్నా! తుఫానులనూ, ఎడారులనూ దాటి ముందుకు వచ్చేశాను.”

“మంచిదిరా అబ్బి! చాలా సంతోషం!!”

“చీడపురుగు మనస్తత్వాలను నా దగ్గరకు, నా వ్యాపారం దరిదాపులకు రానివ్వకుండా జాగ్రత్త పడ్తున్నాను. ఇప్పుడు నాకు కొనితెచ్చుకున్న బాధలు లేవు. అలివిగాని స్నేహాలు అంతకన్నా లేవు. వ్యాపారమే ప్రాణంగా ప్రశాంతమైన మనసుతో హాయిగా ఉన్నాను నాన్నా!”

“మీరందరూ ఇలా సంతోషగా ఉంటేనే నాకు తృప్తిరా!”

“పార్వతికి మీరు చూస్తున్న సంబంధం నాకు తెలిసిందే నాన్నా! చాలా మంచి సంబంధం అని అందరూ అన్నారు. ఖాయం చేసేయ్యండి. రేపు మీరు వెళ్ళేటప్పుడు ఓ ఏభయివేలిస్తాను తీసుకువెళ్ళి పెళ్ళిఖర్చుల నిమిత్తం వాడండి. పెళ్ళి సమయానికి

మరికాస్త ఎక్కువే తీసుకురాగలం లే!" అన్నాడు సురేష్.

రంగప్ప కళ్ళలో రెండు ఆనందబాష్పాలు కదిలాయి.

తను తన తాత, తండ్రుల అడుగు జాడలలో అడుగులేసి నడిచాడు. తన పిల్లలు కూడా తన అడుగు జాడలలోనే అడుగులు వేస్తున్నారు. ఆనందంతో కంటనీరు తిరగడానికి మించిన తృప్తి ప్రపంచంలో మరొకటి ఏముంటుంది? ✪

*(వెలుగు, మాసపత్రిక సెప్టెంబర్ 2008)*

# తప్పు

**"తం**గప్పా! ఒక మంచి కథ చెప్పవోయ్!" అన్నాడు చంగప్ప ఎర్రగండంమిట్టకేసి సాయంకాలం వాక్ వెళ్తున్నప్పుడు.

"ఇంకేం పని లేదా? నాకు కథల్రావు" అన్నాడు తంగప్ప విసుగ్గా.

"ఓ కథ చెప్పవోయ్... వినాలనిపిస్తోంది... ఏదీ తోచకపోతే భేతాళ కథల్లోంచీ ఏదయినా ఒకటి చెప్పు" అన్నాడు చంగప్ప.

"ఆఁ ఏదో ఒకటి అఘోరిస్తాన్లే! కాలుకు చుట్టుకున్న పాము కరవక వదుల్తుందా?"

* * *

శివపురం కొండలకూ అడవులకూ వెనుకనున్న ఓ గ్రామం. నీటి ఎద్దడికి గురవుతున్నాయి ఆ గ్రామమూ, దాని చుట్టుపట్ల నున్న అనేక పల్లెలూనూ. సాగునీటి మాట దేముడెరుగు... త్రాగునీటికి కూడా ఎంతో కటకట... మైలు దూరానికి తక్కువ కాకుండా వెళ్ళి తెచ్చుకోవాలి.

ఎట్టకేలకు ప్రభుత్వం కరుణించి ఆ ప్రాంతమంతా సర్వే చేయించడానికి ఆనతిచ్చింది. ఆనక లెక్కకూడా విడుదల చెయ్య సంకల్పించింది.

శివపురానికి ఉత్తరాన వున్న కొండలకింద రెండు గ్రామాలలో పుష్కలంగా నీరుపడే అవకాశాలున్నాయని జియాలజిస్టులు తేల్చారు.

"రాజు తలచుకుంటే దెబ్బలకు కరువా?" అన్నట్లు ఆధునిక బోర్ డ్రిల్లింగ్ యంత్రాలు కొండలనూ, గుట్టలనూ దాటుకుని అడవిలో కొండకిందనున్న ఓ పాయింటు వద్దకు చేరుకున్నాయి.

అయితే శివపురం, ఆ చుట్టుపట్ల పల్లెల తాలూకు ప్రజలెంత నిరాశలో ఉన్నారంటే... కనీసం అడవిలో బోరువెయ్యబడుతున్న ప్రదేశానికయినా వెళ్లి... బోర్లో నీళ్ళు పడుతాయా? లేదా? నీరు పడినా తమ ఊర్లవరకూ వస్తుందా? లేదా? అన్న విషయాన్నయినా చూసి తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా లేనంత నిరాశలో ఉన్నారు.

"అక్కడికి వెళ్లి ఆ పని చేసే కంటే అడవిలోకి వెళ్లి ఎండుపుల్లలేరుకుని మోపుకట్టి బస్‌రోడ్ దాకా మోసుకువెళ్తే ఏ బస్ డ్రయివరో మోపు కొనుక్కుని నాలుగు డబ్బులిస్తాడు. ఇంట్లో రెండ్రోజులు గ్రాసం గడుస్తుంది కదా?" ఇలాంటి ఆలోచనలలో మగవాళ్లుంటే...

"ఆ అడవిలోకి బోయి ఆ పని చేసే కంటే కోనకుబోయి జరిగుంటలో స్నానం చేసి బట్టలుతుక్కుని ఆ పక్కనే ఊటగుంటలో ఓ బిందె తాగునీళ్లు మోసుకుని తెచ్చుకోవచ్చు కదా?" ఇలాంటి ఆలోచనలలో ఆడవాళ్లుండిపోయారు.

అందువల్ల బోర్ వేసే ప్రదేశానికి మండల ప్రెసిడెంటు, ఇంజనీరు, జవాను, గ్రామ సర్పంచ్ మాత్రమే చేరారు.

రెండొందలడుగులు దాటగానే గంగ ఉబికింది. మూడొందలు పోకమునుపే ఎగజిమ్మింది.

"ఐదొందలేస్తే నీళ్లెలా ఉంటాయి?" ప్రశ్నించాడు ప్రెసిడెంటు.

"అంత లోతుకు పోనవసం లేదయ్యా! ఈ మధ్య కాలంలో ఈ ప్రాంతంలో ఇలాంటి బోరు ఎక్కడా పడలా. అంతలోతేస్తే... బోరు కొట్టకుండానే నీరు కారుతూ వున్నా ఆశ్చర్యం లేదు..." అన్నాడు ఆపరేటరు.

"అయితే ఆపెయ్యి" అన్నాడు ప్రెసిడెంటు.

అవాక్కయిపోయారు అందరూ.

"నీకు ఐదొందల అడుగులకు బిల్లు చేయించి ఇస్తాను. నీకు, డ్రయివర్‌కి, క్లీనరుకి తలా వెయ్యి రూపాయలిప్పిస్తాను. ఈ బోరు పూడ్చెయ్యండి. ఐదొందలడుగులు లోతుకెళ్లినా నీళ్ళు పడలేదని చెప్పాలి ఎవరడిగినా."

అయోమయంలోనే అంగీకరించాడు ఆపరేటరు.

"ప్రజలు నీళ్లకు చచ్చిపోతున్నారు కదా!" అన్నాడు సర్పంచి

"ఆ కొండకింద ఇంకో బోరు వేస్తాం కదా!" అన్నాడు ప్రెసిడెంటు.

"అక్కడ నీళ్లు ఇంతలా పడకపోతే?"

"పీడాపోయే!" అన్నాడు ప్రెసిడెంటు విసుగ్గా.

"పల్లెల్లో చాలామంది ప్రజలకు నీళ్ళు మోసి మోసి మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, నడుం నొప్పులు వచ్చాయి, వస్తున్నాయి కదా! మంచినీళ్లు కరువయి రోగాల బారిని పడ్తూనే ఉన్నారు కదా?" అన్నాడు సర్పంచ్, తనలో కొద్దో గొప్పో నిజాయితీ మిగిలుండడం వలన.

"చూడు సర్పంచీ, అక్కడ నీళ్లు బాగా పడకపోతే ఏదో ఒక బాధపడి నీవు కోరుకుంటున్న గుమాస్తా ఉద్యోగాన్ని నీ అల్లుడికి వేయిస్తాంలే... నీవు గమ్మునుండు" అన్నాడు ప్రెసిడెంటు సాలోచనగా.

సర్పంచ్ నోరు మూతపడింది... ఎగుస్తున్న నీటిమీద మట్టిపడి కుప్పయింది.

ఆ మరునాడు...

రెండో రోజు వేయబడ్తున్న ప్రదేశానికి కూడా ప్రజలెవరూ కదలలేదు. వేసిన బోరులో నీరుపడలేదన్న వార్త అందరినీ మరింత నిరాశలో కూరుకుపోయేలా చేసింది.

"...తొలేటుకు తోలు తెగలా, మలేటుకు మాను తెగిపడ్తుందా? పో ఫో" అనుకుంటూ ఎవరి బతుకు తెరువు పనులలో వారు పడిపోయారు.

మొత్తానికి రెండవ బోరులో రెండంగుళాల నీరే పడ్డాయి.

ఆరొందల అడుగుల లోతున... అవయినా వేసవి వస్తే ఉంటాయో, ఉండవో తెలియదన్నాడు ఆపరేటరు.

"రైతో! ఈ బోరుకు మోటారు బిగించి ఈ పక్కనే ఓవర్‌హెడ్డు ట్యాంకు కట్టించి ప్రతి పల్లెకూ పైపులైను వేయిద్దాములే. ఎస్టిమేట్లు తయారు చేయించండి" అన్నాడు ప్రెసిడెంటు ఆనందంగా.

ఇంజనీరు కళ్లు తళతళ మెరిసాయి.

తిరుగు ప్రయాణంలో అడిగాడు ప్రెసిడెంటుని.

"మీ భావమేమి తిరుమలేశా?"

“మనల్ని నమ్ముకుని పాతిక ఎడ్లబండ్లు, పది ట్రాక్టర్లు పల్లెలకు నీళ్లు తోల్తున్నాయి కదా? ఆ బిల్లుల పుణ్యమా అని మన జేబులూ బాగానే తడుస్తున్నాయి కదా?” అన్నాడు ప్రెసిడెంటు నవ్వి.

ఇంజనీరు కిక్కురుమనకుండా నోరు మూసేశాడు.

అంతరాత్మలో ఏదో అలజడి అవడంతో సర్పంచ్ నోరు పెగిలింది. “కానీ మనం ఇచ్చే నీరు ప్రజల ముక్కులలోకి కూడా చాలడంలేదు కద?”

“అది వాళ్ల ఖర్మ... నీవు నీ అల్లుని సంగతి చూసుకోవయ్యా! మగాడా!” అన్నాడు ప్రెసిడెంటు కాస్త కోపంగా, విసురుగా.

* * *

“ఇప్పుడు చెప్పు చెంగప్పా. ఎగసి, ఎగసి పతి పదంబులమీద పడే గంగలా భూమ్మీద దూకడానికి సిద్ధపడ్డ గంగను తలెత్తనీయకుండా తొక్కేసిన పాపం ప్రెసిడెంటుదా, ఇంజనీరుదా, సర్పంచ్‌దా, జవానుదా, ఆపరేటరుదా, డ్రైవరుదా, క్లీనరుదా? ఎవరిది ఆ పాపం? ఈ ప్రశ్నకు సరిగ్గా జవాబు చెప్తే నీకు మంచి పార్టీ ఇచ్చుకుంటాను” అన్నాడు తంగప్ప కథ ముగించాక.

“మంచి బేతాళప్రశ్నే వేశావు కానీ, వాళ్లెవరిదీ తప్పు కాదు కాబట్టి, నీ ప్రశ్నే తప్పంటాను నేను” అన్నాడు చంగప్ప నడక సాగిస్తూనే.

“ఎలా?”

“అధికారులూ, నాయకులూ ఏ పనీ చెయ్యరు. చేసేవాళ్లనీ చెయ్యనివ్వరు.

అందువల్ల ప్రజలు వాళ్లని వెయ్యికళ్లతో కనిపెట్టి ఉండాలి. ఈ కారణాన ఆ పాపం అంతా ఆ ప్రాంత ప్రజలది. బోరు దగ్గరుండి వేయించుకోవాల్సిన బాధ్యత ఆ ప్రజలందరిదీ. ఆ రెండుబోర్లూ ఫెయిలయినా అరచి, గీపెట్టి పంచాయతీ ఆఫీసును చుట్టుముట్టి, ప్రభుత్వం చెవులు మెలేసి మరో ప్రయత్నం చేయించాల్సిన పని కూడా ప్రజలదే కదా! అందువల్ల ఆ పాపమంతా చద్ది పీనుగులయిన ఆ ప్రజలకే చెందుతుంది" అంటూ నవ్వేశాడు చంగప్ప. ✪

*(మినీ కథాసౌరభం, 2010)*

# పాత సైకిల్

**నే**నెప్పటికీ మరచిపోలేని రోజిది.

అందుకే ఆ పాత సైకిలును మరింత శ్రద్ధగా, పరిశుభ్రంగా తుడవడం మొదలు పెట్టాను.

ఆఫీసుకు వెళ్ళడానికి మోటరు సైకిలు స్టాండు తీసి రోడ్డు మీదకి దించుకుంటూ మా అబ్బాయి శరత్ నాకేసి నవ్వుతూ చూశాడు... కానీ ఏమీ మాట్లాడలేదు... ఒకప్పుడయితే "ఇంకేం పని లేదా?" అనేవాడు. ఆ తరువాత, తరువాత తన తల్లిద్వారా ఆ సైకిలు కథ తెలుసుకున్నాడు కాబోలు... అలా మాట్లాడడం మానుకున్నాడు. సైకిలు తుడవడం పూర్తయింది!

నేను ఇంట్లోకి వెళ్ళి స్నానం పూర్తి చేసుకుని వచ్చేసరికి సుగాత్రీ, సాహిత్య పూజ సామాగ్రి సిద్ధంగా ఉన్నారు.

నా భార్య సుగాత్రి సైకిలుకు అక్కడక్కడ పసుపుకుంకుమలతో చుక్కలు పెడితే నా కుమార్తె సాహిత్య పూలతో అలంకరించింది.

నేను అగర వత్తులు వెలిగించి, టెంకాయ కొట్టి, కర్పూర హారతి ఇచ్చాక ముగ్గురం కలిసి ఆ టెంకాయ నీళ్ళను తీర్థంలా పుచ్చుకున్నాం.

టిఫిన్ తీసుకోవడం, కాఫీత్రాగడం అవగానే బట్టలు తొడుక్కుని సైకిలు తీసుకుని బయలుదేరాను.

నేను సైకిలు మీద వెడుతుంటే బజార్లో వెళుతున్నవాళ్ళు నాకేసి కాస్త వింతగా

చూస్తున్నారు. చూడకేం చేస్తారు? ఇవాళ ఆయుధపూజ, విజయదశమి... కనీసం శుక్రవారమైనా కాకపోయె!!

పూలహారాలతో తళుకులీనుతూ పాత సైకిలు పురవీధులలో పరుగులు తీస్తోంటే పరిచయస్తులు కొందరు ఆశ్చర్యంగా చూస్తున్నారు... మరి నేనిప్పుడు కార్లలో తిరగగల మనిషిని వాస్తవానికి!

నా సైకిలలా చాలామందిని ఆశ్చర్యచకితులను చేస్తూ పరుగులు తీస్తోంటే... నా ఆలోచనలు ముప్పయి సంవత్సరాల క్రితం... ఆనాటి కేసి పరుగులు తీశాయి!!

✶ ✶ ✶

ఆ రోజు ఆదివారం అయినందున నింపాదిగా వరండాలో కూర్చుని ట్రాన్సిస్టర్ రేడియోలో సిలోన్ పెట్టుకుని హిందీ పాటలు నింపాదిగా వింటూ హిందూ పేపరు చూసుకుంటున్నాను.

"స్టవ్వులు... గ్యాస్ స్టవ్వులు రిపేర్..." అంటూ వీధిలో సైకిలు మీద పోతున్నాడో యువకుడు.

అతని కేక ఎలా వినిపించిందో కానీ...

"ఇక్కడే కూర్చుని ఉన్నారు కదా? ఆ రిపేరీ అతన్ని ఆపలేరా?" అని విసుక్కుంటూ వీధిలోకి వెళ్ళింది నా శ్రీమతి సుగాత్రి.

"ఓహ్హోవ్!... స్టవ్వు రిపేరీ... ఇట్లారా!" అని నా భార్య కేక వేయడం అయ్యాక ఒక నిముషంలోనే ఆ యువకుడు మా ఇంటిముందు సైకిలు దిగాడు.

"కంపెనీ గ్యాస్ స్టవ్వు... గ్యాస్ వాసన వస్తోంది... రిపేర్ చేస్తావా?" అని ప్రశ్నించింది నా శ్రీమతి.

"చేస్తానమ్మా!" అన్నట్లుగా తలవూపాడతడు.

"చూద్దువురా!" అంటూ లోనికి రాబోయింది నా శ్రీమతి.

"అమ్మా, సైకిలుకు తాళం లేదు. లోపల పెడతాను!" అన్నాడు అతడు.

"ఆ, ఈ వరండాలో పెట్టు... ఏమండీ ఆ రేడియో కట్టేసి ఆ స్టవ్వు బాగు చేయించండి!" అంది సుగాత్రి.

"గ్యాస్ స్టవ్వు ఎవరంటే వాళ్ళు చూడకూడదు. కంపెనీ మెకానిక్కే చూడాలి!" అన్నాను కాస్త కోపంగా.

“ఆ! కంపెనీ మెకానిక్కొచ్చి చూసేసరికి తెల్లారిపోతుంది... మూడురోజులుగా మూడుసార్లు పోయి చెప్పొచ్చారు కదా? ఎక్కడొచ్చారు? ఆయుధపూజన్నారు, పండగ సెలవన్నారు, ఇప్పటికయినా రాలేదు. వంట చేస్తున్నప్పుడొస్తున్న ఆ వాసనకు కడుపులో తిప్పేస్తోంది... వాంతి అయ్యేలా, తలతిరిగిపోయేలా... ఎవరో ఒకరు చూడనీలే!” అంది విసుగ్గా.

ఈలోగా ఆ యువకుడు వరండాలో ఓ వారగా తన సైకిలు పదిలపరచుకుని వెనుక క్యారియర్‌లోంచీ తన సామాన్ల సంచి తీసుకున్నాడు.

“ఏమోయ్! నీకు గ్యాస్ స్టవ్వు రిపేరీ తెలుసా అసలు? అన్నాను సంశయంగా.

టెక్నీషియన్ కాని వాడి చేత గ్యాస్ స్టవ్ రిపేరు చేయించకూడదని వివేకం హెచ్చరిస్తోంది. కానీ మెకానిక్‌ను పంపించని కంపెనీ వాడిమీద కోపం... గ్యాస్ వాసన వస్తుండడం వల్ల సుగాత్రి పడే ఇబ్బంది మాట అటుంచితే కంపెనీ మెకానిక్ వచ్చేలోపు ప్రమాదం ఏదయినా జరిగితే ఎలా? అన్న ఆలోచన కలగలసి వివేకాన్ని కాస్త అలా ఉండమంటున్నాయి.

“కిరసనాయిలు స్టవ్వు, కిరసనాయిలు పంపు స్టవ్వు, గ్యాస్ స్టవ్వు... ఏదయినా అరువు చేసేస్తాను!” అన్నాడతడు ధీమాగా.

అతని రూపమూ, వేషమూ, సైకిలును “సైంకిల్” అని అనడమూ, మిగతా మాటలూ అన్నీ చూసి అతడు ముస్లిం సోదరుడనుకున్నాను కానీ పేరడిగితే గోవిందో, గోపాలో... ఏదో చెప్పాడు... గ్యాస్ ఆపేసి పైపు డిస్కనెక్ట్ చేసి స్టవ్వు తీసుకుని వంటగది వెనుక పెరట్లో పెట్టుకుని మొత్తం భాగాలన్నీ విడివిడిగా విడదీసి పెట్టేశాడు ఓ సంచి పట్టా మీదికి.

విప్పదీయడమైతే మొత్తం అరగంటలో అయిపోయింది కానీ క్లీన్ చెయ్యడం, బిగించడం రెండుగంటలపాటయినా పూర్తికాలేదు.

అంతా చేసి ఆనక అరగంటయ్యాక స్టవ్వు వెలిగించేసరికి గ్యాసు వాసన వస్తుండడమే కాదు... కాస్త ఎక్కువయినట్లుగా కూడా అనిపించింది.

“ఏంది నా బొంద నీవు రిపేరు చెయ్యడం?” అంటూ కేక తీశాను.

“నీవు రిపేరు చేసేదెప్పుడు? నేను అన్నం అదీ కానిచ్చేదెప్పుడు?” అంటూ మండిపడింది సుగాత్రి కూడా.

మనిషి సుఖానికి అలవాటు పడ్డాకా... ఏకాస్త అసౌకర్యాన్నీ భరించలేడన్నది

వాస్తవం. గ్యాస్ స్టవ్వుకు అలా అంతగా అలవాటు పడిపోయింది సుగాత్రి. అందుకే తనకంత కోపం వస్తోంది.

"స్టవ్వంతా అరువు చేశానమ్మగారూ... పైపు జాయింటులోనో, రెగ్యులేటర్ తొడుగు దగ్గరో లీకేజుంది... అరగంటలో అదీ అరువు జేసేస్తాను!" అన్నాడు చమటలు కక్కుకుంటూ.

సందులో బొగ్గుల పొయ్యో, కిరోసిన్ స్టవ్వో పెట్టి వంట మొదలు పెడతానంది సుగాత్రి విసుగ్గ.

గ్యాస్ స్టవ్వక్కడ రిపేరీ అవుతుండగా... అవన్నీ సందులో అయినా సరే వెలిగించడం నాకు ఇష్టం లేకపోయింది.

ఒక పూటకు హొటల్ నుండీ క్యారియర్ తెచ్చేస్తానన్నాను. మొదట కాదన్నా... చేసేది లేక ఒప్పుకుంది సుగాత్రి.

భోజనాల వేళవుతున్న సమయానికి అంత కష్టపడుతున్న ఆ మెకానిక్ కుర్రాడికీ అంత అన్నం పెట్టి పంపడం ధర్మమనిపించింది. అందుకే పెద్ద క్యారియరు, చిన్న క్యారియరూ... రెండూ పట్టుకుని విజయదుర్గావిలాస్ హోటలుకు బయల్దేరాను.

హోటల్లో బాగా రద్దీ ఉంది. మూడు ప్లేట్ల భోజనం క్యారియర్లలో సర్దివ్వడానికి అరగంటకు పైగానే పట్టింది.

నేను క్యారియర్లు పట్టుకుని కాళ్ళీడ్చుకుంటూ మా ఇంటి దగ్గరకు వెళ్ళేసరికి నాకోసం ఎదురుచూస్తూ వీధిగేటు దగ్గరే ఎండలో నిలబడివుంది సుగాత్రి.

"ఒట్టి మనిషివి కూడా కావు... ఎర్రటి ఎండలో ఎందుకు నిలబడడం?" అని విసుక్కున్నాను.

తనేదో అనబోతూ నా చేతిలోంచి ఓ క్యారియర్ అందుకోబోతోంది సుగాత్రి... అప్పుడు... ఆక్షణాలలో...

"అమ్మో... ఓ యమ్మో... ఓ ర్నాయనో!" అన్న కేకలు భయానకంగా వినిపించాయి మా ఇంటిలోపల్నుండీ... మా ఇంటికప్పెగిరిపోయేలా, మా గుండెలవిసిపోయేలా!

ఏం జరిగిందో తెలిసేలోపే మంటలు కనిపించాయి లోపల్నుండీ... అవి హాలువైపు కూడా విస్తరిస్తుండగా పిడుగు పడ్డట్లుగా పెద్ద శబ్దం... చాలా పెద్ద శబ్దం వినిపించింది.

అవాక్కయి నిలబడి పోయిన మమ్మల్నిద్దర్నీ ఎవరో పశువుల్ని లాక్కువెళు తున్నట్లుగా గబగబా దూరంగా లాక్కుపోయారు.

అరుపులు అరనిముషంపాటు వినిపించాయి... అంతే!

ఎవరు ఎలా కబురు పెట్టారో కానీ ఐదారు నిముషాలలో గంట వాయించుకుంటూ వచ్చేసింది ఫైరింజను.

మరో ఐదారు నిముషాలలో మంటలయితే ఆరిపోయాయి కానీ మా ఇల్లు ఇల్లులా లేదు. బాంబుల దాటికి గురయిన గుహలా కనిపించింది.

సగం కూలి మిగతా సగం కూలకుండగా ఉన్న వంట గదిలో మాడి బొగ్గయిపోయిన ఒక నిర్జీవ మానవాకృతి భయానకంగా... "సైంకిలు" "అరువు చేస్తాను" లాంటి పదాలతో తమాషాగా, సజీవంగా మాట్లాడిన యువకుడిదే అంటే నమ్మశక్యం కానట్లుగా కనిపిస్తోంది.

ఫైర్ సర్వీసు వాళ్ళు ప్రశ్నలు వేస్తోంటే నా బుర్ర కొద్ది కొద్దిగా పని చెయ్యడం మొదలు పెట్టింది... కానీ.. ఆ షాక్‌లోంచీ తేరుకోలేకపోతున్నాను! నా భార్య పరిస్థితి అయితే మరింత ఘోరంగా ఉంది!!

"ఎవరేం అడిగినా ఏ జవాబూ చెప్పవద్దు!" అంటూ తగ్గు స్వరంతో నా భార్యను హెచ్చరించి ప్రక్క వీధిలో ఉన్న దూరపు బంధువులతోపాటు పంపేశాను.

ఫైర్ సర్వీసు వాళ్ళు అడిగిన వాటికి వీలయినంత జాగ్రత్తగా జవాబులు ఇవ్వడానికి ప్రయత్నించాను కానీ వికలమైపోయిన మనసు, బుద్ధి సహకరించడం లేదు. వాళ్ళు స్టేట్‌మెంటు వ్రాసుకుని నా సంతకం తీసుకోకమునుపే బిలబిల మంటూ పోలీసులు వచ్చేశారు సైకిళ్ళమీద.

గంట తరువాత అధికారుల పర్యవేక్షణలో సబ్‌ఇన్స్‌పెక్టర్ పంచనామా రాస్తుంటే వీధిన పోతున్న ఆ మెకానిక్ యువకుడిని నేనే పిలిచి గ్యాస్ స్టవ్ రిపేర్ చేయమని చెప్పానని వ్రాయించాను. ఆ సమయంలో ఆ మాత్రమైనా బుర్ర పని చెయ్యడం వల్ల గర్భవతి అయిన నా భార్య నాతోపాటు పోలీసు స్టేషను చుట్టూ తిరిగి అవస్థలు పడకుండా కాపాడుకోగలిగాను.

మార్చురీ సౌకర్యం లేనందునా, శవాన్ని గుర్తించడానికి ఏకాస్త ఆనవాలయినా కనిపించకుండా తగలబడిపోయినందునా మరునాడు పోస్ట్‌మార్టం అవగానే శవాన్ని మునిసిపాలిటీ వారికి అప్పజెప్పేశారు.

శవాన్ని మునిసిపాలిటీ పనివారు బండిమీద లాక్కుపోతుంటే వారికి కాస్త ఎక్కువ

మొత్తం ఇచ్చి జాగ్రత్తగా ఖననం చేయించాను కొద్దో గొప్పో శాస్త్రోక్తంగా.

ఇల్లు వల్లకాట్లో ఓ భాగంగా తయారయింది. వంటపాత్రలు మొదలుకుని ఫర్నిచర్ వరకూ అన్నీ తగలబడి పనికి రాకుండా పోయాయి. కట్టుకున్న బట్టలు తప్ప!

నా భార్యను పుట్టింటికి పంపేశాను.

అనర్థుడి చేత గ్యాస్‌స్టవ్ బాగు చేయించుకునే ప్రయత్నం చేసి అతని మరణానికి కారకుడయినందుకు పోలీసు శాఖవారు నా మీద నాలుగు సెక్షన్లతో కేసు నమోదు చేశారు. గుడ్డిలో మెల్ల అన్నట్లు బెయిల్ లభించింది.

గ్యాస్ కంపెనీ ఏజన్సీ వాళ్ళమీదా కేసు బనాయించారు కానీ వాళ్ళు తప్పించుకోవడానికి దార్లున్నాయి. పైగా వరుసగా మూడు రోజులూ శెలవులుండడం వారికి సహకరించింది.

నా మీద మోపబడిన కేసు చాలా బలమైనదే... డబ్బు ఖర్చుచేసి కొంత వెసులుబాటు పొందే ప్రయత్నం చేశాను. బ్యాంకులో దాచుకుని ఉంచిన కొద్దో గొప్పో డబ్బూ క్రమంగా హారతి కర్పూరంలా ఖర్చవడం మొదలు పెట్టింది కానీ పెద్దగా ఉపయుక్తం అయే సూచనలు కనిపించలేదు.

పోతే మరణించిన వ్యక్తి పేరయినా నేను చెప్పలేకపోవడం అన్నది కేసు విచారిస్తున్న జడ్జిగారికి కానీ వ్యతిరేకంగా వాదిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు కానీ బొత్తిగా నచ్చలేదు... పైగా నా దురదృష్టం కొద్దీ చచ్చిన వాడిని వెతుక్కుంటూ ఎవరు రాకపోయారు ఎన్నిరోజులు గడిచినా.

అతనెవరో? అతని తల్లిదండ్రులెవరో? ఎక్కడ పుట్టాడో, ఎక్కడ పెరిగాడో, ఏ ఊర్లో ఉండేవాడో, వెనుక ముందెవరున్నారో... చెప్పగలిగేవారే లేకపోయారు.

నా ఇల్లంతా తగలబడిపోయినా వరండాలో ఓ మూల ఉంచబడ్డ అతని సైకిల్ మాత్రం చెక్కుచెదరలేదు.

మొదట్లో కేసు దర్యాప్తులో భాగంగా సైకిలును పోలీసులు తీసుకువెళ్ళి స్టేషనులో పెట్టారు.

పది రోజుల తరువాత చూస్తే ఆ సైకిలు ముందు చక్రమూ, సీటూ కనిపించలేదు. నా గుండె జల్లుమంది.

"పోలీసు స్టేషనులోని వస్తువులోంచీనే చోరీనా?" అని అనుకున్నాను.

చనిపోయిన వ్యక్తి తాలూకు వారెవరైనా అతన్ని వెతుక్కుంటూ వస్తే గుర్తించడానికి అతని రిపేరీ పరికరాలు కూడా సగం కూలిన మా వంటగది కప్పు క్రింద కలిసిపోగా మిగిలిన సజావైన వస్తువు ఆ సైకిలొక్కటే. దాన్ని కాస్తా పీసుల క్రింద ఎర్రటోపీల వాళ్ళు పంచేసుకుంటే ఎలా?

పోలీసు వాళ్ళతో అప్పటికే ఓ అవగాహన ఏర్పరచుకుని ఉండడం వల్ల ఓ చక్రమూ, సీటూ కోల్పోయిన ఆ సైకిల్ను నా స్వాధీనంలోకి తీసుకోవడం పెద్ద కష్టం కాలేదు.

సరిక్రొత్త ముందు చక్రమూ, సీటు బిగింపచేయించిన తరువాత ఓ మిత్రుని ఇంట్లో ఆ సైకిలు ఉంచి కొంతకాలం పాటు దాన్ని పదిల పరుస్తూ ఆ వ్యక్తి తాలూకు వారెవరైనా దొరుకుతారేమో తెలుసుకునే బాధ్యత అతని మీదుంచాను.

మొత్తానికి ఎంత ప్రయత్నించినా... కేసులోంచీ వెలుపల పడలేకపోయాను.

ఆరునెలల తరువాత ఆర్నెల్ల సాధారణ జైలు శిక్ష విధించింది జిల్లా కోర్టు. దిగులు పడిపోయిన నాకు ధైర్యం చెప్పారు బంధుమిత్రులు.

“ఏం భయపడవద్దు... హైకోర్టులో పేరు మోసిన లాయర్లు మనవాళ్ళే ఉన్నారు. కేసు కొట్టించెయ్యొచ్చు!” అన్నాడు నా తరపు లాయరు.

మరో సంవత్సరం పాటు హైకోర్టులో సాగింది కేసు. కానీ అక్కడా నాకు చుక్కెదురయింది.

హైకోర్టు కూడా జైలు శిక్ష ఖాయపరిచేశాక అన్ని రోజులుండిన చిన్న అద్దె ఇల్లు కూడా ఖాళీ చేసేసి, అప్పుడప్పుడే నన్ను గుర్తుపడుతూ బోసినవ్వులు చిందిస్తున్న బాబునూ, దిగులు పడిపోయిన భార్యనూ మళ్ళీ పుట్టింటికి పంపేసి నేను జిల్లా జెయిలుకు చేరకతప్పలేదు.

బంగారంలాంటి ఉద్యోగం పోతున్నందుకూ, భార్యా పిల్లల్ని వదిలి జైలు చేరినందుకూ నేను పెద్దగా బాధ పడలేదు... ఎందుకంటే “జీవితంలో సర్వస్వం కోల్పోయినా ఒక్కటి మాత్రం మిగిలే ఉంటుంది. అదే భవిష్యత్తు!” అన్న ఓ రచయిత మాటను దృఢంగా నమ్మే మనిషిని నేను.

కానయితే చనిపోయిన వ్యక్తి తాలూకు వాళ్ళెవరూ అతన్ని వెతుక్కుంటూ రాకపోవడం మాత్రం నాకు తీవ్రమైన నిరాశనూ, నిస్పృహనూ, అంతులేని బాధనూ

కలిగించింది.

"అమ్మా! సైంకిలుకు బీగం లేదు. లోపల పెడతాను!" అన్న అతని తమాషా అయిన మాట సదా నా చెవుల్లో మెదులుతుండగా, కాస్సేపు... ఆనాటి అతని సజీవమైన ముఖాకృతీ, మరికాస్సేపు... మా ఇంట్లో మాడిమసయిపోయిన ఆ యువకుడి శవాకృతీ కళ్ళముందు పదేపదే మెదులుతూ నాకు అంతు తెలియని ఆవేదనను సృష్టించాయి. అతని వాళ్ళెవరైనా, ఎక్కడైనా ఎంత బాధపడుతున్నారో, ఏమో?? అన్న ఆలోచన కూడా పదే పదే వేధించసాగింది వంటరితనం మధ్యన.

జైలులో కొద్దిరోజులపాటు ఓ చివర్న, చిన్న గదిలో వంటరిగా ఉండాల్సి వచ్చింది. అప్పుడయితే రాత్రులందు అతడు ఊచల కిటికీలోంచీ నాకేసి నవ్వుతూ చూస్తున్నట్లుగానో, లేదా మాడి మసయిపోయిన రూపంతో గదిలో అవతలి వైపు పడుకున్నట్లుగానో అనిపిస్తూ అంతులేని, అంతు తెలియని భయాన్ని కలిగిస్తూ నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చింది.

ఏ జన్మలో ఏ పాపం చేశానో కానీ... పరిహారంగా మొత్తానికి ఎలాగో జైలు జీవితం ముగిసింది.

జైలులోంచీ వెలుపలికి రావటం అవసరం... మా నాన్నగారు అటునుంచీ అటే రైలెక్కించి తిరుపతి తీసుకువెళ్ళి తిరుమల కొండ కాలినడకన ఎక్కించి గుండు గీయించి శ్రీవారి దర్శనం చేయించిన తరువాతే ఇంటి దిక్కు తిరుగనిచ్చారు.

అనుకున్నట్లుగానే ఉద్యోగం ఊడిపోయింది.

కొంత పొలం అమ్మేసి పల్లెనుండీ కొంత మొత్తం తెచ్చి ఇచ్చారు నా తల్లితండ్రులు. దాంట్లో కొంత ఖర్చుచేసి పాడుబడ్డ ఇంటిని బాగు చేయించాను. అయితే అందులో నివసించడానికి నా భార్య అంగీకరించలేదు. తను, బాబు పుట్టింట్లోనో లేదా మా పల్లెలోనో ఉండిపోసాగారు.

నేను మాత్రం ఆ ఇంటిలోనే వంటరిగా ఉండి ఓ అమాయకుడి అకాల మరణానికి సంబంధించిన బాధను, దుఃఖాన్ని భయాన్ని అనుభవిస్తూ... బెంగుళూరు, చెన్నై, హైదరాబాదు నగరాలకు టమేటాలు ఎగుమతి చేసే చిన్న వ్యాపారాన్ని ప్రారంభించాను.

మొదట్లో పెద్ద లాభదాయకంగా అనిపించకపోయినా క్రమంగా ఊపందుకుని లాభాల పంట పండించడం మొదలు పెట్టింది వ్యాపారం. పండించే రైతులకన్నా

నాకే ఎక్కువ లాభాలు గిట్టడం మొదలయింది క్రమంగా.

కాస్త నిలదొక్కుకోగానే ఉన్న అకౌంట్లు కాక మరో జాతీయ బ్యాంకులో మరో అకౌంటు ఓపెన్ చేసి నా సంపాదనలో ఐదుశాతం అందులో క్రమం తప్పకుండా జమ చేస్తూ వచ్చాను... కానీ... ఏనాడు అందులోంచీ ఒక్క రూపాయి అయినా వెలికి తీయలేదు. ఆ ఖాతా నా అంతరంగిక ఖాతాగా ఉండిపోయింది.

మాకు మరో పాప కలిగి, నా వ్యాపారం మరింత అభివృద్ధి చెందిన తరువాత కూడా ఆ ఇంట్లో కాపురం ఉండడానికి ఇష్టపడకపోయింది నా భార్య.

తన భయం పోవాలంటే ఆ ఇల్లు పూర్తిగా మార్చి వెయ్యాలి. అయితే ఆసాంతం మార్చేస్తే చనిపోయిన ఆ అభాగ్యుడిని వెతుక్కుంటూ ఎప్పుడైనా, ఎవరైనా వస్తే ఆచూకీ చెప్పేవారు లేకపోవచ్చు.

అందుకే వరండా, ముందుగదీ ఏ మాత్రం మార్చకుండా మునపట్లా ఎలా ఉన్నది అలాగే ఉంచేసి తతిమ్మా ఇల్లు మొత్తం తీయించి వేసి అత్యంత అధునాతనంగా పునర్నిర్మింప చేశాను. మరోమారు సంప్రోక్షణ జరిపించి, ప్రాణ ప్రతిష్ట చేయించి, గృహప్రవేశం చేయడానికి సిద్ధం చేశాక నా శ్రీమతి ఆ ఇంట అడుగుపెట్టడానికి అంగీకరించింది.

అయినా ఆమెకు ఆనాటి భయం, దిగులు పోలేదు. అందుకే ఆర్నెల్లపాటు గ్యాస్ ముట్టుకోకుండా కిరోసిన్ స్టవ్వుల మీదే వంట కానిచ్చింది.

ఓ వంట మనిషిని ఏర్పాటు చేసి ఏడాది పాటు ధైర్యం చెప్పి కిరోసిన్ స్టవ్వులు మరుగున పడేలా చెయ్యగలిగాను చివరికి.

ప్రతి మాహాలయ అమావాస్యనాడు నా పూర్వీకులతోపాటు పేరయినా సరిగ్గా గుర్తులేని ఆ అనామకుడికి తర్పణాలు వదులుతున్నాను అశ్రుతర్పణంతో పాటు.

ప్రస్తుత నా స్థాయికి ఏ మాత్రం బాగుండకపోయినా అప్పుడప్పుడు ఆ సైకిలు తొక్కుతున్నాను... దాన్నెవరైనా గుర్తుపట్టి ఆ అభాగ్యుడి తాలూకు వాళ్ళ ఆచూకీ చెప్పగలరేమోననే ఆశతో!

అంతేకాదు... ప్రతి ఏట ఆ ప్రమాదం జరిగిన తేదీ నాడు సైకిలుకు పూజ కానిచ్చి వేరే పనేమీ చెయ్యకుండా ప్రత్యేకంగా దానిమీద ఊరంతా తిరిగివస్తున్నాను.

కానీ నా ఆశ... అడియాశగానే మిగిలిపోతోంది.

మధ్యాహ్నందాకా సైకిలు మీద అనేక వీధులు తిరిగి చివరికి డీలక్స్ హోటలు ముందు ఆపాను.

భోజనానికి రావటం లేదని సుగాత్రికి ఫోన్ చేసి చెప్పేసి హోటల్‌లో భోజనం కానిచ్చాను.

ఎండకాస్త తగ్గాక మళ్ళీ సైకిలెక్కి నెమ్మదిగా వీధులమ్మట తిరగడం ప్రారంభించాను.

వయసు ప్రభావం కాబోలు... సైకిలు మునుపట్లా తొక్కలేకపోతున్నాను. అలసట వస్తోంది!

సైకిలూ పాతబడి పోతోంది మరి!!

నెమ్మదిగా మిషన్ కాంపౌండులోకి పోనిచ్చి సైకిలు ఓ చెట్టు క్రింద ఆపి ఓ రాతి బండమీద కూర్చున్నాను సాయంకాలం దాకా.

ఆటలాడుకుంటున్న పిల్లల దగ్గరునుండీ, అలసిపోయి మానసిక విశ్రాంతి కోసం వచ్చే పెద్దవాళ్ళవరకూ ఎందరో చూశారు సైకిల్ను. కానీ దాని పూర్వాపరాలనూ, యజమానినీ గుర్తుపట్టగల ఆపద్బాంధవులెవ్వరూ కనిపించలేదు.

సూర్యుడు అస్తమించాక నిరాశగా నిట్టూర్చి సైకిల్ను నెట్టుకుంటూ ఇంటి ముఖం పట్టాను.

* * *

సుగాత్రి దేవుడి దీపాలు వెలిగించాక దేవుడి గదిలో... ఆ అనామకుడి ఆత్మకు శాంతి కలిగించమనీ, అతని వాళ్ళెవరున్నా, ఎక్కడున్నా సుఖసంతోషాలతో జీవించేలా చూడమనీ భగవంతుని ప్రార్థించి, నెమ్మదిగా వచ్చి వరండాలోని పడక్కుర్చీలో నిస్సత్తువుగా వాలాను.

నా అంతరంగిక ఖాతాలో లక్షలాది రూపాయలు మూలుగుతున్నాయిప్పుడు. ఆ ఖాతాను గూర్చి మాత్రం కనీసం నా భార్యా పిల్లలకయినా తెలియదు ఇప్పటికీ!

ఆ అనామకుడి తాలూకు వాళ్ళెవరైనా, ఎప్పుడైనా వస్తే వారికి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఆ ఖాతా ప్రారంభించినపుడు ఆ ఖాతాలో అంత డబ్బు చేరుతుందని నేనెప్పుడూ అనుకోలేదు. కానీ... ఆ మొత్తం పెరుగుతూంటే నా ఆనందం పెరుగుతూ

వచ్చింది ఇంతకాలం... కనీసం అతని తాలూకు వాళ్ళకయినా న్యాయం చేయగలుగుతానని!

కానీ ఇప్పుడు నిరాశ ఆవరిస్తోంది!

నిరాశగా పాత సైకిలుకేసి చూశాను. ✪

*(www.koumudi.Net, ఫిబ్రవరి, 2008, రచన మాసపత్రిక, మార్చి 2008)*

# దెయ్యం

పెద్దంత తోట మధ్యన లంకంత బంగళా పెద్దాయనది.

"ఆ పాడు కొరివి దయ్యాలేవో ఈ తోటలోనో, ఆ బంగళామీదో అగ్గిబడిపోరాదా? కూటికీ, గుడ్డకీ తడుముకునే మన గుడిసెల మద్దెన తారట్లాడి మన ఉసురు దీయకపోతే" అన్నాడు చిన్న రంగడు... తగ్గు స్వరంతోనే అయినా, ఆక్రోశంగా.

"నోరుముయ్యరా... ఎవరైనా ఇన్నారంటే ముందు నీ మక్కెలిరగదన్ని ఆనక కొదవకు నీ పక్కన కూకున్న నేరానికి నా తాట వొలుత్తారు!" అన్నాడు చిన్నరాముడు భయంగా అటూ, ఇటూ చూస్తూ.

వారిద్దరూ తోటమధ్యని రాగిమాను పెద్దరుగు క్రింద మట్టినేలమీద కూర్చుని ఉన్నారు. వారేకాదు... వారి పల్లెకు సంబంధించిన చిన్నా, పెద్దా మగవాళ్ళంతా దాదాపు నలభయి మంది దాకా అక్కడే నేలమీద చెట్ల క్రింద గుంపులు గుంపులుగా నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నారు.

చిన్న రంగడు మళ్ళీ ఏదో అనబోయాడు... అంతలో...

అంతమంది మనుష్యులూ ఒక్కసారిగా, నిశ్శబ్దంగా కదలిన చిరుసవ్వడి... కళ్ళకు కన్పించని, చెవులకు విన్పించని కలకలం ఏదో విచిత్రంగా కదలాడుతూ ధ్వనించింది.

చిన్నరాముడూ, చిన్న రంగడూ కూడా బంగళావైపునకు చూశారు. చిన్న సింహాసనం లాంటి పెద్ద కుర్చీ నెత్తుకుని మోసుకుంటూ ఇద్దరు మనుషులు బంగళా వైపు నుండీ వస్తూ కన్పించారు.

ఐదు నిముషాలలో వారు రావడమూ, రాగిమాను క్రింద పెద్దరుగుమీద ఆ

కుర్చీని దించి నిలబెట్టడమూ జరిగిపోయాయి.

మరో రెండు మూడు నిముషాలకు మళ్ళీ కలకలం. ఈసారి కాస్త స్పష్టంగానే...

కూర్చున్న వారంతా లేచి నిలబడ్తున్నారు... గబగబా చకచకా! చప్పున పైకి లేవలేని ముసలివాళ్ళకు పక్కవాళ్ళు చేయూతలిచ్చి లేపి నిలబెడ్తున్నారు. అందరితోపాటు చిన్నరాముడు, చిన్నరంగడూ కూడా లేచి నిలబడి బంగళావైపు చూశారు మరోమారు.

రాజఠీవితో నడచి వస్తున్నాడు పెద్దాయన తెల్లటి దుస్తులతో మరింత తెల్లగా వెలిగిపోతూ.

“దండాలయ్యా!”

మూకుమ్మడి నమస్కారాలందుకుంటూ వెళ్ళి రచ్చబండ మీద వెల్వెట్ మెత్తలు అందంగా అతికున్న పెద్దకుర్చీలో మహరాజులా దర్జాగా కూర్చున్నాడు.

“దొరా” అన్నాడు చిన్నస్వామి ఉపోద్ఘాతంగా.

“ఊ... కానీ...” అన్నట్లుగా చూశాడు పెద్దాయన.

“దొరా, రోడ్డారకాడ పల్లెలో రాత్రుల్లో కొరివిదయ్యాలు తిరుగుతున్నాయట! మూడు నెలల్లో నాలుగడ్డపిండ్లు కాలిపోయి ఆ యిండ్ల మనుషులు ఏసుకున్న గుడ్డల్దప్ప, ఇంకేం లేకుండా అన్యాయం అయిపోయారు. సీకటిబడ్తే సాలు ఆ పల్లెలో ఒక్క మనిషికీ కడుపారా తిండిలేదు, కంటారా నిద్రలేదు. గోడాడి పోతున్నారు దొరా!” అన్నాడు చిన్నసామి.

బసినికొండ మీద నుండీ బండరాళ్ళు దొర్లిపడినట్లుగా పెద్దగా నవ్వాడు పెద్దాయన.

“వాళ్ళ పల్లెమీద కొరివిదయ్యాలు పడ్తే నేనేం చేసేదిరా? నేనేమయినా మంత్రగాడినా? కాకపోతే భూతవైద్యుడినా?” అన్నాడు నవ్వడం ఆపిన తరువాత.

“మంత్రాలు, తంత్రాలు అన్నీ అయినాయి దొరా! కొరివి దయ్యాలు లొంగేరకంగా కన్పించడం లేదు.”

“అయితే నేనేం చేసేదిరా?”

“గొప్ప ధరమ ప్రభువులు... తమరే ఏదయినా దారి చూడాల!”

“సరే రా... ఇంతమంది ఎంతో ఆశతో నన్నాశ్రయించి వచ్చారు. ఏదో ఒక

ఆలోచన చేస్తాను. అందర్నీ పదిరోజులు ఆగిరమ్మని చెప్పు" అన్నాడు పెద్దాయన ఆలోచనగా.

అలా అంటూనే కుర్చీలోంచీ లేచి చకచకా రచ్చదిగి వచ్చేశాడు.

వంగివంగి దండాలు పెడ్తున్న పల్లె ప్రజల మధ్య నుండీ ఠీవిగా నడచి బంగళావైపు వెళ్ళిపోయాడు చరచరా.

సభ ముగిసింది!

✶ ✶ ✶

పది రోజుల తరువాత పెద్దాయన తోటలో ఆశగా పోగయిన రోడ్డువారకాడపల్లె ప్రజలకు పెద్దాయన దర్శనమే లభ్యం కాలేదు. 'ఆ విషయంగానే తీవ్రంగా ఆలోచిస్తున్నారనీ ఇరవయి రోజులు ఆగివస్తే ఏదో ఒకటి చేస్తారనీ' కబురు వచ్చింది బంగళాలోపలినుండీ.

✶ ✶ ✶

చాలా భారంగా ఆ ఇరవయి రోజులూ గడిచాయి. పెద్దాయనను దర్శనం చేసుకున్నాక గడచిన మొత్తం... ఆ నెలరోజులలోనూ రోడ్డువారకాడ పల్లెమీద కొరివిదయ్యాలు నాలుగు పర్యాయాలు దాడి చేసాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకుని ఏం లాభం? దయ్యాల దెబ్బకు నాలుగు గుడిసెలు, రెండు అడ్డపిండ్లు ఆహుతయిపోయి ఆ ఇండ్ల వాళ్ళూ బజార్న పడిపోయారు!

✶ ✶ ✶

ఎట్టకేలకు పల్లె ప్రజలకు పెద్దాయన దర్శనమైంది.

మధ్యలో జరిగిన నష్టాలు, కష్టాలు పెద్దాయనకు సవివరంగా ఏకరవు పెట్టబడ్డాయి చిన్నస్వామి ద్వారా.

"ఒకపని చెయ్యండిరా... ఆంజనేయస్వామి గుట్టకింద నా స్థలం ఉంది కదా! ఆ రాళ్ళ చేన్లో అందరూ పోయి ఇండ్లు కట్టుకోండిరా!" అన్నాడు పెద్దాయన ఉదారంగా.

నిజానికి ఆ భూమి రాళ్ళ చేను కాదు... రాళ్ళ గుట్టే! కానయితే భయంతో చచ్చిపోతున్న జనాలకు మరోదిక్కు దగ్గరి దాపుల్లో లేదు.

సంశయిస్తూనే చిన్నరంగడు అరుగు క్రిందికి పోయాడు.

పెద్దాయన కాళ్ళవైపు అరుగుమీద చేతులు పెట్టి మొక్కుకుంటూ "అక్కడెక్కడా నీటి చుక్కలేదు దొరా!" అన్నాడు వినయంగా, భయంగా.

"అవును దొరా!" అంటూ గుంపులోంచే వత్తాసు పలికాడు చిన్నరాముడు.

అప్పుడు అవునవునన్నారు ఒకరి తరువాత మరి ఒకరు.

చిన్నసామి మధ్యవర్తిత్వంతో అరగంటపాటు సభ కొనసాగింది మళ్ళీ.

పెద్దాయన తన ఖర్చుతో ఆ ప్రాంతంలో రెండు బోరుబావులు తవ్వించి నీటి ఆదరువుకు ఏర్పాటు చెయ్యడానికి అంగీకరించాడు.

స్థలమిచ్చినందుకూ, బోరుబావులు ఏర్పాటు చేయించినందుకూ ప్రతిగా ఊరు ఖాళీ అయ్యాక రోడ్డువార కాడ పల్లెను బుల్‌డోజర్లతో నేలమట్టం చేసేసి, పెద్దాయన స్వాధీనపరచుకుని కొరివిదెయ్యాలతో తన తంటాలేవో తను పడుకునేలా ఒప్పందం కుదిరింది.

* * *

సంవత్సరం రోజులు గడిచాయి.

తినీ తినకా, చచ్చీ చెడీ అందరూ కలసి పెద్దాయన బదులిచ్చిన రాళ్ళచేను చదును చేసుకుని ఇండ్లు కట్టుకోగలిగారు ఈ పాటికి.

అయితే పెద్దాయన వేయించిన రెండు బోర్ల నుండీ వచ్చే చాలీచాలని నీళ్ళతో బాగా ఇబ్బందులెదురయ్యాయి. అందువల్ల వర్షం పడ్డప్పుడు నిరవధికంగా గుట్టమీద నుండి వచ్చే వాననీరూ, ఊటనీరూ నిలవయ్యేలా తమ కొత్తపల్లె పక్కగా ఓ కుంటను తమ శ్రమతో తామే తవ్వి నిర్మించుకోగలిగారు.

ఏమయినా పాతవూరు రోడ్డుకు పక్కనే ఉండేది కాబట్టి కూలీ నాలీ పనులకు, ఇతర పనులకు సులువుగా వెళ్ళివస్తూ సుఖంగా బ్రతుకులు వెళ్ళదీస్తుండిన పల్లె ప్రజలు ఆ సులువు, సుఖాలకు దూరమయ్యారు. కొత్తవూరు రోడ్‌పాయింటు నుండీ రెండు కిలోమీటర్ల అవతలుండడం వల్ల, సరయిన దారి సౌకర్యం లేకపోవడం వల్లా చాలా నెలలపాటు ఇబ్బందులు పడ్డారు.

చివరికి అలవాటు పడసాగారు కాలిదారికి, దూరానికీ!

ఖాళీ అయిన రోడ్డు వారకాడ పల్లె మొత్తాన్నీ పెద్దాయన మనుషులు ప్రొక్లెయినర్‌తో పడగొట్టించారు. అక్కడ నేలమట్టమయిన ఇండ్లలోంచీ తీయబడ్డ కట్రాయి మొత్తాన్ని లారీలకెక్కించారు. టవున్‌లో అల్లుడు కాంట్రాక్టు తీసుకున్న స్కూలు భవనం నిర్మింపబడే స్థలానికి ఒక్క రాతిని వదలకుండా చేర్చేశాయి లారీలు.

మన్నూ మషాణం అంత వైదొలిగాక రోడ్డు రోలర్‌తో తొక్కించి శుభ్రంగా చదును చేయించారు. అద్దంలా తయారయిన పెద్దంత నేలకు ఫెన్సింగ్ వేయించేసి కొరివిదయ్యాల పీచమణిచి, వాటికి నిలవనీడ లేకుండా చేసేశారు.

అక్కడ ఉనికిని కోల్పోయిన కొరివి దయ్యాలు రెండు కిలోమీటర్ల అవతల రోడ్డుకు కాస్త సమీపంగానే వున్న అంకిపాడు పల్లెలో చేరి రాత్రులందు తమ ప్రతాపాలు చూపడం మొదలుపెట్టాయి నెమ్మదిగా.

✶ ✶ ✶

అంకిపాడు పల్లె ప్రజలు పెద్దాయన బంగళా ముందర తోటలో వినయంగా సభ తీరడానికి మరో పదిమాసాల కాలం పట్టింది.

✶ ✶ ✶

మొత్తానికి హృదయమున్న దొడ్డమారాజు పెద్దాయన.

రెండు నెలల తరువాత అంకిపాడు గుట్టక్రింద తన రాళ్ళ చేనులో అంకిపాడు పల్లె ప్రజలు ఇండ్లు కట్టుకోవడానికీ, తను స్వయంగా రెండు బోర్లు వేయించడానికీ, చివరగా అంకిపాడు పల్లె స్థలాన్ని స్వాధీనపరచుకోవడానికీ అంగీకరించాడు.

✶ ✶ ✶

అంకిపాడు పల్లె ఖాళీ అవడానికీ, చదునయి చుట్టూ ఫెన్సింగ్ పడడానికీ మరో సంవత్సరకాలం పట్టింది.

✶ ✶ ✶

“ఇన్నాళ్ళూ మనం వాళ్ళకు ఇస్తూ వచ్చిందే బాగా ఎక్కువ కదరా?” అన్నాడు పెద్దాయన.

“వాళ్ళూ ఇన్నాళ్ళూ ప్రాణాలకు తెగించి కొరివి దెయ్యాలాట ఆడినారు కద

దొరా?" అన్నాడు చిన్నస్వామి చిన్నస్వరంతో.

"సరే... సరే..." అంటూ లోపలికి వెళ్ళిన పెద్దాయన పదినిముషాలలో మూడు నోట్ల కట్టలు పట్టుకుని తిరిగి వచ్చాడు.

"ఇందులో రెండు కట్టలు ఆ మొరటోళ్ళిద్దరికీ ఇచ్చి ఊర్లకు పంపించెయ్యి. మళ్ళీ అవసరం పడినప్పుడు పిలిపిస్తామనీ, ఎక్కడయినా నోరు జారితే పీకలు తెగిపోతాయనీ చెప్పి పంపు. ఓ కట్ట నీవు తీసుకో!" అన్నాడు పెద్దాయన.

వంగి వంగి దండాలు పెడ్తూ శెలవు తీసుకున్నాడు చిన్నస్వామి.

✶ ✶ ✶

గది తలుపులు, కిటికీలు మూసి తరువాత గదిలోపలి ఫోను రిసీవర్ అందుకుని నెంబరు నొక్కాడు పెద్దాయన.

"శంకరా, రెండు పల్లెలూ ఖాళీ చేయించి, చదును చేయించి పెట్టడం అయింది. రెండు స్థలాల మధ్యనా లింక్ పడేలా రోడ్డు దగ్గరగా వచ్చే భూములలోంచీ చాలా స్థలాలు కొనుగోలు చేయడం కూడా అయిపోయింది. ఇంకా మధ్యలో మిగిలిన బిట్లను సెజ్‌పాయింట్ల క్రింద తీసుకుని మనకు అప్పుజెప్పే ఏర్పాట్లకు తగిన వారితో తగిన విధమైన ఒప్పందాలు కూడా కుదర్చుకున్నాను. అదీ సానుకూలం అయిపోయినట్లే. ఇక నీవు ఆ సేట్‌తో మాట్లాడి సెటిల్ చెయ్యాల్సిందే!" అన్నాడు.

"......"

"ఆ, అధికార యంత్రాంగానిదేముందిలే... అంతా లెక్కతోనే నడచిపోతుంది! మనకు తెలీన్దేముంది? ఇంక పెద్ద వాళ్ళనూ సరి చేసుకుంటాను సులభంగా! వాళ్ళకే ఇబ్బందీ ఉండదు!"

"......."

"అలాగే, అలాగే... ఒకే, ఒకే!!" అంటూ బిగ్గరగా పెద్దగా నవ్వుతున్నాడు పెద్దాయన దెయ్యంలా. ✪

*(స్థానిక పాలన, నవంబర్ 2011)*

**టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**
3-169-16 రామారావు కాలనీ
బాపూజీ మునిసిపల్ స్కూల్ రోడ్
**మదనపల్లె - 517 325**
చిత్తూరు జిల్లా (ఆం.ప్ర.)
ఫోన్ : 08571 - 221963
సెల్ : 93472 98942